# ప్రాజెక్టుల అమలు

జలయజ్ఞం కార్యక్రమాన్ని వర్షాభావానికి గురయ్యే ప్రాంతాలు, నిర్జల ప్రాంతాలకు, ముఖ్యంగా రాష్ట్రంలోని తెలంగాణ, రాయలసీమ ప్రాంతాలకు స్వాంతన కలిగించడం కోసం చిరకాలంగా కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టుల అమలును వేగవంతం చేసి నిర్దిష్టమైన గడువులోగా పూర్తి చేయడం కోసం చేపట్టడం జరిగింది. ఈ లక్ష్యపు సాధన, మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల స్థితిగతులకు సంబంధించిన ఆడిట్ సమీక్ష ఫలితాలను ఈ అధ్యాయంలో ఇవ్వడమైంది.

## 5.1 సాగునీటి సామర్థ్యాన్ని కల్పించడం

### 5.1.1 లక్ష్యాలు - సాధన

26 ప్రాజెక్టులను ప్రాథమ్యమైనవిగా ప్రభుత్వం మొదట్లో గుర్తించింది. ఆతర్వాత, వీటిని 86 కు పెంచారు. వీటిలో 4 వరద గట్లు, 8 ఆధునికీకరణకు సంబంధించిన పనులు కూడా ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు ఆయా సంవత్సరాల్లో ప్రభుత్వం ఇచ్చిన మంజూరీ వివరాలు కింది విధంగా ఉన్నాయి.

పట్టిక - 5.1

| ఆర్థిక సంవత్సరం | మంజూరు చేసిన ప్రాజెక్టుల సంఖ్య | మొదట్లో ఇచ్చిన పాలనాపరమైన మంజూరీ (₹ కోట్లలో) |
|---|---|---|
| 2003-04 కు ముందు | 8 | 785.15 |
| 2003-04 | 4 | 1,353.89 |
| 2004-05 | 36 | 71,727.14 |
| 2005-06 | 6 | 2,397.16 |
| 2006-07 | 3 | 4,643.68 |
| 2007-08 | 10 | 11,313.17 |
| 2008-09 | 19 | 93,389.17 |
| మొత్తం | **86** | **1,85,609.36** |

*మూలం: నీటిపారుదల శాఖలోని ప్రాజెక్టు పర్యవేక్షణ విభాగం రికార్డులు*

ప్రాథమ్యమైనవిగా ప్రభుత్వం గుర్తించిన 26 ప్రాజెక్టులు రెండు (8 ప్రాజెక్టులు) నుంచి ఐదేళ్లలోగా (18 ప్రాజెక్టులు) పూర్తి కావాల్సి ఉంది. ఐతే, 2012 సెప్టెంబరు నాటికి, మొత్తం 86 లో నాలుగు ప్రాజెక్టులు[1] (2008-09లో మంజూరైనవి) ఇంకా మొదలు కావాల్సి ఉంది. మిగిలిన 82 ప్రాజెక్టుల్లో 13[2], ఆమోదించిన ₹1,441 కోట్లకుగాను ₹1,538 కోట్ల వ్యయంతో పూర్తయి, ఆశించిన లక్ష్యాలను సాధించాయి. వీటిల్లో 9 మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టులు. వీటి ద్వారా 1.14 లక్షల ఎకరాల ఆయకట్టును కల్పించడం, 23,921 ఎకరాలను స్థిరీకరించడం జరిగింది. మిగిలిన నాలుగూ భారీ సాగునీటి ప్రాజెక్టులు. వీటి ద్వారా 22,846 ఎకరాల కొత్త ఆయకట్టు ఏర్పాటు, 1.65 లక్షల ఎకరాల స్థిరీకరణ జరిగింది.

పూర్తయి వినియోగంలోకి వచ్చిన 13 ప్రాజెక్టులే కాకుండా, ఏదైనా ప్రాజెక్టు పాక్షికంగా పూర్తికాగానే ప్రభుత్వం కొంత ఆయకట్టుకు నీటిని విడుదల చేస్తూ వస్తోంది. ఈ విధంగా 2012 సెప్టెంబరు నాటికి ప్రభుత్వం 12.74 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టుకు నీటిని విడుదల చేయడంతో పాటు 2.07 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించింది. ఆడిట్ గమనించిన అంశాలు ఇలా ఉన్నాయి :

---

[1] (i) కంతనపల్లి (ii) ఉత్తరాంధ్ర సుజల స్రవంతి (iii) నాగావళి వ్యవస్థ ఆధునికీకరణ (iv) ఏలేరు డెల్టా వ్యవస్థ ఆధునికీకరణ

[2] భారీ ప్రాజెక్టులు: చాగల్నాడు, రామతీర్థం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, అలీసాగర్, గుత్పా; మధ్య తరహా ప్రాజెక్టులు : పెద్దగెడ్డ జలాశయం, మద్దువలస మొదటి స్టేజి, పెద్దేరు జలాశయం, సూరంపాలెం, కొవ్వాడ కాల్వ, స్వర్ణముఖి బ్యారేజి, వెలిగల్లు, ర్యాలివాగు, గద్దెన సుద్దవాగు

- జలయజ్ఞం కింద అప్పగించిన మొత్తం 413 ప్యాకేజీలకుగాను (ఆధునికీకరణ, వరదగట్ల పనులు మినహాయించి), 369 ప్యాకేజీలు 2012 సెప్టెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉంది.
- 2012 సెప్టెంబరు నాటికి 51 ప్యాకేజీలు (14 శాతం) పూర్తి కాగా, మిగతా 318 (86 శాతం) ప్యాకేజీలకు సంబంధించిన పనులు కొనసాగుతున్నాయి.
- ఎనిమిది (16 శాతం) ప్యాకేజీలు నిర్దేశిత గడువులోగా పూర్తయ్యాయి. మిగిలిన 43 ప్యాకేజీలను పూర్తిచేయడంలో 2 నుండి 72 నెలల వరకూ జాప్యాలున్నాయి.

ప్రాథమ్యమిచ్చిన 26 ప్రాజెక్టులలో లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు, 2012 సెప్టెంబరు నాటికి వాటి పరిస్థితి, లక్ష్య సాధన వివరాలు ఈ కింద ఉన్నాయి.

పట్టిక - 5.2

(ఎకరాలలో)

| వరుస సంఖ్య | వివరాలు | లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు | పూర్తైన ప్రాజెక్టుల్లో[3] కల్పించిన ఆయకట్టు | స్థిరీకరించినది |
|---|---|---|---|---|
| 1 | రెండేళ్లలో పూర్తికావాల్సిన 8 ప్రాజెక్టులలో | 1108866 | 0 | 92584 |
| 2 | ఐదేళ్లలో పూర్తికావాల్సిన 18 ప్రాజెక్టులలో | 5017134 | 0 | 72874 |
| | మొత్తం | 6126000 | ---- | 179679 |

*మూలం : జలయజ్ఞం పుస్తకం, నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ (పీపీఎంయు) రికార్డులు*

ప్రాంతాలవారీగా, మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల్లో లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు, కల్పించిన ఆయకట్టు (లక్షల ఎకరాల్లో) (చార్టు-5.1), చేపట్టిన, పూర్తైన ప్రాజెక్టులకు (చార్టు-5.2) సంబంధించి 2012 సెప్టెంబరు నాటి పరిస్థితిని ఈ కింద చూపడమైంది :

చార్టు - 5.1 (లక్షల ఎకరాలలో)




*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ రికార్డులు*

చార్టు - 5.2




*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ రికార్డులు*

[3] పూర్తయిన 13 ప్రాజెక్టులలో, 3 మాత్రమే ప్రాథమ్యమైనవిగా గుర్తించిన 26 ప్రాజెక్టుల్లో ఉన్నాయి. ఈ మూడు ప్రాజెక్టులూ ఆయకట్టు స్థిరీకరణకు సంబంధించినవి

సమగ్ర సర్వే, ఇన్వెస్టిగేషన్‌ల తర్వాత పనుల పరిధి, నిర్దేశాలు, డిజైన్లలో చేసిన మార్పులతో సహా ప్రాజెక్టులను పూర్తి చేయడంలో జాప్యం కారణంగా మొదట్లో ఆమోదాన్నిచ్చిన మొత్తంతో పోలిస్తే, ప్రాజెక్టుల వ్యయం భారీగా ₹52,116 కోట్లు (2012 సెప్టెంబరు నాటికి) పెరిగింది. మచ్చుకు తనిఖీ చేసిన 26 ప్రాజెక్టులలో నీటిపారుదల శాఖ రికార్డుల ప్రకారం ప్రాంతాలవారీగా పెరిగిన వ్యయభారాన్ని ఈ కింద ఇవ్వడమైంది.

ఏకకాలంలో పలు ప్రాజెక్టుల అమలును చేపట్టిన కారణంగా, నిధుల లభ్యతను మదింపు వేయడం, లక్షిత ప్రాంత ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రాజెక్టుల ప్రాథమ్యాలను నిర్ణయించడం, వాటిని పూర్తి చేయడానికి అవసరమైన వనరుల కేటాయింపు జరిగేలా చూసుకోవడం అనివార్యం.

చార్టు - 5.3




2012 మార్చి వరకు జలయజ్ఞం కార్యక్రమం మీద ₹61498 కోట్లను ఖర్చు చేశారు. ఐతే, 2004-12ల మధ్యకాలంలో ఏ సంవత్సరంలోనూ అవసరానికనుగుణంగా ఈ కార్యక్రమానికి తగినన్ని నిధులను కేటాయించలేదు. 2004-08 మధ్యకాలంలో కేటాయింపుకు తగినట్టుగా ఖర్చులు ఉన్నప్పటికీ, 2008-11 మధ్యకాలంలో నిర్మాణ వ్యయం తగ్గి, తిరిగి 2011-12 మధ్యకాలంలో పుంజుకుంది. ఆ వైనాన్ని ఈ కింది చార్టులో చూడవచ్చు.

చార్టు - 5.4 (₹ కోట్లలో)




*గమనిక : (i) అవసరమైన నిధులు : పాలనాపరమైన మంజూరీ మొత్తాలను ఒప్పందాల కాలాన్ని అనుసరించి విభజించడం జరిగింది*

*(ii) బడ్జెట్ కేటాయింపులు, ఖర్చులకు నీటిపారుదల శాఖ ఇచ్చిన సమాచారం ఆధారం (భారీ, మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులకు సంబంధించి)*

*(iii) ఖర్చులో జలయజ్ఞం కిందకు రాని ఇతర భారీ, మధ్యతరహా ప్రాజెక్టులకు చెందిన ₹12,703 కోట్లు కూడా కలిసి ఉంది*

2008-09, 2009-10 మధ్యకాలంలో రాష్ట్ర ఆర్థిక రంగం తగ్గుముఖం పట్టిన కారణంగా కొంత అనిశ్చితి పరిస్థితి ఉందని, 2009 నుండి ప్రాజెక్టుల ప్రాధమ్యాలను నిర్ణయిస్తున్నామని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది (2012 జూలై). ఇబ్బందులు ఎదురైనప్పటికీ, కేటాయింపులు తగ్గలేదని కూడా తెలియజేసింది. ఐతే, 2009-10 తరవాత బడ్జెట్ కేటాయింపుల్లో తగ్గుదల, ఖర్చులో హెచ్చు తగ్గులు ఉన్న దృష్ట్యా ఈ సమాధానం వాస్తవికంగా లేదు.

## 5.2 ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి కారణాలు

ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి ఈ కింది కారణాలు ప్రధానమైనవి ః

- భూ సేకరణలో జాప్యం;
- అనుమతులను పొందడంలో జాప్యం;
- పునరావాస, పునర్నిర్మాణ కార్యకలాపాలను ఖరారు చేయకపోవడం.

జాప్యాలకు ఈ అంశాలు కారణమని ధృవీకరిస్తూ, చాలా ప్రాజెక్టులు 2017-18 నాటికల్లా పూర్తవుతాయని ఆశిస్తున్నామని నీటిపారుదలశాఖ తెలిపింది. అనుమతులు పొందకపోవడం వలన కలిగిన జాప్యాలను అధ్యాయం 3 లో చర్చించడం జరిగింది. మిగిలిన కారణాలను ఈ కింద వివరించడమైంది.

### 5.2.1 భూ సేకరణ

2012 మార్చి నాటికి భూ సేకరణ పరిస్థితి ప్రాంతాలవారీగా ఈ కింది విధంగా ఉంది.

**పట్టిక - 5.3**

(ఎకరాల్లో)

| ప్రాంతం | కావలసింది | కోరింది | సేకరించింది | ఇంకా సేకరించాల్సింది |
|---|---|---|---|---|
| కోస్తాంధ్ర | 253089 | 204528 | 142677 | 110412 |
| రాయలసీమ | 295891 | 294591 | 255465 | 40426 |
| తెలంగాణ | 370431 | 276603 | 198960 | 171471 |
| మొత్తం | 919411 | 775722 | 597102 | 322309 |

*మూలం ః నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధిశాఖ రికార్డులు*

పలు ప్రాజెక్టుల తొలి ఒప్పందం గడువులు ముగిసిపోయినప్పటికీ ఏ ఒక్క ప్రాజెక్టుకూ ప్రభుత్వం కావలసిన భూములను సకాలంలో సేకరించలేకపోయింది. భూ సేకరణను తొందరగా పూర్తిచేసే నిమిత్తం, 5 ప్రత్యేక కలెక్టరు పదవులను, 44 ప్రత్యేక డిప్యూటీ కలెక్టరు పదవులను కల్పించామనీ, సిబ్బంది కొరత ఉన్నప్పటికీ 2012 మార్చి నాటికి సుమారు 6 లక్షల ఎకరాలను సేకరించామని నీటిపారుదలశాఖ సమాధానమిచ్చింది (2012 జూలై). అంతేకాకుండా, భూములకు సంబంధించి చట్టపరమైన వివాదాలున్నాయనీ, అనేక ప్రాజెక్టులను ఏకకాలంలో చేపట్టిన కారణంగా అందుబాటులో ఉన్న రెవెన్యూ సిబ్బందితో అన్ని ప్రాజెక్టులకు సంబంధించి భూ సేకరణ ప్రక్రియలో సర్వే, ముసాయిదా ప్రకటన (డ్రాఫ్ట్ నోటిఫికేషన్), ముసాయిదా తీర్మానం (డ్రాఫ్ట్ డిక్లరేషన్) వంటి వరుస కార్యకలాపాలను ఏకకాలంలో చేపట్టలేకపోయామని కూడా తెలిపింది.

ఈ అంశాలు క్లిష్టమైనవి, ముందుగానే ఊహించగలిగేవి కాబట్టి ప్రభుత్వం వీటిని తగు విధంగా పరిష్కరించుకొని ఉండాల్సింది.

## 5.2.2 పునరావాసం, పునర్నిర్మాణం

జలయజ్ఞం ప్రాజెక్టుల్లో 2012 మార్చి నాటికి పునరావాసం-పునర్నిర్మాణం పరిస్థితి ఈ కింది విధంగా ఉంది :

**పట్టిక - 5.4**

| | జిల్లాల సంఖ్య | ప్రాజెక్టుల సంఖ్య | ప్రభావితమైన గ్రామాలు | పునరావాస కేంద్రాలు | ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలు | ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు | దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న కుటుంబాలు |
|---|---|---|---|---|---|---|---|
| మొత్తం | 17 | 37 | 546 | 500 | 132135 | 129739 | 121004 |
| మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులు | 14 | 14 | 413 | 365 | 87608 | 86047 | 80893 |

*మూలం : పునరావాస-పునర్నిర్మాణ కమీషనరేట్*

i. ఈ ప్రాజెక్టుల అమలు వల్ల ప్రభావితమవుతాయని ప్రభుత్వం అంచనా వేసిన 546 గ్రామాలలో 50 శాతం కంటే ఎక్కువ గ్రామాలకు ఈ కింది చార్టులలో చూపిన విధంగా ముసాయిదా ప్రణాళికను ఇంకా ఆమోదించాల్సి ఉంది. పునరావాస - పునర్నిర్మాణ ప్రణాళికను ఇంకా సమర్పించాల్సి ఉన్న 281 గ్రామాలలో 206 గ్రామాలు పోలవరం ప్రాజెక్టుకు చెందినవే.

**చార్టు - 5.5**




2012 మార్చి నాటికి వివిధ సాగునీటి ప్రాజెక్టుల్లో ప్రభుత్వం 191 గ్రామాలకు ప్రాధాన్యతనిచ్చిందనీ, వీటికి సంబంధించి అన్ని చర్యలూ వచ్చే రెండు మూడు ఏళ్లలో పూర్తి కావాలని పునరావాస పునర్నిర్మాణ కమీషనరు తెలిపారు (2012 జూలై). 189 గ్రామాలకు సంబంధించి పునరావాస పునర్నిర్మాణ ప్రణాళికలు ఇప్పటికే ఆమోదాన్ని పొందాయని కూడా తెలిపారు.

*మూలం : పునరావాస-పునర్నిర్మాణ కమీషనరేట్*

చాలా ప్రాజెక్టుల విషయంలో, తొలి ఒప్పంద గడువులు ముగిసిపోయినా ప్రభుత్వం ప్రణాళికల ప్రక్రియను సైతం పూర్తి చేయలేకపోతోందని ఈ సమాధానం రూఢి చేస్తోంది.

చార్టు - 5.6




*మూలం : పునరావాస-పునర్నిర్మాణ కమీషనరేట్*

ii. ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు గృహాలను కల్పించే ప్రక్రియ మందగతిన సాగుతోందని పక్క పటాన్ని చూస్తే తెలుస్తోంది. ప్రభావిత కుటుంబాలకు ఇళ్లను నిర్మించి ఇవ్వడంలో పురోగతి కేవలం 13 శాతం మాత్రమే. దీన్ని బట్టి చూస్తే అనేక ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలకు పునరావాసాలను కల్పించడంలో అవసరమైన శీఘ్రతను ప్రభుత్వం చూపలేదని స్పష్టమౌతోంది.

iii. తొమ్మిది[4] ప్రాజెక్టులకు సంబంధించి 23,166 ఇళ్లను కట్టించాల్సి ఉండగా, 2012 మార్చి నాటికి ఒక్కటి కూడా పూర్తికాలేదు.

iv. ఐదు జిల్లాలతో ముడిపడివున్న రెండు ప్రాజెక్టుల్లో, కింద చూపిన విధంగా స్వల్ప సంఖ్యలో మాత్రమే ఇళ్లను పూర్తిచేసారు.

పట్టిక - 5.5

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | జిల్లా | కట్టించాల్సిన ఇళ్లు | పూర్తైన ఇళ్లు |
|---|---|---|---|---|
| 1 | పోలవరం | ఖమ్మం | 31552 | శూన్యం |
| 2 | | తూర్పుగోదావరి | 4421 | 483 |
| 3 | | పశ్చిమగోదావరి | 4139 | 352 |
| 4 | ఎల్లంపల్లి | కరీంనగర్ | 6816 | 788 |
| 5 | | ఆదిలాబాద్ | 4413 | శూన్యం |

*మూలం : పునరావాస-పునర్నిర్మాణ కమీషనరేట్*

ప్రాజెక్టు నిర్మాణదశ ఆధారంగా ప్రాథమ్యాలను నిర్ణయించామనీ, ఇలా ప్రాథమ్యమిచ్చిన ప్రాజెక్టులకు సంబంధించి పునరావాసాల నిర్మాణంలో పురోగతి మొత్తంమీద 32 శాతం ఉందని కమీషనరు తెలిపారు (2012 జూలై).

v. పునరావాసాల నిర్మాణమే కాకుండా పునరావాస కేంద్రాలలో మౌలిక వసతులను కల్పించడంలో పురోగతి కూడా ఈ కింది పట్టికలో వివరించినట్లు ఇంకా తొలి దశల్లోనే ఉంది.

---

4 పులిచింతల (11580), వెలిగొండ (4013), భీమ (3587), నెట్టెంపాడు (2471), తారకరామ తీర్థ సాగర్ (616), నీల్వాయి (371), కల్వకుర్తి (242), హంద్రీ నీవా (204), దేవాదుల (82)

పట్టిక - 5.6

| | లక్ష్యంగా పెట్టుకున్న పునరావాస కేంద్రాల ఏర్పాటు | స్థలం సేకరించిన కేంద్రాల సంఖ్య | రహదారి సౌకర్యాలు ఏర్పాటైన కేంద్రాలసంఖ్య | నీటి వసతులు ఏర్పాటైన కేంద్రాల సంఖ్య | విద్యుత్తు సదుపాయాలు ఏర్పాటైన కేంద్రాల సంఖ్య |
|---|---|---|---|---|---|
| మొత్తం | 500 | 222 | 147 | 150 | 142 |
| మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల్లో | 365 | 104 | 63 | 64 | 57 |

*మూలం : పునరావాస-పునర్నిర్మాణ కమీషనరేట్*

**vi.** మిగిలిన ప్రాజెక్టుల్లో కంటే పోలవరం ప్రాజెక్టులో పునరావాస-పునర్నిర్మాణ పనుల్లో జాప్యం స్పష్టంగా తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని మూడు జిల్లాల్లో[5] 277 గ్రామాలు ముంపునకు గురై 42,712 కుటుంబాలకు చెందిన 1,31,045 మంది ప్రభావితమౌతారు. చత్తీస్‌గఢ్‌లో 4 గ్రామాలు మునిగిపోయి 2335 కుటుంబాలనుంచి 11,766 మంది ప్రభావితమౌతారు. అలాగే ఒడిశాలో 8 గ్రామాలు ముంపు బారినపడి, 1002 కుటుంబాలకు చెందిన 6316 మంది ప్రభావితమవుతారు. పునరావాస - పునర్నిర్మాణ ఏర్పాట్ల కోసం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ₹2051 కోట్లకు పాలనాపరమైన మంజూరీనివ్వగా (2005 మే) భారత ప్రభుత్వం పునరావాస-పునర్నిర్మాణ ప్యాకేజీకి 2007 ఏప్రిల్లో అనుమతులను మంజూరు చేసింది.

- పోలవరం ప్రాజెక్టు ' స్పిల్‌వే ' (2005 మార్చి), ఈసీఆర్ఎఫ్ డ్యామ్ పనులను (2006 ఆగస్టు) అప్పగించేనాటికి, ముంపునకు గురయ్యే ప్రాంతానికి సంబంధించి సామాజిక-ఆర్థిక సర్వేను నిర్వహించనూ లేదు, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాలను గుర్తించనూ లేదు.
- పునరావాస-పునర్నిర్మాణ ఏర్పాట్ల మొదటిదశ 2008 జూన్ నాటికి పూర్తికావాల్సి ఉండగా 2012 మార్చి నాటికి కూడా పూర్తికాలేదు.
- పశ్చిమగోదావరి జిల్లాలో ఈ డ్యామ్ పరిధిలోకి వచ్చే ఏడు గ్రామాల్లోని ఆరింటిని, తూర్పుగోదావరి జిల్లాలోని నాలుగు గ్రామాల్లో మూడింటిని తరలించే ప్రక్రియ ఇంకా పూర్తికాలేదు.
- ₹108 కోట్లు ఖర్చు చేసినా, కేవలం 277 కుటుంబాలకు చెందిన 1136 మందికి మాత్రమే పునరావాసాలను కల్పించారు. ఈ అంశంలో గత ఏడేళ్ల కాలంలో పురోగతి నామమాత్రంగా ఐదు శాతమే ఉంది.
- అంతేకాకుండా, చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో ముంపు సమస్యను పరిష్కరించకపోవడంతో ఆ రెండు రాష్ట్రాలతో సుదీర్ఘ వివాదానికి దారి తీసింది.

ప్రాజెక్టు పురోగతికి అనుగుణంగా పునరావాస - పునర్నిర్మాణ ప్రక్రియ దశలవారీగా జరిగేలా యోచించామనీ, ఖమ్మంలో ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే అన్ని గ్రామాలను 3, 4 వ దశల కింద చేర్చామనీ, కాబట్టి గ్రామాలు వాస్తవంగా ముంపునకు గురవడానికి ఏడాది ముందే ఈ గ్రామాలకు సంబంధించి పునరావాస-పునర్నిర్మాణ పనులు పూర్తికాగలవని కమీషనర్ తెలిపారు (2012 జూలై). అంతేకాక చత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాలతో ముంపు విషయంలో వివాదాలేవీ లేవంటూ నీటిపారుదల శాఖ 1980 నాటి అంతర్ రాష్ట్ర ఒప్పందాన్ని, గోదావరి జల వివాదాల ట్రైబ్యూనల్ ఇచ్చిన తీర్పులను ఉదహరించింది (2012 జూలై). ఐతే, ఈ ప్రాజెక్టును చత్తీస్‌గఢ్, ఒడిశా ప్రభుత్వాలు వ్యతిరేకిస్తున్నాయనీ, ఆ రాష్ట్రాల్లో ప్రాజెక్టు వల్ల ప్రభావితమయ్యే గ్రామాలలోని గ్రామసభలతో సంప్రదింపులు కూడా చేయలేదని పోలవరం ప్రాజెక్టుకు అనుమతులను మంజూరు చేసే సందర్భంగా కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ పేర్కొంటూ (2007 ఏప్రిల్ 17) (i) ఈ రెండు రాష్ట్రాల భూ ప్రాంతాలు ముంపుకు గురికాకూడదని, ప్రజలు నిర్వాసితులు కాకూడదని (ii) ఈ రెండు రాష్ట్రాల ప్రజలపై ప్రతికూల ప్రభావం ఉండకూడదనే షరతులపైనే అనుమతులనిచ్చింది.

[5] ఖమ్మం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి

## 5.3 ప్రాజెక్టుల అమలు తీరు

మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టుల అమలు స్థితిగతులు, వాటిలో ఇమిడి ఉన్న కీలక అంశాలను, ప్రాంతాలవారీగా ఈ కింద ఇవ్వడం జరిగింది. ఈ ప్రాజెక్టుల జ్యాప్యాల వివరాలను ప్యాకేజీ లవారీగా ***అనుబంధం 5.1*** లో ఇవ్వడమైంది.

### కోస్తాంధ్ర




కోస్తా ప్రాంతంలో మచ్చుకు తనిఖీ చేసిన ఆరు ప్రాజెక్టుల్లో లక్ష్యంగా పెట్టుకున్న **17.23** లక్షల ఎకరాలకుగాను 2012 సెప్టెంబరు నాటికి **0.34** లక్షల ఎకరాల ఆయకట్టును మాత్రమే కల్పించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి మినహా (ఈ ప్రాజెక్టు పనులను ఇంకా అప్పగించాల్సి ఉంది) మిగిలిన ప్రాజెక్టులన్నీ వివిధ నిర్మాణదశల్లో ఉన్నాయి.

**పట్టిక - 5.7**

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు (లక్షల ఎకరాల్లో) | కల్పించిన ఆయకట్టు | పూర్తి కావలసిన తేదీ | జాప్యం |
|---|---|---|---|---|---|
| 1 | పోలవరం | 7.21 | శూన్యం | 2006 అక్టోబరు - 2010 జూలై | 26 - 71 నెలలు |
| 2 | వంశధార స్టేజి II ఫేజ్ II | 0.45 | 20000 ఎకరాలు | 2007 మార్చి - 2008 మార్చి | 54 - 60 నెలలు |
| 3 | తోటపల్లి బ్యారేజి | కొత్తది : 1.20<br>స్థిరీకరణ : 0.64 | కొత్తది : శూన్యం<br>స్థిరీకరణ : 64000 ఎకరాలు | 2005 సెప్టెంబరు - 2012 డిసెంబరు | 0 - 59 నెలలు |
| 4 | వెంకటనగరం పంపింగ్ పథకం | కొత్తది : 0.23<br>స్థిరీకరణ : 0.10 | కొత్తది : శూన్యం<br>స్థిరీకరణ : 4250 ఎకరాలు | 2006 సెప్టెంబరు | 72 నెలలు |
| 5 | భూపతిపాలెం జలాశయం | 0.14 | 14028 ఎకరాలు | 2006 ఆగస్టు - 2007 సెప్టెంబరు | 10 - 61నెలలు |
| 6 | ఉత్తరాంధ్ర సుజల స్రవంతి | 8.00 | పనులను ఇంకా అప్పగించాల్సి ఉంది | | |

*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డులు*

కోస్తా ప్రాంతంలో మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులలోని కీలక అంశాలు ఈ కింద ఇవ్వడమైంది.

## 5.3.1 ఇందిరాసాగర్ పోలవరం ప్రాజెక్టు (పోలవరం)

### 5.3.1.1 ప్రాజెక్టు స్వరూపం

| | |
|---|---|
| లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు | తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం జిల్లాలలో 7.21లక్షల ఎకరాలు[6] |
| ఇతర ప్రయోజనాలు | • గోదావరి డెల్టాలో 10.13 లక్షల ఎకరాలు, కృష్ణా డెల్టాలో 13 లక్షల ఎకరాలను స్థిరీకరించడం<br>• కృష్ణానదికి 80 టీఎమ్‌సీ నీటిని మళ్లించడం కోసం నదుల అనుసంధానం చేయడం<br>• విశాఖపట్నంలోని పరిశ్రమలకు 23.44 టీఎమ్‌సీ నీటి సరఫరా<br>• 540 గ్రామాలలోని 28.50 లక్షల జనాభాకు నీటి సరఫరా<br>• 960 మెగావాట్ జల విద్యుదుత్పాదన |
| నీటి వనరు | గోదావరి నుండి 307.96 టీఎమ్‌సీ |
| ఇతర సమాచారం | • పోలవరం మండలం రామయ్యపేట సమీపంలో గోదావరి నదిపై రామపాద సాగర్ ప్రాజెక్టు పేరుతో 1943 లోనే తల పెట్టిన ఒక బహుళార్థసాధక జలాశయం<br>• ఒడిశాతో 5 టీఎమ్‌సీ, చత్తీస్‌గఢ్‌తో 1.5 టీఎమ్‌సీ జలాలను పంచుకోవాలి |
| ప్రాజెక్టులోని అంశాలు | (i) మట్టి - రాతి కట్టడం 2454 మీటర్లు, (ii) స్పిల్‌వే 1128 మీటర్లు, (iii) ఎడమవైపున 4 లక్షల ఎకరాలకు నీరందించడం కోసం 181.50 కి.మీ. పొడవైన ప్రధాన ఎడమ కాలువ, (iv) కుడివైపున 3.2 లక్షల ఎకరాలకు నీరందించే విధంగా 174 కి.మీ. ప్రధాన కుడి కాలువ |
| నిర్మాణ వ్యయం | తొలి అంచనా : ₹10151 కోట్లు ( 2007 డిసెంబరు);<br>సవరించిన అంచనా : ₹16010.45 కోట్లు (2010 అక్టోబరు) |
| ఖర్చు | ₹4354.95 కోట్లు |
| భూ సేకరణ | చేయాల్సింది :1,66,672.21 ఎకరాలు, చేసింది : 69,589.13 ఎకరాలు |
| పునరావాస గృహాలు | నిర్మించాల్సినవి : 42,705, పూర్తైనవి : 899[7] |

### 5.3.1.2 కీలకాంశాలు

i. **పనుల స్థితిగతులు :** పోలవరం ప్రాజెక్టును 23 ప్యాకేజీలుగా విభజించి, 2004 అక్టోబరు - 2007 జూలై మధ్య కాలంలో పనులను అప్పగించారు. ఈ 23 ప్యాకేజీలను ఆడిట్‌లో సమీక్షించడమైంది. ప్యాకేజీలను పూర్తి చేయడంలో రెండు నుంచి ఐదేళ్లకు పైగా జాప్యం జరిగింది.

- పనులను అప్పగించి (2005 మార్చి) ఏడేళ్లు గడిచినా కూడా కనెక్టివిటీలలో స్ట్రక్చర్లు పూర్తి కాకపోవడంతో 21 ప్యాకేజీలలో (హెడ్ వర్క్ కనెక్టివిటీలు - 6, ఎల్ఎంసీ - 8, ఆర్ఎంసీ - 7) పనుల పురోగతి మట్టి తవ్వకాల వరకే పరిమితమైపోయింది. కాలువకు సంబంధించిన రెండు ప్యాకేజీల భౌతికస్థితి 2012 నవంబరు 2 నాటికి ఈ కింది విధంగా ఉంది.

[6] విశాఖపట్నం (1.5 లక్షల ఎకరాలు), తూర్పుగోదావరి (2.5 లక్షల ఎకరాలు), పశ్చిమగోదావరి (2.58 లక్షల ఎకరాలు), కృష్ణా (0.62 లక్ష ఎకరాలు)

[7] ఇది 2012 సెప్టెంబరు నాటి తాజా సమాచారం కనుక పట్టిక 5.5 తో పోలిస్తే ఈ అంకెలు భిన్నంగా ఉంటాయి




*ఐఎస్‌పిఎల్‌ఎంసీ 77.185 కి.మీ వద్ద ఎన్‌హెచ్ 16 క్రాసింగు (ప్యాకేజీ 4)*




*హెచ్‌పీసీఎల్ - గెయిల్ క్రాసింగు వల్ల పూర్తికాని ఐఎస్ఆర్ఎంసీ భాగం (ప్యాకేజీ 2)*

- ప్యాకేజీ 66, ప్యాకేజీ67 లలో శాడిల్ డ్యాం " కె ఎల్ " పనులను చేపట్టే ముందే శ్రీ సత్యసాయి తాగునీటి పైపులైన్లను తరలించాల్సి ఉంది. అలా చేయకపోవడంతో, శాడిల్ డ్యాంను పూర్తిచేయడంలో జాప్యం జరిగి పర్యవసానంగా ఈ ప్యాకేజీలలోని సంబంధిత పనులు కూడా ఆలస్యమయ్యాయి.
- భూ సేకరణ సమస్యలు, పునర్నిర్మాణ-పునరావాస పనుల్లోనూ, పైపులైన్ల తరలింపులోనూ జరిగిన ఆలస్యం, రైలు మార్గాలు, జాతీయ రహదారులను దాటేందుకు అనుమతులు పొందటంలో జాప్యం కారణంగా కుడి, ఎడమ ప్రధాన కాలువల పని కూడా నిలిచిపోయింది.
- గోదావరి నదీ జల వివాదాల ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం పోలవరం డ్యాం డిజైన్ అంశాలను దాని ఆపరేషన్ క్రమాన్ని కేంద్ర జల సంఘం నిర్ణయించాలి. ఐతే, కేంద్ర జల సంఘం ఆమోదం లేకుండానే 36 లక్షల కూసెక్కుల వరద నీటి విడుదల సామర్థ్యంతో స్పిల్‌వే పని, రాతి - మట్టికట్ట నిర్మాణ పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్పగించింది (2005 మార్చి, 2006 ఆగస్టు). కేంద్ర జల సంఘం ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)ను, హైడ్రాలాజికల్ అధ్యయనాలను సమీక్షించి 50 లక్షల క్యూసెక్కుల వరద నీటి విడుదల సామర్థ్యంతో స్పిల్‌వేకు రూపకల్పన చేసుకోవచ్చని సిఫార్సు చేసింది (2006 సెప్టెంబరు). చివరికి స్పిల్‌వే నీటి విడుదల సామర్థ్యం 36 లక్షల క్యూసెక్కుల నుండి 50 లక్షల క్యూసెక్కులకు పెంచడంతో గుత్తేదారుల కోరిక మేరకు రెండు ఒప్పందాలనూ 2009 ఆగస్టులో అర్థంతరంగా రద్దుచేయాల్సి వచ్చింది. ఈ పనులను తిరిగి అప్పగించాల్సి ఉంది (2012 సెప్టెంబరు).
- నీటి విడుదల సామర్థ్యాన్ని పెంచుతూ కేంద్ర జల సంఘం నిర్ణయం తీసుకున్న (2006 సెప్టెంబరు) తరువాత ఒప్పందాలను మధ్యంతరంగా రద్దు చేసేందుకు (2009 ఆగస్టు) ప్రభుత్వం మూడు సంవత్సరాల సమయం తీసుకుంది. దీని వల్ల 2007-08, 2010-11 సంవత్సరాల ప్రామాణిక ధరల్లోని (ఎస్ఎస్ఆర్‌లలోని) వ్యత్యాసం మూలంగా ప్రాజెక్టుపై ₹1049 కోట్ల మేర ప్రభావం పడింది.

ఒప్పందాలను అర్థంతరంగా రద్దు చేయడానికి డిజైన్లలో మార్పులు ఒక్కటే కారణం కాదని, మరికొన్ని కారణాలు కూడా ఉన్నాయని, వాటిలో కొన్ని గుత్తేదారు సంస్థకు ఆపాదించగలిగేవని నీటిపారుదలశాఖ పేర్కొంది. ఐతే, ఒప్పందాలను ఇలా అర్థంతరంగా రద్దు చేయడం మూలంగా రాష్ట్రం 2006 సెప్టెంబరు నుండి సుమారు ఆరు పంటకాలాలను కోల్పోయింది. ఫలితంగా, ప్రాధాన్యతగల ఈ ప్రాజెక్టునుండి నేటికీ (2012 సెప్టెంబరు) ఎలాంటి ప్రయోజనాలను పొందలేకపోయింది. అంతేకాక ఈ కారణంగా, ₹19.39 కోట్ల[8] మేర గుత్తేదారుల క్లెయిమ్‌లను నీటిపారుదలశాఖ అనుమతించవలసి వచ్చింది.

---

[8] ఈసీఆర్ఎఫ్ ₹12.43 కోట్లు, స్పిల్‌వే ₹6.96 కోట్లు

ఈ క్లెయిమ్‌లలో అధిక భాగం, అప్రోచ్ రోడ్ల వంటి మౌలిక సదుపాయాల పనులు, డంపింగ్ కోసం స్థలాల సేకరణ, ఏపీ ట్రాన్స్‌కో వద్ద జమచేసిన మొత్తాలకు సంబంధించినవేనని, పనులను చేపట్టబోయే కొత్త గుత్తేదారు సంస్థలు వీటిని ఉపయోగించుకోవచ్చని నీటిపారుదలశాఖ సమాధానమిచ్చింది. ఐతే, (i) అప్రోచ్ రోడ్ల ఏర్పాటు ప్రాజెక్టు పనుల పరిధిలోనిదే కావడం, పనులలో భాగంగానే చెల్లింపుల సూచీని (పేమెంట్ షెడ్యూల్) అనుసరించి చెల్లింపులు చేయడం వల్ల, (ii) డంపింగ్ స్థలాలకు, ఏపీ ట్రాన్స్‌కో వద్ద జమచేయడానికి సంబంధించిన ఎలాంటి మొత్తాలను ఈ క్లెయిమ్‌లలో కలపకపోవడం వల్ల ఈ సమాధానం ఆమోదయోగ్యం కాదు. పైగా బీమా వర్తించాల్సిన అపాయావకాశాలు లేని సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైనింగ్, మట్టి తవ్వకం పనులను మాత్రమే చేసి ఒప్పందం ప్రకారం ఇతర పనులను చేయకపోయినా ఈ క్లెయిమ్‌లలో బీమాకుగాను ₹6.39 కోట్ల మొత్తాన్ని చేర్చారు.

*ii.* ***డిజైన్లకు ఆమోదం :*** 2012 జూలై నాటికి ఈ ప్రాజెక్టుకు సంబంధించిన మొత్తం 717 కట్టడాలకు గాను 303 కట్టడాల డిజైన్లను ఇంకా ఆమోదించాల్సి ఉంది. ఈ 303 కట్టడాలకుగానూ క్షేత్ర సమాచారం కోరుతూ ముఖ్యమైన వ్యాఖ్యలతో 129 డిజైన్లను వివిధ స్థాయిల్లో తిప్పి పంపామనీ, అవి గుత్తేదారుల వద్దే పెండింగులో ఉన్నాయనీ, మరో 159 కట్టడాల డిజైన్లను గుత్తేదారులు ఇంకా సమర్పించాల్సి ఉందనీ నీటిపారుదలశాఖ బదులిచ్చింది. ఐతే, గుత్తేదారుపై చర్యలనేమైనా తీసుకుందో లేదో తెలియజేయలేదు.

## 5.3.2 బొడ్డేపల్లి రాజగోపాలరావు వంశధార ప్రాజెక్టు-రెండవ స్టేజి (వంశధార ప్రాజెక్టు-రెండవ స్టేజి)

### *5.3.2.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| **లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు** | *శ్రీకాకుళం జిల్లాలో 45,000 ఎకరాలు* |
| **నీటి వనరు** | *వంశధార నది నుంచి 9.417 టీఎమ్‌సీ లు* |
| **ఫేజ్ - I** | |
| **ప్రాజెక్టులోని అంశాలు** | *గొట్టా బ్యారేజ్ ఎగువన కుడి పక్క 750 మీటర్ల హెడ్ రెగ్యులేటర్, 59 కి.మీ. మేర కుడి ప్రధాన కాలువ* ***(జలయజ్ఞంకు ముందు)*** |
| **పాలనాపరమైన అనుమతి** | *తొలి అంచనా : ₹123.94 కోట్లు*<br>*సవరించిన అంచనా : ₹209 కోట్లు* |
| **ఖర్చు** | *₹132.8 కోట్లు (2012 సెప్టెంబరు)* |
| **లిఫ్టులు** | *8* |
| **భూ సేకరణ** | *చేయాల్సింది : 1458 ఎకరాలు, చేసింది : 1399.77 ఎకరాలు* |
| **ఫేజ్ - II** | |
| **అంశాలు** | *నేరడి బ్యారేజీ ఎగువన 2 కి.మీ దగ్గర 300 మీటర్ల మత్తడి (సైడ్ వీర్) 34 కి.మీ మేర వరద వాలు కాలువ (గ్రావిటీ ఫ్లడ్ ఫ్లో కెనాల్)* ***(జలయజ్ఞం కింద)*** |
| **పాలనాపరమైన అనుమతి** | *₹933.9 కోట్లు (2005 ఫిబ్రవరి)* |
| **ఖర్చు** | *₹671.89 కోట్లు* |
| **భూ సేకరణ** | *చేయాల్సింది : 12257.96 ఎకరాలు, చేసింది : 11732.43 ఎకరాలు* |
| **పునరావాస గృహాలు** | *నిర్మించాల్సినవి : 7104, పూర్తైనవి : 968* |

### *5.3.2.2 కీలకాంశాలు*

*i.* ***అంతర్ రాష్ట్ర అంశాలు :*** వంశధార ప్రాజెక్టు స్టేజి - II కింద 82,280 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించడానికి ఆంధ్రప్రదేశ్ - ఒడిశా సరిహద్దులోని నేరడి వద్ద వంశధార నదిపై ఒక బ్యారేజీని నిర్మించాలి. ఐతే, నేరడి బ్యారేజి నిర్మాణానికి ఒడిశా ప్రభుత్వం అభ్యంతరం తెలిపింది. 1979 నుండి ఈ ప్రాజెక్టు స్టేజ్ -II పనులకు కేంద్ర జల సంఘం అనుమతినివ్వలేదు. ఒడిశా ప్రభుత్వంతో ఈ వివాదాన్ని పరిష్కరించుకోవడంలో జాప్యం దృష్ట్యా స్టేజ్ - II కి మార్పులు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనులను రెండు ఫేజులుగా చేపట్టింది. మొదటి ఫేజుకు కేంద్ర జల సంఘం అనుమతులను పొంది 2002 లో నిర్మాణ పనులను చేపట్టారు. ఈ పనులు పూర్తికావొస్తున్నాయి.

రెండో ఫేజును జలయజ్ఞం కింద చేపట్టారు. ఈ ఫేజ్‌లో 45,000 ఎకరాలు ఆయకట్టును కల్పించాలి. ఇందులో భాగంగా నేరడి బ్యారేజీకి రెండు కిలోమీటర్ల ఎగువన రాష్ట్రంలోని కాట్రగడ్డ గ్రామం వద్ద ఒక మత్తడిని (సైడ్ వీర్) నిర్మించాలి. ఒడిశా ప్రభుత్వాన్ని సంప్రదించకుండా, కేంద్ర జల సంఘం అనుమతిని పొందకుండా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు 2005 ఫిబ్రవరిలో పాలనాపరమైన అనుమతినిచ్చి, 2005 మార్చిలో పనులను అప్పగించింది. తదనతరం, ఒడిశా ప్రభుత్వం దాఖలు చేసిన (2006 ఫిబ్రవరి) రిట్ పిటిషన్ ఆధారంగా మత్తడి, వరదనీటి కాలువల నిర్మాణం విషయంలో 'యథాతధ స్థితి'ని కొనసాగించాల్సిందిగా సుప్రీం కోర్టు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఆదేశించింది (2009 ఫిబ్రవరి).

ఇదిలా ఉండగా, రెండు ప్యాకేజీల[9] గుత్తేదారులు పనులను మధ్యలోనే ఆపేసారు (2008 జూన్ / జూలై). ₹47.43 కోట్లు ఖర్చైన ఈ పనులు, 2012 సెప్టెంబరు నాటికి కూడా అసంపూర్తిగానే ఉన్నాయి. పనులు నిలిచిపోవడంతో, పెద్దమొత్తంలో ₹671.89 కోట్ల పెట్టుబడి చిక్కుకుపోయింది. కట్టడాలు అసంపూర్ణంగా ఉండిపోయి ఈ కింది చిత్రాలలో (2012 జూలై) చూపినట్టు మూడేళ్లకు పైగా ప్రకృతి మార్పులకు గురౌతున్నాయి.



*వరద నీటి కాలువ 13.062 కి.మీ. వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన (ప్యాకేజీ - 87)*



*వరద నీటి కాలువ 24.284 కి.మీ.వద్ద అసంపూర్తిగా ఉన్న వంతెన (ప్యాకేజీ - 88)*

ఆంధ్రప్రదేశ్‌కు న్యాయంగా రావలసిన వాటా జలాలను వినియోగించుకోవడానికే స్టేజ్ - II లోని రెండో ఫేజు పనులను చేపట్టామనీ, ఈ ప్రాజెక్టు వల్ల ఒడిశాలోని భూభాగం ముంపుకు గురికావడం, ప్రభావితం కావడం వంటి ప్రమాదమేదీ లేదు కాబట్టి ఆ రాష్ట్ర సమ్మతి అవసరంలేదని నీటి పారుదల శాఖ సమర్థించుకుంది. ఐతే, ఈ ప్రాజెక్టును అంతర్ రాష్ట్ర నదిపై ఉమ్మడి సరిహద్దు మీద నిర్మితమవుతున్నందున ఈ సమాధానం అంగీకారం కాదు. నిలిచిపోయిన నేరడి బ్యారేజి పనుల విషయంలో కలిగిన గత అనుభవాన్ని ప్రభుత్వం దృష్టిలో ఉంచుకోవాల్సింది.

---

[9] ప్యాకేజీ 87 (పురోగతి : 39శాతం) ప్యాకేజీ 88 (పురోగతి : 31.13 శాతం)

ii. ***అనుమతులలో ఆలస్యం :*** హైడ్రాలిక్ వివరాలకు అనుమతినివ్వి సివిల్ పనులను ప్రారంభించడంలో రెండేళ్లకు పైగా జాప్యం జరిగింది. సర్వే, ఇన్వెస్టిగేషన్ వనుల ప్రాతిపదికన గుత్తేదారు సమర్పించిన ప్రతిపాదనలను పరిశీలించి, ఆమోదిస్తామని నీటిపారుదలశాఖ తెలిపింది.

## 5.3.3 తోటపల్లి బ్యారేజి ప్రాజెక్టు

### *5.3.3.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| *లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు* | *నాగావళి నదికి కుడివైపు 1.2 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు*<br>*ఇప్పటికే ఉన్న 64000 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ* |
| *నీటి వనరు* | *నాగావళి నది నుంచి 15.895 టీఎమ్‌సీ* |
| *ప్రాజెక్టులోని అంశాలు* | *(i) స్పిల్‌వే నిర్మాణం, (ii) మట్టికట్ట నిర్మాణం, (iii) గట్లను కలిపే ఏర్పాటు (iv) కుడి, ఎడమ ప్రధాన తూముల నిర్మాణం, (v) 107 కిలోమీటర్ల మేర కుడి ప్రధాన కాలువ* |
| *పాలనాపరమైన అనుమతి* | *తోటపల్లి : ₹450.23 కోట్లు*<br>*గజపతినగరం : ₹76.99 కోట్లు* |
| *ఖర్చు* | *తోటపల్లి : ₹485.67 కోట్లు*<br>*గజపతినగరం : ₹7.08 కోట్లు* |
| *భూ సేకరణ* | *తోటపల్లి కోసం చేయాల్సింది : 11680.52 ఎకరాలు, చేసింది : 10370.47 ఎకరాలు*<br>*గజపతినగరం కోసం చేయాల్సింది : 590 ఎకరాలు, చేసింది : 66.35 ఎకరాలు* |
| *పునరావాస గృహాలు* | *నిర్మించాల్సినవి : 5915, పూర్తైనవి : 2134* |

### *5.3.3.2 కీలకాంశాలు*

i. ***పనుల్లో జాప్యం :*** స్పిల్‌వే, మట్టికట్ట నిర్మాణం పనులు జలయజ్ఞానికి ముందే 2004 మార్చి/జూన్‌లో అప్పగించారు. మిగతా పనులను జలయజ్ఞం కింద 2004 అక్టోబరులో అప్పగించారు. ఈపీసీ కిందకు రాని మూడు పనులు పూర్తికాగా, రెండు ఈపీసీ ప్యాకేజీ పనులు గుత్తేదారుకు అప్పగించి 8 సంవత్సరాలైనా ఇంకా పూర్తి కాలేదు. భూసేకరణ, పునరావాస పనులలో సమస్యల వల్ల పనుల పురోగతికి తీవ్ర ఆటంకం కలిగిందని నీటిపారుదల శాఖ బదులిచ్చింది.

ii. ***అదనపు ఆయకట్టు :*** తోటపల్లి బ్యారేజీ కుడి ప్రధాన కాలువకు 97.00 వ కి.మీ. నుంచి మొదలు పెట్టి సుమారు 25 కి.మీ. మేర గజపతినగరం బ్రాంచి కెనాల్‌ను తవ్వి 15,000 ఎకరాల అదనపు ఆయకట్టు కల్పించాలని 2008 జూలైలో ప్రభుత్వం నిర్ణయించింది. ఐతే, సవరించిన ప్రాజెక్టు ప్రతిపాదనలను మాత్రం కేంద్ర జల సంఘానికి పంపలేదు.

గజపతినగరం బ్రాంచి కాల్వ తోటపల్లి బ్యారేజీ ప్రాజెక్టు ప్రధాన కాలవకు పొడిగింపు మాత్రమేనని, తోటపల్లి బ్యారేజీకి జలసంఘం ఇదివరకే అనుమతినిచ్చింది కాబట్టి ఇప్పుడు కొత్తగా జల సంఘం అనుమతి తీసుకొనే అవసరం ఉండకపోవచ్చని నీటిపారుదలశాఖ సమాధానమిచ్చింది. ప్రణాళికా సంఘం ఇదివరకే ఆమోదించిన ప్రాజెక్టుల విషయంలో కూడా ఆయకట్టు మారే పక్షంలో తాజా అంచనాలతోపాటు సవరించిన ప్రాజెక్టు నివేదికలను, జలసంఘానికి సమర్పించాలని కేంద్ర జలసంఘం మార్గదర్శకాలు[10] స్పష్టం చేస్తున్నందున ప్రభుత్వ సమాధానం అంగీకారం కాదు.

[10] సాగునీటి, బహుళార్థ సాధక ప్రాజెక్టుల ప్రతిపాదనల సమర్పణ, పరిశీలన, క్లియరెన్సులకు కేంద్ర జల సంఘం 1989, 2002, 2010లలో జారీ చేసిన మార్గదర్శకాలు

*iii.* ***గుత్తేదారుకు అనుచిత ప్రయోజనం :*** ప్యాకేజీ II లో, బిడ్ల మూల్యంకనం చేయడం కోసం తీసుకున్న అంతర్గత అంచనా (ఐబీఎమ్) విలువ ₹178.56 కోట్లలో రైల్వే క్రాసింగ్ నిర్మాణాల నిమిత్తం ₹1.78 కోట్ల మొత్తం కలిసి ఉంది. ఐతే, సంబంధిత ఒప్పందపు నిబంధనను మార్చి, రైల్వేలకు గుత్తేదారు చెల్లించాల్సిన ₹2 కోట్ల భారాన్ని నీటి పారుదల శాఖ తన మీద వేసుకుంది.

గుత్తేదారుకిచ్చిన అనుచిత ప్రయోజనం గురించి ఆడిట్‌లో ప్రస్తావించగా, ఒప్పందాలలో ఒకదానికొకటి పొసగని అంశాలను అనుబంధఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా క్రమబద్ధీకరించుకునే అధికారాన్ని కల్పిస్తూ ప్రభుత్వం ఒక మెమో ఇచ్చిన (2006 ఫిబ్రవరి) దృష్ట్యా, ఒప్పందం చేసుకునే సమయంలో (2004 అక్టోబరు) సవరణను ('అడెండం') జారీ చేయడం సబబేనని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది.

ఐతే, (i) పనుల పరిధిలోనూ, ఐబిఎం విలువలోనూ రైల్వే వంతెనల విలువలు ఉన్నందున, వీటితోనే బిడ్లను పోల్చి చూసిన విషయాన్ని నీటిపారుదల శాఖ విస్మరించడం (ii) ఇదివరకే కుదుర్చుకున్న ఒప్పందాలలో పరస్పర విరుద్ధమైన అంశాలను తొలగించేందుకు మాత్రమే పైన చెప్పిన ప్రభుత్వ మెమో ఉపకరిస్తుందే తప్ప, టెండర్లకు విరుద్ధంగా ఒప్పందాల్లో మార్పులను చేయడానికిచ్చిన అనుమతి కాదు కాబట్టి ఈ సమాధానం అంగీకారం కాదు. పైగా, మెమో జారీ కావడానికి (2006 ఫిబ్రవరి) ముందే ఈ మార్పు/సవరణను (2004 అక్టోబరు) చేసిన దృష్ట్యా, ఈ మెమో ప్రస్తుత కేసుకు వర్తించదు.

## 5.3.4 వెంకటనగరం పంపింగ్ పథకం

### *5.3.4.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| ***లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు*** | *5 మండలాలలో 36000[11] ఎకరాలు, 31 గ్రామాలలో 1.2 లక్షల జనాభాకు తాగునీటి వసతి* |
| ***నీటి వనరు*** | *గోదావరి నది నుంచి 3.6 టీఎమ్‌సీ జలాలు* |
| ***ప్రాజెక్టులోని అంశాలు*** | *(i) మూడు పంపు హౌస్‌ల నిర్మాణం*<br>*(ii) నాలుగు డెలివరీ సిస్టర్న్‌లు*<br>*(iii) ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీలు, పంట కాలువల తవ్వకం* |
| ***పాలనాపరమైన అనుమతి*** | *తొలి అంచనా : ₹58.43 కోట్లు (2004 ఆగస్టు)*<br>*సవరించిన అంచనా : ₹124.18 కోట్లు (2008 మార్చి)* |
| ***ఖర్చు*** | *₹84.02 కోట్లు* |
| ***విద్యుత్తు*** | *10.45 మెగా వాట్లు* |
| ***భూ సేకరణ*** | *చేయాల్సింది : 621.02 ఎకరాలు, చేసింది : 341.57 ఎకరాలు* |

### *5.3.4.2 కీలకాంశాలు*

*i.* ***కేంద్ర జల సంఘం అనుమతి :*** జలయజ్ఞానికి ముందే ఉన్న వెంకటనగరం పంపింగ్ పథకం అనే ఈ చిన్నతరహా నీటి పారుదల పథకం 4,250 ఎకరాలకు సాగునీరందిస్తోంది. జలయజ్ఞంలో భాగంగా, ఆయకట్టును 36,000 ఎకరాలకు పెంచేలా (అంటే కొత్తగా 31,750 ఎకరాల ఆయకట్టును కల్పించి, ఇదివరకే ఉన్న 4,250 ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే విధంగా), ఈ పథకాన్ని మెరుగుపరచే చర్యలు చేపట్టారు. పర్యవసానంగా ఇది భారీ నీటి పారుదల ప్రాజెక్టుగా మారింది. కనుక దీనికి కేంద్ర జల సంఘం అనుమతి కావాలి. అయితే, ఏదశలోనూ, ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్ర జల సంఘానికి పంపలేదు.

వెంకటనగరం పంపింగ్ పథకం కింది ఆయకట్టు పోలవరం ప్రాజెక్టులో ఉందనీ, పోలవరానికి ఇదివరకే కేంద్ర జల సంఘం హైడ్రోలాజికల్ అనుమతి ఇచ్చినందున ఈ పథకానికి విడిగా అనుమతి అవసరం లేదనీ నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది. **ఐతే, పోలవరం ప్రాజెక్టుకు కేంద్ర జల సంఘం 2009 జనవరిలో అనుమతినివ్వగా వెంకటనగరం**

---

[11] 2012 సెప్టెంబరు నాటి తాజా వివరాలు తీసుకున్నందున వీటికి, పట్టిక 5.7 లోని అంకెలకూ వ్యత్యాసం ఉంది

పంపింగ్ పథకం విస్తరణ దానికి నాలుగు సంవత్సరాల ముందే 2005 మార్చిలో చేపట్టారు కనుక ఈ సమాధానం సరికాదు. పైగా, వెంకటనగరం ఆయకట్టు, నిర్మాణ వ్యయాల ప్రస్తావన పోలవరం ప్రాజెక్టు సమగ్ర నివేదికలో లేదు.

*ii.* ***పాలనాపరమైన అనుమతులు :*** మొదట్లో 30,000 ఎకరాల ఆయకట్టుకు సాగునీటినందించడం కోసం ఈ ప్రాజెక్టుకు 2004 ఆగస్టులో ₹58.43 కోట్లకు పాలనాపరమైన అనుమతినిచ్చారు. ఆ తర్వాత, ఆయకట్టును 36,000 ఎకరాలకు పెంచి 2008 మార్చిలో పాలనాపరమైన అనుమతిని ₹124.18 కోట్లకు సవరించారు. ఐతే, సవరించిన పాలనాపరమైన అనుమతిని ఆమోదించడానికి మూడేళ్ల ముందే టెండర్లు పిలిచి, 2005 మార్చిలో ₹85.57 కోట్ల విలువకు పనులప్పగించారు.

*iii.* ***పనుల స్థితిగతులు :*** ఈ ప్రాజెక్టుకు చెందిన పనులన్నింటిని, ఒకే ప్యాకేజీగా అప్పగించారు. పంపు హౌస్‌లకు సంబంధించిన మొదటి రెండు స్టేజ్‌లు, మూడవ స్టేజ్‌లోని ప్రెషర్‌మెయిన్, సివిల్ పనులు పూర్తయ్యాయి. ఐతే, నీటి పంపిణీ వ్యవస్థ పూర్తికాక పోవటం వలన ఇవి వినియోగంలోకి రాలేదు. రైతులు అభ్యంతరం చెప్పటంతో ప్రధాన కాలువ నిడివి 7.885 కి.మీ. నుంచి 6.60 కి.మీ. వరకు తగ్గించడం. రెండు పంపిణీ వ్యవస్థలను (IR, 3R) చేపట్టకపోవడం జరిగింది.

ఆ విధంగా, ఈ వెంకటనగరం పంపింగ్ పథకంపై గడచిన ఏడేళ్లలో దాదాపు ₹84 కోట్లు ఖర్చు చేసినప్పటికీ, సరైన ప్రణాళిక లేకపోవడంతో పాత ఆయకట్టుకు (4,250 ఎకరాలు) మాత్రమే సాగునీరు అందుతోంది. ఈ వాస్తవాలను నీటి పారుదలశాఖ అంగీకరిస్తూ, కోర్టు కేసులు, ఆయకట్టుదారుల నుండి వ్యతిరేకతలు, భూమికి సంబంధించి నష్టపరిహార వివాదాలు వీటికి కారణాలుగా ఆపాదించింది.

### 5.3.5 భూపతిపాలెం రిజర్వాయరు ప్రాజెక్టు

#### *5.3.5.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| *లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు* | *23086 ఎకరాలకు (దీనిని 14,028 ఎకరాలకు సవరించారు) సాగునీరు*<br>*తూర్పు గోదావరి జిల్లాలోని 45 గిరిజన గ్రామాలకు తాగునీరు* |
| *నీటి వనరు* | *గోదావరి నదికి ఉపనది అయిన సీతపల్లివాగు నుంచి 1.151 టీఎమ్‌సీలు* |
| *ప్రాజెక్టులోని అంశాలు* | *(i) మట్టికట్ట నిర్మాణం*<br>*(ii) స్పిల్ వే నిర్మాణం*<br>*(iii) హెడ్ స్లూయిస్ (ప్రధాన తూము)*<br>*(iv) మళ్లింపు రోడ్డు నిర్మాణం*<br>*(v) ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థల తవ్వకం* |
| *పాలనాపరమైన అనుమతి* | *తొలి అంచనా : ₹76.77 కోట్లు*<br>*సవరించిన అంచనా : ₹187.91 కోట్లు* |
| *ఖర్చు* | *₹160.07 కోట్లు* |
| *పునరావాస గృహాలు* | *నిర్మించాల్సినవి :149, పూర్తైనవి :149* |

#### *5.3.5.2 కీలకాంశాలు*

*i.* ***పనుల స్థితిగతులు:*** ఇది ఒక మధ్యతరహా సాగునీటి ప్రాజెక్టు. ఈ ప్రాజెక్టు కింద మొదట్లో 12,100 ఎకరాల ఆయకట్టును కల్పించాలని లక్ష్యించారు. కేంద్ర జలసంఘం 13,370 ఎకరాల ఆయకట్టుకు ₹47 కోట్ల అంచనా వ్యయంతో అనుమతిని ఇచ్చింది (2000 డిసెంబరు). ఆ తర్వాత, ఈ ఆయకట్టు 23,086 ఎకరాలకు పెరిగి ₹76.77 కోట్లకు పాలనాపరమైన అనుమతిని ఇవ్వడం జరిగింది (2003 అక్టోబరు).

జలయజ్ఞం చేపట్టే నాటికే ఈ జలాశయం పనులు జరుగుతున్నాయి. కాగా, ప్రధాన కాలువ, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థకు సంబంధించిన పనులను జలయజ్ఞం కింద ఒక గుత్తేదారు సంస్థకు 2005 సెప్టెంబరులో ఈపీసీ టర్న్‌కీ ప్రాతిపదికన

అప్పగించారు. అన్ని పనులనూ 2011 నాటికల్లా పూర్తిచేసి, అదే సంవత్సరం ఖరీఫ్‌కు నీటిని విడుదల చేయడమైంది. ఐతే, ఈ ప్రాజెక్టు పూర్తి అయినట్లు ప్రభుత్వం ఇంకా (2012 సెప్టెంబరు) ప్రకటించలేదు.

*ii.* ***ఆయకట్టును కల్పించడం :*** ఈ ప్రాజెక్టు అమలులో కేవలం 14,028 ఎకరాలనే అభివృద్ధి పరచారనీ, మిగిలిన 9,058 ఎకరాలు పొరుగునే ఉన్న మరో మధ్యతరహా ప్రాజెక్టు (ముసురుమిల్లి) లోకి తీసుకోవడంతో, ఆ మేరకు ఆయకట్టు ఈ ప్రాజెక్టు కిందకు రాలేదని గుర్తించడమైంది.

*iii.* భూపతిపాలెం రిజర్వాయరు, ప్రధాన కాలవలను మొత్తం 23,086 ఎకరాల ఆయకట్టు కోసమే రూపొందించి నప్పటికీ, అంతిమంగా అభివృద్ధి పరచిన ఆయకట్టు మాత్రం కేవలం 14,028 ఎకరాలే. ఆవిధంగా, ₹160.07 కోట్లను వెచ్చించి ఈ ప్రాజెక్టు ద్వారా పాక్షికమైన ప్రయోజనాలనే పొందారు. ఒకదానికొకటి సమీపంగా రెండు ప్రాజెక్టులను చేపట్టడంలో పథక రచన పేలవంగా ఉందని ఇది సూచిస్తోంది. ఈ రెండు ప్రాజెక్టుల్లోనూ కాలువ తవ్వకం, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ పనులను చేపట్టింది ఒకే గుత్తేదారు కావడం గమనార్హం.

స్థానిక రైతుల డిమాండ్ల కారణంగా ప్రాజెక్టు పరిధిని 23,086 ఎకరాలకు పెంచామనీ, క్షేత్రస్థాయి పరిశీలనల తరవాత, అంతిమంగా కేవలం 14,028 ఎకరాలు మాత్రమే ఉన్నట్టు తెలిసిందని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది.

## రాయలసీమ




రాయలసీమ ప్రాంతంలో మచ్చుకు తనిఖీ చేసిన తొమ్మిది ప్రాజెక్టుల్లో నిర్దేశించుకున్న **21.99** లక్షల ఎకరాలకుగాను 2012 సెప్టెంబరు నాటికి **5.92** లక్షల ఎకరాల ఆయకట్టును మాత్రమే కల్పించారు. ఈ తొమ్మిది ప్రాజెక్టులు 2012 సెప్టెంబరు నాటికి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ప్రాంతంలో లక్ష్యంగా పెట్టుకున్న, కల్పించిన ఆయకట్టు వివరాలను ఈ కింద ఇవ్వడమైంది.

పట్టిక - 5.8

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు (లక్షల ఎకరాల్లో) | కల్పించిన ఆయకట్టు | పూర్తి కావలసిన తేదీ | జాప్యం |
|---|---|---|---|---|---|
| 1 | గాలేరు నగరి | తొలి అంచనా : 3.25<br>సవరించిన అంచనా : 2.60 | శూన్యం | ఫేజ్ - I : 2007 ఫిబ్రవరి - 2009 అక్టోబరు<br>ఫేజ్ - II : 2011 జూన్ - 2011 నవంబరు | 35 - 67 నెలలు<br>10 - 15 నెలలు |
| 2 | హంద్రీ నీవా | 6.02 | శూన్యం | ఫేజ్ - I : 2007 ఫిబ్రవరి - 2009 డిసెంబరు<br>ఫేజ్ - II : 2009 నవంబరు - 2011 సెప్టెంబరు | 33 - 67 నెలలు<br>12 - 34 నెలలు |
| 3 | వెలిగొండ | 4.47 | శూన్యం | 2007 ఆగస్టు - 2013 ఆగస్టు | 0 - 61 నెలలు |
| 4 | తెలుగు గంగ | 5.23 | 4.36 లక్షల ఎకరాలు | 2007 ఫిబ్రవరి - 2012 ఏప్రిల్ | 5 - 66 నెలలు |
| 5 | సీబీఆర్ - లింగాల | 0.59 | శూన్యం | 2007 ఆగస్టు - 2009 మే | 40 - 61 నెలలు |
| 6 | గండికోట - సిబిఆర్ లిఫ్ట్ | 0.57 | శూన్యం | 2009 మే - 2009 అక్టోబరు | 35 - 40 నెలలు |
| 7 | పిబిసి ఆధునికీకరణ | కొత్తది : 0.37<br>స్థిరీకరణ : 0.60 | కొత్తది : శూన్యం<br>స్థిరీకరణ : 45000 ఎకరాలు | 2007 జూలై - 2009 డిసెంబరు | 33 - 62 నెలలు |
| 8 | సోమశిల | కొత్తది : 1.79<br>స్థిరీకరణ : 3.34 | కొత్తది : 1.56 లక్షల ఎకరాలు<br>స్థిరీకరణ : 2.75 లక్షల ఎకరాలు | 2007 మార్చి - 2011 జూన్ | 15 - 66 నెలలు |
| 9 | సోమశిల - స్వర్ణముఖి లింకు కాలువ | కొత్తది : 0.35<br>స్థిరీకరణ : 0.88 | శూన్యం | 2010 మే - 2011 జనవరి | 20 - 28 నెలలు |

*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డులు*

ఈ ప్రాజెక్టులకు సంబంధించిన కీలకాంశాలు కింద ఇవ్వడమైంది.

## 5.3.6 శ్రీ కృష్ణదేవరాయ గాలేరు నగరి సుజల స్రవంతి (గాలేరు నగరి)

### *5.3.6.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| **లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు :** | *చిత్తూరు, కడప, నెల్లూరు జిల్లాల్లో 3.25 (దీన్ని 2.6 కు సవరించారు) లక్షల ఎకరాలు* |
| **తాగు నీటి సౌకర్యాలు :** | *కాలువల మార్గంలో వచ్చే గ్రామాలు* |
| **నీటి వనరు :** | *శ్రీశైలం జలాశయం 'ఫోర్‌షోర్' నుండి 42 (38కి సవరించడమైంది) టీఎమ్‌సీ కృష్ణా నది వరద జలాలు* |
| **ఫేజ్ - I** | |
| **పాలనాపరమైన మంజూరీ :** | *₹4690.24 కోట్లు (2004 జూన్ - 2008 మార్చి)* |
| **ఖర్చు :** | *₹3630.30 కోట్లు* |
| **ప్రభావితమైన గ్రామాల సంఖ్య :** | *25* |
| **నిర్మించాల్సిన గృహాలు :** | *5665* |
| **పూర్తైన గృహాలు :** | *2252* |
| **ఫేజ్ - II** | |
| **పాలనాపరమైన మంజూరీ :** | *₹2525.91 కోట్లు* |
| **ఖర్చు :** | *₹306.69 కోట్లు* |
| **భూ సేకరణ** | *చేయాల్సింది : 55764.77ఎకరాలు, చేసింది : 44708.59 ఎకరాలు* |

### *5.3.6.2 కీలకాంశాలు*

*i.* ***నీటివనరులు :*** అధ్యాయం - 3లో వివరించినట్లు ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నీటి లభ్యతకు సంబంధించి వివిధ ప్రత్యామ్నాయాలను అన్వేషించడం కోసం 1995 డిసెంబరులో ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసారు. కృష్ణా నదిలో వరదనీరు **30** రోజుల పాటు, అదికూడా 40 శాతం సంవత్సరాల్లో మాత్రమే లభ్యమవుతుందని ఆ కమిటీ అభిప్రాయపడింది. ఐతే, ప్రభుత్వం ఈ పరిశీలనను పట్టించుకోకుండా, **45** రోజుల్లో 38 టీఎంసీల వరద నీటిని తీసుకొనేలా ప్రాజెక్టు పనులను అప్పగించింది. ఆ తరవాత, 30 రోజుల్లోనే 38 టీఎంసీల నీటిని గైకొనడం కోసం, గోరకల్లు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి ఔక్ రిజర్వాయర్ వరకు మొదట్లో అనుకున్న 10,000 క్యూసెక్కులకు బదులు 20,000 క్యూసెక్కుల నీరు విడుదలయ్యేలా కాలవ వ్యవస్థ రూపకల్పనను మార్చారు (2006 నవంబరు). కానీ, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్, శ్రీశైలం ప్రాజెక్టు కుడి గట్టు కాలువ, ప్రధాన కుడి కాలువల నీటి విడుదల సామర్థ్యాలను పెంచితేనే ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నీటిని శ్రీశైలం రిజర్వాయర్ నుండి తీసుకోవడం వీలవుతుంది. ఐతే, మొదట్లో అప్పగించిన గాలేరు నగరి ప్రాజెక్టు పనుల్లో ఈ అంశాలను చేర్చలేదు. ఈ ప్రాజెక్టును చేపట్టడంలో ప్రణాళికాలోపాన్ని ఇది సూచిస్తోంది.

*ii.* ***తగ్గిపోయిన ఆయకట్టు :*** కాలువల ద్వారా సాగునీటిని అందించే సాంప్రదాయక విధానంలో 3.25 లక్షల ఎకరాల ఆయకట్టు కల్పించాలనీ, మార్గంలోని గ్రామాలకు తాగు నీటిని అందించాలనీ ప్రభుత్వం తొలుత ఆశించింది. 2005 అక్టోబరులో ఆయకట్టును 2.6 లక్షల ఎకరాలకు కుదించారు. ఈ ప్రాజెక్టు కింద నీటి కేటాయింపులు ఈ కింద చూపిన విధంగా అనేక మార్పులకు లోనైంది.

పట్టిక - 5.9

| క్రమ సంఖ్య | నీటికేటాయింపు అంశం (టీఎమ్‌సీలలో) | సమగ్ర నివేదిక 1990 | సమగ్ర నివేదిక 1994 | తొలి కేటాయింపు (2006-07) | సవరించిన కేటాయింపు (2010-11) |
|---|---|---|---|---|---|
| 1 | సాగునీరు, తాగునీటి సరఫరా | 28.00 | 30 | 26.45 | 17.33 |
| 2 | ఆవిరికావడం, ఇంకిపోవడం, సరఫరా నష్టాలు | 13.76 | 8 | 7.55 | 3.67 |
| 3 | గండికోట ఎత్తిపోతల ద్వారా పులివెందుల బ్రాంచ్ కెనాల్ కింద 88,500 ఎకరాల ఆయకట్టుకు అదనంగా | --- | --- | 4.00 | 6.00 |
| 4 | గండికోట రిజర్వాయర్ నుండి సిబిఆర్ దాకా ప్రయోగాత్మక సూక్ష్మ సేద్య విధానంలో 1,26,000 ఎకరాలకు (1,06,000 + 20,000) ఎత్తిపోతల ద్వారా అందించడానికి | --- | --- | --- | 8.83 |
| 5 | జమ్మలమడుగు వద్ద బ్రహ్మణి స్టీల్ లిమిటెడ్‌కు | --- | --- | --- | 2.00 |
| 6 | తాడిపత్రి వద్ద ఎస్‌జెకె స్టీల్ ప్లాంటుకు | --- | --- | --- | 0.30 |
| 7 | రఘురాం సిమెంట్ పరిశ్రమలకు | --- | --- | --- | 0.09 |
| 8 | అనంతపురం జిల్లాలోని తాడిపత్రి నగరానికి తాగునీరు కోసం | --- | --- | --- | 0.60 |
| | మొత్తం | 41.76 | 38 | 38 | 38.820 |

*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డులు*

- పనులు ప్రారంభమైన తర్వాత, చిత్రావతి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్), పులివెందుల బ్రాంచి కెనాల్ (పీబీసీ)లకు14.83 టీఎంసీల నీటిని, మూడు ప్రైవేటు పరిశ్రమలకు 2.39 టీఎంసీల నీటిని కేటాయించారు. ప్రాజెక్టును ప్రారంభించేటప్పుడు ఈ కేటాయింపుల ఆలోచన లేదు.
- ఆవిరికావడం, ఇంకిపోవడం, సరఫరా నష్టాలను లెక్క గట్టడంలో ఒక పద్ధతి లేదు. ఈ నష్టాలను నీటి పారుదల శాఖ మొదట్లో (2006-07) 7.55 టీఎమ్‌సీలుగా లెక్కించింది. ఐతే, 2010 నవంబరులో ఈ నష్టాలు 3.67 టీఎమ్‌సీలు మాత్రమేనని లెక్కతేల్చింది. ఇంతకు ముందు లెక్కగట్టిన నష్టాలను కూడా పరిగణనలోకి తీసుకుంటే నీటి పారుదలకు లభ్యమయ్యేది కేవలం 13.45 టీఎమ్‌సీలు మాత్రమే. ఇది ఈ ప్రాజెక్టు కింద ప్రతిపాదించిన 2.6 లక్షల ఎకరాల ఆయకట్టులో కొంత భాగానికి మాత్రమే సరిపోతుంది.

సూక్ష్మ సేద్య విధానాన్ని అనుసరించడం వల్ల గాలేరు నగరి ప్రాజెక్టు కింద సాగునీటి ఆవశ్యకత తగ్గిపోయిందనీ, అలా మిగిలిన జలాలను సీబీఆర్, పీబీసీ ప్రాజెక్టులకు కేటాయించామనీ నీటిపారుదలశాఖ సమాధానమిచ్చింది. పారిశ్రామికీకరణను ప్రోత్సహించడం కోసం, జలాశయాల నిల్వలో 10 శాతాన్ని ప్రైవేటు పరిశ్రమలకు కేటాయించాలన్న ప్రభుత్వ విధానం మేరకే ఆయా సంస్థలకు నీటి కేటాయింపులు చేసామని కూడా తెలిపింది. ఐతే, సూక్ష్మ సేద్య విధానాన్ని ప్రాజెక్టు తొలి ప్రతిపాదనల్లో యోచించనూ లేదూ, ఇప్పటి వరకూ చేపట్టనూ లేదు కనుక ఈ సమాధానం అంగీకారం కాదు. పైగా, ఈ ప్రాజెక్టు కింద 2.6 లక్షల ఎకరాలకు సూక్ష్మ సేద్యాన్ని చేపట్టాలంటే కనీసం ₹880 కోట్ల[12] మేర అదనంగా భారీ పెట్టుబడులు అవసరమవ్వడంతో ప్రాజెక్టు మూల్యం గణనీయంగా పెరిగిపోతుంది.

ఇక నీరు ఆవిరికావడం, ఇంకిపోవడం, సరఫరా నష్టాలు తగ్గడం విషయానికి వస్తే అవి కాలువ వ్యవస్థ యొక్క రూపకల్పన, మట్టి స్వభావం వంటి వాటి మీద ఆధారపడి ఉంటాయనీ కనుక అవి మారవచ్చనీ నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది. ఐతే, 2006-07, 2010-11 మధ్య కాలంలో మట్టి స్వభావం మారకపోయినా ఈ నష్టాలు సగానికి పైగా ఎలా తగ్గిపోయాయో పై సమాధానం వివరించలేదు. పైగా నిజానికి, ఆ తర్వాత ఈ కాలువ వ్యవస్థ నీటి విడుదల సామర్థ్యం పెరిగింది. దానివల్ల వాస్తవానికి నీరు ఆవిరి కావడం, ఇంకిపోవడం, సరఫరా నష్టాలు పెరిగి ఉండాలి.

ఈ ప్రాజెక్టు ఆయకట్టులో కలిసిపోయిన సోమశిల స్వర్ణముఖి లింకు కాలువ (ఎస్ఎస్ఎల్‌సీ) పథకంలోని చిత్తూరు, నెల్లూరు జిల్లాల 90,000 ఎకరాల ఆయకట్టును వేరుచేయడం వల్ల, కడప జిల్లాలో అదనంగా మరో 25,000 ఎకరాల ఆయకట్టును గుర్తించడం వల్ల, మొత్తమ్మీద ఈ ప్రాజెక్టులోని ఆయకట్టు తగ్గిందని నీటి పారుదల శాఖ తెలిపింది. **2006 మేలో ఎస్ఎస్ఎల్‌సీని చేపట్టడానికి ముందే, 2005 అక్టోబరులోనే గాలేరు నగరి కింద ఆయకట్టును తగ్గించడం జరిగింది కనుక ఈ సమాధానం సరికాదు.** అంతే కాక , ఎస్ఎస్ఎల్‌సీ కింద కొత్తగా ఆయకట్టు 34,818 ఎకరాలు మాత్రమేనని, స్థిరీకరణ 88,182 ఎకరాలని ఆడిట్ గమనించింది. అంటే, మొదట్లో గాలేరు నగరి కింద చేర్చి, తర్వాత ఎస్ఎస్ఎల్‌సీకి బదిలీ చేసినట్లు చూపిస్తున్న ఆయకట్టు, నిజానికి మొత్తం కొత్త ఆయకట్టు కాదనీ, అప్పటికే ఉన్న ఆయకట్టులోని భాగం మాత్రమేననీ స్పష్టమౌతోంది.

*iii.* ***పనుల స్థితిగతులు :*** 2012 సెప్టెంబరు నాటికి గాలేరు నగరి 28 ప్యాకేజీలలో ఏఒక్కటీ పూర్తి కాలేదు. అటవీ శాఖ నుండి పొందాల్సిన భూములతో సహా భూసేకరణ చేయకపోవడం వల్ల 17[13] ప్యాకేజీ లలో పనుల పురోగతి మందకొడిగా ఉంది. ఈ కారణంగా 4, 7, 28 వ ప్యాకేజీ పనులను చేస్తున్న గుత్తేదారు సంస్థలు ఒప్పందాలను రద్దు చేయాలని కోరాయి. మిగిలిన ప్యాకేజీలలో పురోగతి కూడా అంతంత మాత్రమే.

---

[12] గండికోట ఎత్తిపోతల పథకం, పులివెందుల బ్రాంచ్ కెనాల్, సిబిఆర్-లింగాల కాలువలకు సంబంధించి నీటి పారుదల శాఖ కుదుర్చుకున్న (2009 ఫిబ్రవరి) ఒప్పందాల ప్రకారం సూక్ష్మ సేద్యం అమలుకయ్యే ఖర్చు ప్రతి 1000 ఎకరాలకు ₹3.385 కోట్లు. ఆ లెక్కన గాలేరు నగరి కింద మొత్తం 2.6 లక్షల ఎకరాల ఆయకట్టులో సూక్ష్మ సేద్యానికి కనీసం ₹880 కోట్లు కావాలి

[13] ప్యాకేజీల సంఖ్యలు 26 నుండి 29 వరకు, 2 నుండి 14 వరకు

- ప్రాజెక్టు పనులవల్ల భూములను కోల్పోయిన వారి ఆందోళనల కారణంగా ప్యాకేజీ 12/06 పనులు ఆగిపోయాయి.
- బిల్లులను చెల్లించకపోవడంతోపాటు అనేక ఇతర కారణాల వలన ప్యాకేజీ 14 పనులు 2011 మార్చి - అక్టోబరు మధ్య కాలంలో తాత్కాలికంగా నిలిచిపోయాయి. ఒప్పంద కాలం ముగిసిపోవడంతో గడువు పెంపుకు అనుమతించడం జరిగిందనీ, మిగిలిపోయిన పనులను పూర్తి చేసేలా గుత్తేదారుతో సంప్రదింపులు జరుపుతున్నామనీ డిపార్టుమెంటు తెలిపింది.
- ప్యాకేజీ 30లో, ఔక్ వద్ద మొదట్లో ప్రతిపాదించిన 16 మీటర్ల వ్యాసపు సొరంగం పనులను అప్పగించిన తర్వాత 11 మీటర్ల వ్యాసమున్న రెండు సొరంగాలుగా మార్చారు (2008 నవంబరు). ప్రత్యామ్నాయ డిజైను ఆమోదిస్తూ, సాంకేతిక కమిటీ సలహా మేరకు, మొదటి ప్రతిపాదనలో 500 మిల్లీమీటర్లుగా ఉన్న బెడ్ లైనింగ్ మందాన్ని 600 మిల్లీమీటర్లుగా ప్రభుత్వం నిర్దేశించింది (2009 డిసెంబరు). ఐతే, సవరించిన నిర్దేశాలకు అనుగుణంగా పని చేయడం కష్టమని గుత్తేదారు నిశ్చయించడంతో పనులు నిలిచిపోయాయి (2010 డిసెంబరు).
- గండికోట రిజర్వాయరు (ప్యాకేజి 1) పూర్తి కావొచ్చింది. ఐతే, 'హెడ్‌రీచెస్' లోని పనులు పూర్తి కానంత వరకూ, రిజర్వాయరువల్ల ప్రయోజనం లేదు. గడువును మూడు సంవత్సరాల మేర పెంచినప్పటికీ, 2005 - 07 మధ్య కాలంలో చేపట్టిన ప్యాకేజీల్లో ఏ ఒక్కటీ పూర్తికాలేదు.

అవసరమైన భూములను సేకరించకపోవడం, అటవీ అనుమతులు లేకపోవడం వల్లే పనుల పురోగతి మందగించిందని నీటిపారుదల శాఖ స్పష్టం చేసింది. ఐతే, పెన్నా నదిలోకి గణనీయంగా నీరు చేరుతున్నట్టు గత రికార్డులు సూచిస్తున్నాయని, వర్షాకాలంలో పెన్నా సొంత క్యాచ్‌మెంట్ నుండి గండికోట డ్యామ్‌లోకి నీరు చేరుతుందనీ, వాటిని సాగుకు ఉపయోగించవచ్చనీ ధీమా వ్యక్తం చేసింది.

## 5.3.7 అనంత వెంకట రామిరెడ్డి హంద్రీ నీవా సుజల స్రవంతి (హంద్రీ నీవా)

### *5.3.7.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు | *అనంతపురం (3.45 లక్షల ఎకరాలు), చిత్తూరు (1.40 లక్షల ఎకరాలు), కడప (0.38 లక్షల ఎకరాలు), కర్నూలు (0.80 లక్షల ఎకరాలు) జిల్లాల్లో మొత్తం 6.03 లక్షల ఎకరాలు* |
| తాగునీటి సదుపాయాలు | *నాలుగు జిల్లాల్లో 33 లక్షల జనాభాకు* |
| నీటి వనరు | *40 టీఎమ్‌సీ కృష్ణా జలాలు (మొదటి దశకు 14 టీఎమ్‌సీ; రెండోదశకు 26 టీఎమ్‌సీ)* |
| *మొదటి దశ (ఫేజ్ - I) :* | |
| పాలనాపరమైన అనుమతి : | *₹2774 కోట్లు (2007 జనవరి)* |
| ఖర్చు : | *₹2708.61 కోట్లు (2012 సెప్టెంబరు)* |
| విద్యుత్తు అవసరాలు : | *453.19 మెగావాట్లు* |
| *రెండో దశ (ఫేజ్ - II) :* | |
| పాలనాపరమైన అనుమతి : | *₹4076 కోట్లు (2007 జనవరి)* |
| ఖర్చు : | *₹3244.94 కోట్లు(2012 సెప్టెంబరు)* |
| విద్యుత్తు అవసరాలు : | *199.68 మెగావాట్లు* |
| భూ సేకరణ | *చేయాల్సింది : 46190 ఎకరాలు, చేసింది : 40955 ఎకరాలు* |
| పునరావాస గృహాలు | *నిర్మించాల్సినవి : 204, పూర్తైనవి : శూన్యం* |

### *5.3.7.2 కీలకాంశాలు*

*i.* ***పనుల పరిధిలో మార్పులు :*** ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్) ప్రకారం కృష్ణా నది (నందికొట్కూరు సమీపంలో మల్యాల గ్రామం వద్ద) నుండి స్టేజి - I పంపు హౌస్ వరకు 109.02 క్యూమెక్కుల నీటి సామర్థ్యంతో 3.4 కి.మి. పొడవైన ఒక అప్రోచ్ ఛానెల్ ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాజెక్టుకు అవసరమయ్యే నీటిని తీసుకోవాలను కున్నారు. శ్రీశైలం రిజర్వాయరు నీటి మట్టపు స్థాయిని పరిగణించి'అప్రొచ్ ఛానెల్' కు నీరు వచ్చే ఆఫ్‌టేక్ పాయింట్‌ను ఖరారు చేసారు (దీనికి పై మట్టంలో కృష్ణా నది వరద జలాలను వినియోగించుకోవచ్చు). ఐతే, ఆ తర్వాత, మల్యాల అప్రోచ్ ఛానెల్ నిర్మాణ పనులు జరుగుతుండగానే, అంతకంటే తక్కువ నీటి మట్టపు స్థాయి (శ్రీశైలం జలాశయం 'ఫోర్‌షోర్' లోని సిద్ధేశ్వరం) నుండి నీటిని తీసుకోవడానికి నీటి పారుదల శాఖ అదనపు ఏర్పాట్లను[14] నిర్దేశించుకుని, ఇందుకు సంబంధించి మొత్తం ₹250.66 కోట్ల విలువకు ఒప్పందాలను కూడా కుదుర్చుకుంది (2007 డిసెంబరు, 2008 జూన్).

+250 మీటర్ల నీటి మట్టం నుండి నీటినితీసుకొనేలా మాల్యాల్ ఛానెల్‌కు రూపకల్పన చేశామని, శ్రీశైలం డ్యామ్‌లో నీటి మట్టం అంత కంటే తక్కువకు పడిపోయినప్పుడు వేసవికాలంలో తాగునీటి సరఫరా కోసం +240మీటర్లు స్థాయి నుండి నీటిని తీసుకోవడానికి సిద్ధేశ్వరం దగ్గర అదనపు ఏర్పాట్లని చేశామంటూ నీటిపారుదల శాఖ సమర్ధించుకుంది.

ఐతే, శ్రీశైలం రిజర్వాయర్ స్పిల్ వే 'క్రస్ట్ లెవెల్' +252.98 మీటర్లు, మాల్యాల దగ్గర నీటి 'ఇన్‌టేక్' స్థాయి + 250మీటర్లు. ఆవిధంగా, నీటి పారుదల శాఖ మొదట్లోనే, శ్రీశైలం డ్యామ్ క్రస్ట్ లెవెల్‌కు దిగువ నుండే జలాలను తీసుకోవాలనుకుంది. కానీ ప్రస్తుతం అంతకన్నా తక్కువ స్థాయి +240మీటర్లు దగ్గర సిద్ధేశ్వరం సమీపం నుండి నీటిని తీసుకునే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. అంటే నీటి కొరత ఉన్న సంవత్సరాల్లో ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల నీటి అవసరాలను తీర్చేందుకు ఉద్దేశించిన శ్రీశైలం జలాశయం నిల్వ జలాల నుంచి నీటిని గైకొనాలని ఇప్పుడు ప్రతిపాదిస్తున్నారని దీని అర్థం.

*ii.* ***పనులను అప్పగించడం :*** టెండర్లను ఆహ్వానిస్తూ ఇచ్చిన నోటీసు ప్రకారం, అవినీతి చర్యలకు పాల్పడే గుత్తేదార్లకు/ వాటితో ప్రమేయమున్న గుత్తేదార్లకు ఏ కాంట్రాక్టు పనులనూ అప్పగించకూడదు. ఐతే, బ్యాక్‌బోన్ ప్రాజెక్ట్స్ లిమిటెడ్, లాసా - వాన్[15] అనే రెండు సంస్థలు అవినీతి చర్యలకు[16] పాల్పడిన కారణంగా వాటిని బ్లాక్ - లిస్ట్‌లో చేర్చాల్సి ఉన్నప్పటికీ, రెండు సంస్థలకూ ఆ తరవాత కూడా వరసగా **₹152.84 కోట్లు** (3 ప్యాకేజీలు), **₹ 8.10 కోట్ల** (ఒక ప్యాకేజీ) విలువైన పనులను అప్పగించారు.

*iii.* ***పనుల స్థితిగతులు :*** హంద్రీ నీవా లోని 70 ప్యాకేజీల్లో, 2012 సెప్టెంబరు నాటికి కేవలం ఒక్క ప్యాకేజి (జీడిపల్లి జలాశయం) మాత్రమే పూర్తయింది. మిగిలిన అన్ని ప్యాకేజీల్లో 2 - 3 సంవత్సరాల వరకూ జాప్యాలున్నాయి.

ఐతే, (i) కాలువ తవ్వకాన్ని స్థానిక రైతులు అడ్డుకోవడం, (ii) సీ - వర్గపు భూముల పరిహార సమస్యను రెవెన్యూ అధికారులు ఇంకా పరిష్కరించాల్సి ఉండడం, (iii) కొన్ని చోట్ల 'కంట్రోల్ బ్లాస్టింగ్' చేయాల్సిరావడం, (iv) తాము కోల్పోయిన పంట, భూమి, ఇళ్ళకు సంబంధించిన నష్టపరిహారం కోసం రైతులు పట్టుపట్టడం వంటివి ప్రాజెక్టు పూర్తిచేయడంలో జాప్యానికి కారణాలుగా నీటిపారుదల శాఖ తెలిపింది.

---

[14] (i) సిద్ధేశ్వరం నుండి 6.20 కి.మీ. పొడవైన ఒక అప్రోచ్ ఛానెల్ (ii) ముచ్చుమర్రి దగ్గర కొత్తగా ఒక పంపు హౌస్ (iii) ఈ కొత్త పంపు హౌస్ నుండి 21.75 కి.మీ. నిడివున్న ఒక పొడవాటి లింకు కాలువ - ఇది తిరిగి మల్యాల అప్రోచ్ ఛానెల్‌లోకే కలుస్తుంది

[15] మూడోపక్ష నాణ్యతా నియంత్రణ సంస్థ

[16] (i) ఒప్పందపు షరతులను పాటించకుండా, ₹5.88 కోట్ల అధిక చెల్లింపులను కోరడం (ii) పనులను చేయకుండానే ₹2.28 కోట్ల చెల్లింపులను కోరడం

- 2007లో రెండోదశ పనులను చేపట్టే నాటికి, 2004-05లో చేపట్టిన మొదటి దశ పనులు పూర్తికాలేదు. 2011 కల్లా పూర్తి కావాల్సి ఉన్న రెండోదశ పనులు కూడా 2012 సెప్టెంబరు నాటికి ఇంకా పూర్తికాలేదు.

రెండేళ్ల గడువును విధిస్తూ 2004-05 లో మొదటిదశ పనులను అప్పగించామని, రెండేళ్ల తరవాతనే రెండోదశ పనులకు పిలుపునిచ్చామని నీటి పారుదల శాఖ సమాధానమిచ్చింది.

- అన్ని లిఫ్టులను పూర్తిచేయకపోవడంవలన, మొదటి దశలోని ప్యాకేజీలు 33, 30లకు సంబంధించిన కాలువలు కింది ఫోటోలలో చూపిన విధంగా (2012 జూలై) పొదలు, బురద, రాళ్లూరప్పలు మొదలైన వాటితో పూడుకు పోతున్నాయి/నిండిపోతున్నాయి.





## 5.3.8 పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు (వెలిగొండ)

### *5.3.8.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| *లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు* | *ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, 15.25 లక్షల జనాభాకు తాగునీటి కల్పన* |
| *నీటి వనరు* | *వర్షాకాలంలో (జూలై - అక్టోబరు) శ్రీశైలం జలాశయం నుండి 43.5 టీఎమ్‌సీ ల కృష్ణా వరద జలాలు* |
| *పాలనాపరమైన అనుమతి* | *₹4785.82 కోట్లు (2008 మార్చి)* |
| *ఖర్చు* | *₹3127.82 కోట్లు* |
| *భూ సేకరణ* | *చేయాల్సింది : 29645ఎకరాలు ; చేసింది :21363 ఎకరాలు* |
| *ప్రభావితమయ్యే గ్రామాలు* | *11* |
| *పునరావాస గృహాలు* | *నిర్మించాల్సినవి 4148; పూర్తైనవి : శూన్యం* |
| *విద్యుత్తు అవసరాలు* | *14.70 మెగా వాట్లు* |

### *5.3.8.2 కీలకాంశాలు*

*i.* ***పాలనాపరమైన అనుమతులు :*** సమగ్ర ప్రాజెక్టు నివేదికను 1994 లో రూపొందించారు. ఐతే, రాష్ట్ర ప్రభుత్వం 7 పనులకు పలువిడతల్లో 8 పాలనా పరమైన మంజూరీలను, 11 సాంకేతికపరమైన మంజూరీలను ఇచ్చింది. ఉదాహరణకు, సొరంగం - I పనికి మొదట పాలనాపరమైన అనుమతిని ₹400 కోట్లకు ఇస్తే, సాంకేతికపరమైన మంజూరీని ₹699.93 కోట్లకు ఇచ్చి ఒప్పందాలను ₹624.60 కోట్లకు కుదుర్చుకున్నారు.

*ii.* ***ప్రాజెక్టు పనుల పరిధిలో మార్పులు :*** సమగ్ర ప్రాజెక్టు నివేదిక ప్రకారం, ప్రకాశం, కడప, నెల్లూరు జిల్లాల్లో 4.38 లక్షల ఎకరాల సాగు కోసం, వరదలు సంభవించే కాలంలో శ్రీశైలం జలాశయం నుండి 43.50 టీఎమ్‌సీ కృష్ణా జలాలను 45 రోజుల పాటు 11.34 మీటర్లు వ్యాసమున్న సొరంగ మార్గం ద్వారా తీసుకొనేలా ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేసారు. ఐతే, జలయజ్ఞం కింద ఈ ప్రాజెక్టును చేపట్టిన తర్వాత ప్రాజెక్టు పనుల పరిధి తగ్గిపోయింది.

స్టేజి - 1లో తక్కువ వ్యాసం అంటే 7 మీటర్లు వ్యాసమున్న సొరంగం ద్వారా కేవలం 10.7 టీఎమ్‌సీ జలాలను మాత్రమే 45 రోజుల పాటు తీసుకోవాలనీ, వీటితో 1.19 లక్షల ఎకరాలను సాగు చేయాలనీ ప్రతిపాదించారు. ఆ మేరకు టెండర్లను ఆహ్వానించి, సొరంగం, జలాశయాలు, కాలువలు మొదలైన పనులను అప్పగించడం (2004 నవంబరు - 2005 ఆగస్టు) జరిగింది. ఆ తర్వాత, స్టేజి - 2 పనులకు కూడా అనుబంధ ఒప్పందాలను కుదుర్చుకొని అప్పగించారు (2007 జూన్ - 2009 ఆగస్టు). ఐతే, అప్పటికే పూర్తైన కొన్ని పనులను మళ్లీ చేయాల్సిరావడంతో ₹2.88 కోట్ల అధిక వ్యయం జరిగింది.

ఇందుకు సంబంధించిన ఆడిట్ పరిశీలనలు ఈ కింది విధంగా ఉన్నాయి :

- ప్రాజెక్టును రెండు స్టేజిలలో చేపట్టాలని నిర్ణయించినప్పటికీ మొదటి, రెండు స్టేజిల్లోని పనులను పూర్తి చేసేందుకు గడువులను సూచిస్తూ శాస్త్రీయ పద్ధతిలో ఒక సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించలేదు.
- ఈ ప్రాజెక్టుకు 43.5 టీఎమ్‌సీ నీరు కావాల్సిఉండగా, సొరంగం-I, దానికి నీరందించే కాలువ (ఫీడర్ కెనాల్), మూడు నాన్-ఓవర్‌ఫ్లో డ్యామ్‌లు, లింకు కాలువలను తక్కువ సామర్థ్యంతో అంటే కేవలం 10.7 టీఎమ్‌సీ నీటిని మాత్రమే తీసుకొనేలా రూపకల్పన చేసి పనులను అప్పగించడం జరిగింది.
- ఈ ప్రాజెక్టుకు సంబంధించిన సొరంగం-II డిజైన్లను ఖరారు చేసేందుకు ఏర్పాటైన నిపుణుల కమిటీ, శ్రీశైలం జలాశయంలోకి చేరే జలాలనూ, ఈ జలాశయంపై ఆధారపడి నిర్మితమైన, నిర్మాణంలో ఉన్న, ప్రతిపాదించిన ప్రాజెక్టులకవసరమయ్యే జలాలనూ పరిగణనలోకి తీసుకొని వరద రోజులను శాస్త్రీయంగా లెక్కించాలని సూచించింది (2005 డిసెంబరు). ఐతే, ఇంతవరకూ అలాంటి అధ్యయనాలు జరిపిందీలేదు, ఈ ప్రాజెక్టుకు నీటి లభ్యతను ఖరారు చేసిందీలేదు (2012 సెప్టెంబరు).
- ఈ ప్రాజెక్టుకు మొత్తం 43.50 టీఎమ్‌సీల జలాలు అవసరమౌతాయి. ఈ నీటిని **45 రోజులలో**, 328 క్యూమెక్కుల నీటి విడుదల సామర్థ్యమున్న ఒకే సొరంగ మార్గం ద్వారా తీసుకోవాలని డీపీఆర్‌లో ఉద్దేశించారు. ఐతే, సవరించిన ప్రతిపాదనల్లో, జలాలను **30 రోజులలో**, ఈ కింద చూపిన విధంగా, రెండు సొరంగాల ద్వారా తీసుకోవాలని తలచారు :

**పట్టిక - 5.10**

| | సొరంగం వివరాలు | సొరంగము(ల) నీటి విడుదల మొత్తం సామర్థ్యం | నీటిని తీసుకొనే రోజులు | తీసుకోవాలని ప్రతిపాదించిన నీటి పరిమాణం | లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు (లక్షల ఎకరాల్లో) |
|---|---|---|---|---|---|
| డీపీఆర్ ప్రకారం | 11.34 మీటర్లు వ్యాసంతో ఒకే సొరంగం | 328 క్యూమెక్కులు | 45 రోజులు | 43.5 టీఎమ్‌సీలు | 4.38 |
| మొదట్లో అప్పగించిన పనుల ప్రకారం | 7 మీటర్లు వ్యాసంతో ఒక్క సొరంగం | 85 క్యూమెక్కులు | 45 రోజులు | 10.7 టీఎమ్‌సీలు | 1.19 |
| ప్రస్తుతం అమలు చేస్తున్నది | రెండు సొరంగాలు<br>సొరంగం 1 :<br>వ్యాసం 7 మీటర్లు<br>సొరంగం 2 :<br>వ్యాసం 9.2 మీటర్లు | 483.31 క్యూమెక్కులు | 30 రోజులు | 43.5 టీఎమ్‌సీలు | 4.47 |

*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డులు*

డీపీఆర్‌లో (11.34 మీటర్లు వ్యాసంతో) ఉద్దేశించిన సొరంగం విస్తీర్ణం, ప్రస్తుతం (7 మీటర్లు, 9.2 మీటర్లు వ్యాసాలతో) ఏర్పాటు చేస్తున్న సొరంగాల మొత్తం విస్తీర్ణాలు రెండూ లెక్కకు ఇంచుమించుగా ఒకటే అవడం వలన, నిర్దిష్టమైన కాలంలో ఈ సొరంగాల ద్వారా విడుదలయ్యే నీటి పరిమాణాలు కూడా సమానంగానే ఉండాలి. ఐతే, ఆమోదంపొందిన ఇప్పటి డిజైన్ల ప్రకారం, డీపీఆర్‌లో అనుకున్న విధంగా 45 రోజులకు బదులు, 30 రోజుల్లోనే 43.5 టీఎమ్‌సీ నీటిని తీసుకోవాలని తలచారు.

ప్రాజెక్టు పనులను రెండు స్టేజిలలో చేపట్టేలా ప్రణాళికలను రూపొందించామనీ, ఐతే, ఆ తర్వాత ప్రజలు, ప్రజాప్రతినిధుల అభ్యర్థనల మేరకు రెండో స్టేజి పనులను ప్రారంభించడానికి నిర్ణయించామనీ డిపార్టుమెంటు సమాధానమిచ్చింది. అంతిమంగా అవసరమయ్యే నీటి విడుదల కోసం, మొదట్లో 7 మీటర్లు వ్యాసంతో చేపట్టిన సొరంగాన్ని, 11.34 మీటర్లకు పెంచి ఉండేవారమనీ అయితే ఆ స్థాయి వద్ద వరద జలాలు లభ్యమయ్యే రోజులు పరిమితం కావడంతో, రెండు సొరంగాలు ఉండాలని నిర్ణయించామనీ, ఫలితంగా నీటిని 30 కంటే ఎక్కువ రోజులు తీసుకోవచ్చని కూడా తెలిపింది.

*iii.* ***పనుల అంతర్గత అంచనాలు - వాస్తవ విలువలు :*** నీటిపారుదల శాఖ సొరంగం - I ప్యాకేజీ అంతర్గత విలువను నిర్ణీత అంశాలను ఆధారంచేసుకొని ₹693 కోట్లుగా లెక్కగట్టింది (ఎస్ఎస్ఆర్ 2004-05). ఐతే, పనులు జరుగుతున్నప్పుడు, ఈ కింద చూపిన విధంగా, ₹172.06 కోట్ల మొత్తం మేరకు నిర్దేశాల్లో మార్పులు చేసారు.

**పట్టిక - 5.11**

| క్రమ సంఖ్య | అంచనా విలువను లెక్కించడంలో ఊహించిన అంశాలు | ఐబిఎంలో చూపిన మొత్తం (₹కోట్లలో) | నిర్వహిస్తున్న పనులు | వాస్తవ అవసరాల విలువ (₹కోట్లలో) | ఐబిఎంలో అధికంగా కేటాయించిన మొత్తం (₹కోట్లలో) |
|---|---|---|---|---|---|
| 1 | సొరంగం తవ్వకంలో 2 యంత్రాల (టీబీఎం) వాడకం | 210.00 | ఒక్క టీబీఎంనే వాడుతున్నారు | 105.00 | 105.00 |
| 2 | సొరంగానికి 'అడిట్' (నిలువు బొరియ లేదా కలుగు) ఏర్పాటు | 22.00 | ఒకే టీబీఎంనే వాడుతున్నందున 'అడిట్'ను ఏర్పాటు చేయలేదు | - | 22.00 |
| 3 | అంచనాలో యంత్రాల తుక్కు విలువను పరిగణించలేదు | - | టీబీఎం విలువలో 10 శాతాన్ని తుక్కుగా పరిగణించే పక్షంలో | 10.50 | 10.50 |
| 4 | ఎం20 గ్రేడ్ కాంక్రీట్‌లో 500 మి.మి. మందం లైనింగ్ చేయడానికి | 90.14 | ఎం 35 గ్రేడ్ కాంక్రీటుతో 300 మి.మి. లైనింగ్ చేయడానికి | 55.58 | 34.56 |
| మొత్తం | | | | | 172.06 |

*మూలం : నీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డులు*

వాస్తవికమైన సమాచారం లేకపోవడంతో అంచనాలను తయారు చేసేటప్పుడు కొన్ని అంశాలను ఊహించామని, బిడ్లను దాఖలు చేయాల్సిన గడువు ముగిసిన తర్వాతే ఇ - ప్రొక్యూర్‌మెంట్ వేదికలో అంతర్గత అంచనా విలువను పేర్కొనడం జరిగిందనీ , కనుక బిడ్డర్లెవరూ ఈ ఊహలను అవకాశంగా మార్చుకోలేదని నీటిపారుదల శాఖ తెలిపింది. ఐతే, అనిశ్చితమైన అంతర్గత అంచనావిలువ ఆధారంగానే బిడ్డరు 'కోట్' చేసిన మొత్తాన్ని పోల్చడం వల్ల, వాస్తవానికి అవసరమైన ధర కంటే ₹172.06 కోట్ల అధిక మొత్తానికి కాంట్రాక్టును అప్పగించినట్లయింది.

iv. **పనుల స్థితిగతులు :** ఈ ప్రాజెక్టును ఏడు ప్యాకేజీలుగా విభజించారు. ఆ ఏడు ప్యాకేజీలనూ ఆడిట్ సమీక్షించింది.

- వదులు మట్టి, నీటిబుగ్గలు ఎదురవడం చేత 2009 డిసెంబరు నుండి సొరంగాన్ని తొలిచే పని నిలిచిపోయింది. వదులు మట్టి ఎదురుకావడం వల్ల 16 నెలల పాటు సొరంగాన్ని తొలిచే ప్రక్రియ నిలిచిపోయిందని అంగీకరిస్తూ, ప్రస్తుతం పనులు చురుగ్గా సాగుతున్నాయని నీటిపారుదల శాఖ తెలిపింది (2012 జూలై).
- సొరంగం తవ్వకపు పనిలో పురోగతి మందకొడిగా ఉంది. సొరంగానికి నీరందించే కాలువ (ఫీడర్ కెనాల్) కూడా నిర్దిష్ట గడువులోగా పూర్తికాలేదు. కొన్ని పనుల పరిస్థితి (2012 జూలై) ఈ కింద చూపిన విధంగా ఉంది.



*'అక్విడక్టు'కు సంబంధించి పూర్తి కాకుండా ఉన్న సీఎమ్ మరియు సీడీ[17] పనులు*



*తూర్పు ప్రధాన కాలువ (కి.మీ. 6.00 -10.00 మధ్య) - అటవీ భూములను సేకరించకపోవడంవల్ల జాప్యం*

## 5.3.9 చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) కుడి కాలువ (లింగాల కాలువ) ఎత్తిపోతల పథకం

### 5.3.9.1 ప్రాజెక్టు స్వరూపం

| | |
|---|---|
| లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు | 59400 ఎకరాలు (మొదటి దశలో 25000 ఎకరాలు; రెండోదశలో 34400 ఎకరాలు) |
| నీటి వనరు | చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుండి 3.6 టీఎమ్‌సీ జలాలు |
| ఇతర ప్రయోజనాలు | 50000 జనాభాకు తాగునీటి సదుపాయాలు |
| ప్రాజెక్టులోని అంశాలు | 53 కిలోమీటర్ల పొడవున్న కాలువ |
| పాలనాపరమైన అనుమతి | తొలి అంచనా : ₹32 కోట్లు (2004 జూన్)<br>సవరించిన అంచనా : ₹626.82 కోట్లు (2006 అక్టోబరు - 2008 నవంబరు) |
| ఖర్చు | ₹300.57 కోట్లు |
| విద్యుత్తు అవసరాలు | 14.21 మెగా వాట్లు |
| భూ సేకరణ | చేయాల్సింది :2,856 ఎకరాలు, చేసింది :1,923 ఎకరాలు |

### 5.3.9.2 కీలకాంశాలు

i. ***ఆధారపడదగిన వనరుల నుండి జలాల లభ్యతను నిర్ధారించడం :*** చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కింద ఇప్పటికే ఉన్న ఆయకట్టులో 25 శాతానికే నీటిని అందించడం కష్టమౌతుంటే, ఈ జలాశయం పై ఆధారపడి మరో ప్రాజెక్టును ప్రతిపాదించడం సమంజసం కాదు. కాబట్టి, ₹626.82 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న లింగాల కాలువ వ్యవస్థ సాఫల్యం ప్రత్యామ్నాయ నీటి వనరులను కల్పించడం మీద ఆధారపడివుంది.

---

[17] క్రాస్ మ్యాసన్రీ, క్రాస్ డ్రైనేజీ పనులు

*ii.* **పనుల పరిధిలో చేసిన మార్పులు :** పులివెందుల బ్రాంచ్ కెనాల్ (పీబీసీ) వ్యవస్థ పరిధిలోని 59,500 ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ కోసం చిత్రావతీ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ (టిబీపీ ఎచ్ఎల్‌సీ) పథకంలో భాగంగా 10 టీఎమ్‌సీల నీటినిల్వ సామర్థ్యంతో నిర్మించారు. పీబీసీ వ్యవస్థకు కావల్సిన మొత్తం జలాలు 6.40 టీఎమ్‌సీలు.

లింగాలలోనూ, పులివెందుల నియోజకవర్గంలోని పక్కనున్న మండలాల్లో జనాభాకు తాగునీటి సౌకర్యాలు కల్పించడానికీ, 25000 ఎకరాలకు సాగునీటిని అందించడానికీ సీబీఆర్ మిగుల జలాల నుండి 3.60 టీఎమ్‌సీ నీటిని వినియోగించుకుంటూ సీబీఆర్ నుండి 64 కి.మీ. పొడవైన 'లింగాల కాలువ'గా పిలువబడే కుడి కాలువ తవ్వకపు పనులను చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించి, ₹32 కోట్లకు పాలనపరమైన మంజూరీనిచ్చింది (2004 జూన్). ఈ పనులకు టెండరు నోటీసును 2004 ఆగస్టు 18న జారీ చేసారు. అదే నెలలో (i) కాలువలో నీటి ప్రవాహ సామర్థ్యాన్ని 28.30 క్యూమెక్కుల నుండి 34.00 క్యూమెక్కులకు పెంచాలని (ii) కొత్తగా ఒక లింకు కాలువను తవ్వాలని (iii) నాలుగు చెరువులను అభివృద్ధి చేయాలని (iv) ఈ చెరువులకు నీటిని అందించేందుకు నాలుగు లిఫ్టులను ఏర్పాటు చేయాలని (v) స్ప్రిక్లర్ల సంఖ్యను, సామర్థ్యాలను పెంచాలని ప్రతిపాదిస్తూ పనుల పరిధి పెరిగిన కారణంగా సవరించిన అంచనా ₹150.43 కోట్లకు ఛీఫ్ ఇంజనీర్ మంజూరీనిచ్చారు (2004 ఆగస్టు). ఐతే, ఆయకట్టు మాత్రం పెరగలేదు. పనుల పరిధిని సవరించేటప్పుడు కాలువ పొడవును మొదట్లో నిర్దేశించిన 64 కి.మీ.లకు బదులు 53 కి.మీ.లకు తగ్గించారు. ఐతే, ఈ సవరించిన పనుల పరిధికి కూడా కట్టుబడడం జరుగలేదు. సూక్ష్మ సేద్య విధానానికి మారడం, ఉద్దేశించిన ఆయకట్టును 59,400 ఎకరాలకు పెంచడంతో పాటు నీటిపారుదల శాఖ పనుల పరిధిని తరచుగా మార్పులు చేస్తూ వచ్చింది. మొత్తమ్మీద, ఈ ప్రాజెక్టుకు ఐదు సార్లు పాలనాపరమైన అనుమతులనిచ్చారు. అదనపు పనుల కోసం మొదటిసారి ఒప్పందాన్ని కుదుర్చుకున్న సంస్థతోనే నాలుగు అనుబంధ ఒప్పందాలను కుదుర్చుకున్నారు. తొలి ఒప్పందం విలువ ₹148.05 కోట్లయితే, అప్పగించిన పనులు మొత్తం విలువ ₹336.20 కోట్లు. పనులను అప్పగించ డానికి ముందే పనుల పరిధిని ఖరారు చేసుకోలేదని దీన్నిబట్టి స్పష్టమౌతోంది. మొత్తం 59,400 ఎకరాల ఆయకట్టుకు సూక్ష్మ సేద్య విధానం అభివృద్ధి చేయాల్సి ఉండగా, ఒప్పందాలను 5000 ఎకరాలకు మాత్రమే కుదుర్చుకున్నారు.

తాగునీటి, సాగునీటి సౌకర్యాలను పొందుతామని ఎన్నడూ ఆశించి ఎరుగని ఎగువ ప్రాంతాల ప్రజలకు ఆ సదుపాయాలను కల్పించాల్సిన అవసరం ఉన్న దృష్ట్యానే ప్రాజెక్టు పనుల్లో తరచుగా మార్పులు చేసామన్న విషయాన్ని గమనించాలని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది.

## 5.3.10 పులివెందుల బ్రాంచ్ కాలువ ఆధునికీకరణ, సూక్ష్మ సేద్యం (పీబీసీ)

### *5.3.10.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| *లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు* | *అదనంగా 36,900 ఎకరాల ఆయకట్టు ; పులివెందుల నియోజకవర్గంలో 60,000 ఎకరాల స్థిరీకరణ* |
| *నీటి వనరులు* | *6.4 టీఎమ్‌సీ (4.4 టీఎమ్‌సీ తుంగభద్ర డ్యాం నుండి, 2 టీఎమ్‌సీ చిత్రావతి క్యాచ్‌మెంట్ ద్వారా)* |
| *పాలనాపరమైన మంజూరీ* | *₹ 657.43 కోట్లు* |
| *ఖర్చు* | *₹ 200.17 కోట్లు* |
| *విద్యుత్తు అవసరాలు* | *5.06 మెగావాట్లు* |
| *భూ సేకరణ* | *చేయాల్సింది : 2,385.41 ఎకరాలు, చేసింది : 1,491.07 ఎకరాలు* |

#### 5.3.10.2 కీలకాంశాలు

i. **ప్రాజెక్టు పరిధిలో మార్పులు :** తుంగభద్ర హైలెవెల్ కెనాల్ పథకం కింద 1973లో చేపట్టినదే ప్రస్తుతం ఉన్న ఈ పులివెందుల బ్రాంచ్ కాలువ (పిబీసీ) వ్యవస్థ. దీని పరిధిలో ప్రస్తుతం ఉన్న ఆయకట్టు స్థిరీకరణ కోసం 2005 లో మొదట ₹118.23 కోట్ల అంచనా వ్యయంతో కాలువ వ్యవస్థ ఆధునికీకరణ పనులను చేపట్టారు. ఆ తరవాత, సూక్ష్మ సేద్య విధానం ద్వారా ₹156 కోట్ల అంచనావ్యయంతో కొత్తగా మరో 36,900 ఎకరాల ఆయకట్టును అభివృద్ధి పరచాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది (2006 డిసెంబరు). పిమ్మట, పీబీసీ పరిధిలోని మొత్తం ఆయకట్టుకు సూక్ష్మ సేద్య విధానాన్ని (₹360 కోట్ల వ్యయంతో) అమలుచేయాలని నిర్ణయించారు (2008 నవంబరు).

పనులు జరుగుతున్న సమయంలో మైలవరం జలాశయానికి అదనంగా నీటిని అందించడం కోసం కాలువ వ్యవస్థ సామర్థ్యాన్ని మరో 400 క్యూసెక్కులు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది (2008 మే). ఐతే, గుత్తేదారు సంస్థ నిరాకరించడంతో నీటిపారుదల శాఖ ఆ సంస్థకు అప్పగించిన పనుల్లో నుండి తుంపెర 'డీప్‌కట్', బైపాస్ చానెల్ తవ్వకం పనులను తొలగించి, 2007 నవంబరులో మరో సంస్థకు అప్పగించింది. ఆధునికీకరణ పనులను మొదట్లో తక్కువ నీటి విడుదల సామర్థ్యం ఉండేలా చేపట్టి తర్వాత కాలువ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచడంతో, ప్రాజెక్టు రూపకల్పనలో సమగ్రమైన ప్రణాళికారచన కరువైందని స్పష్టమౌతోంది.

పనులు జరుగుతున్న సమయంలో ప్రజలు, ప్రజా ప్రతినిధుల ఇచ్చిన అభ్యర్థనల మేరకు ప్రాజెక్టు పరిధిలో మార్పులు చేయడం జరిగిందని డిపార్టుమెంటు సమాధానమిచ్చింది. ఐతే, ఇలాంటి భారీ ప్రాజెక్టులు ప్రజల అవసరాలను తీరుస్తూనే, సుస్థిరమైన సాంకేతికత, ఇంజనీరింగ్ ప్రాతిపదికల మీద ఆధారపడి ఉండాలి.

ii. **పనుల స్థితిగతులు:** ఈ ప్రాజెక్టులోని ఎనిమిది ప్యాకేజీ పనులు 2012 సెప్టెంబరు నాటికి వివిధ దశల్లో ఉన్నాయి. కనీసం ఒక్కటి కూడా పూర్తికాలేదు. 2008 సెప్టెంబరు - 2009 ఆగస్టు మధ్యకాలంలో నీటిపారుదల శాఖ ₹31.87 కోట్ల వ్యయంతో కొనుగోలు చేసిన ఎత్తిపోతలకు సంబంధించిన ఎలక్ట్రో - మెకానికల్ పరికరాలను ఇప్పటికీ ఉపయోగించలేదు.

భూసేకరణలో జాప్యం, ఎలక్ట్రో - మెకానికల్ పరికరాలను పరీక్షించి, వాటిని ఏర్పాటు చేయడానికి అవసరమైన నీరు, విద్యుత్తు లభ్యం కాకపోవడం వంటి వివిధ కారణాల వల్ల ప్రాజెక్టును అనుకున్న సమయానికి పూర్తి చేయలేకపోయామని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది.

### 5.3.11 సోమశిల స్వర్ణముఖి లింకు కాలువ (ఎస్ఎస్ఎల్‌సి)

#### 5.3.11.1 ప్రాజెక్టు స్వరూపం

| | |
|---|---|
| **లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు** | కొత్తగా 34,818 ఎకరాల ఆయకట్టును కల్పించడం<br>నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లో 316 చెరువుల పరిధిలోని 88,182 ఎకరాల స్థిరీకరణ |
| **నీటి వనరు** | 4.45 టీఎమ్‌సీ పెన్నా వరద జలాలు |
| **ఇతర ప్రయోజనాలు** | 0.2 టీఎమ్‌సీ జలాలతో 2.5 లక్షల జనాభాకు తాగునీటి సౌకర్యాల కల్పన |
| **ప్రాజెక్టులోని అంశాలు** | సోమశిల - కందలేరు వరద కాలువ నుండి 12.52 వ కి.మీ. వద్ద మొదలై 100.06 కి.మీ.ల దూరం ప్రవహిస్తుంది |
| **పాలనాపరమైన మంజూరీ** | ₹437.42 కోట్లు |
| **ఖర్చు** | ₹97.66 కోట్లు |
| **భూ సేకరణ** | చేయాల్సింది : 5,870 ఎకరాలు, చేసింది : 2,668 ఎకరాలు |

### *5.3.11.2 కీలకాంశాలు*

i. ***సాంకేతిక మంజూరీ :*** ఎస్ఎస్ఎల్‌సి పనుల అంచనాలకు సాంకేతిక మంజూరీ ఇవ్వక ముందే టెండర్లను ఆహ్వానించారు. నిజానికి టెండరు నోటీసులను జారీచేసిన ఏడు నెలల తరవాత అంచనాలను ఆమోదించారు. ఆడిట్ పరిశీలనను నీటిపారుదల శాఖ అంగీకరిస్తూ, ఇది అనుసరించాల్సిన విధానంలో జరిగిన ఈ పొరపాటు మాత్రమేనని, జలయజ్ఞం కింద పని ఒత్తిడి బాగా పెరిగిపోవడంవల్ల ఇలా జరిగిందనీ తెలిపింది.

ii. ***డిజైన్లను ఆమోదించడంలో జాప్యం :*** 2007 మే - సెప్టెంబరు మధ్యకాలంలో అప్పగించిన మూడు ప్యాకేజీ పనుల డిజైన్లను ఆమోదించడంలో జాప్యాలున్నాయి. మొత్తం 145 డిజైన్లు ఆమోదం పొందాల్సి ఉండగా, గుత్తేదారు 23 కట్టడాలకు మాత్రమే డిజైన్లను సమర్పించారు. వాటిల్లోనూ 14 డిజైన్లు మాత్రమే నీటిపారుదల శాఖ ఆమోదాన్ని పొందాయి. వీటి ఆమోదానికి కూడా నీటిపారుదల శాఖ నాలుగున్నర ఏళ్లకు పైగా సమయం తీసుకుంది. ఫలితంగా ప్రాజెక్టు పూర్తికావాల్సిన గడువు దాటి పోయింది. ప్యాకేజీ 17 పనులు జరుగుతున్నాయనీ, ప్యాకేజీ 15 లో అటవీ భూములను అప్పగించని కారణంగా పనులు నిలిచిపోయాయనీ, ప్యాకేజీ 16 లో కూడా అటవీ భూములను అప్పగించడం, వన్యప్రాణుల సంరక్షణ అనుమతులలో జాప్యం వల్ల పనులు నిలిచిపోయాయని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది.

## తెలంగాణ




తెలంగాణ ప్రాంతంలో మచ్చుకు తనిఖీ చేసిన 11 ప్రాజెక్టులకు లక్ష్యంగా పెట్టుకున్న **39** లక్షల ఎకరాల ఆయకట్టులో 2012 సెప్టెంబరు నాటికి **4.37** లక్షల ఎకరాల ఆయకట్టు ఏర్పాటైంది. ఆడిట్ మచ్చుకు తనిఖీ చేసిన ప్రాజెక్టులు 2012 సెప్టెంబరు నాటికి వివిధ దశల్లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టుల కింద లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు, కల్పించిన ఆయకట్టు వివరాలు ఈ కింది విధంగా ఉన్నాయి.

పట్టిక - 5.12

| క్రమ సంఖ్య | ప్రాజెక్టు | లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు (లక్షల ఎకరాల్లో) | కల్పించిన ఆయకట్టు | పూర్తి కావలసిన తేదీ | జాప్యం |
|---|---|---|---|---|---|
| 1 | దేవాదుల | 6.21 | 45000 ఎకరాలు | 2005 జూలై - 2014 ఆగస్టు | 0 - 60 నెలలు |
| 2 | నెట్టెంపాడు | 2.00 | శూన్యం | 2007 ఆగస్టు - 2009 జూలై | 38 - 61 నెలలు |
| 3 | ఇందిరా దుమ్ముగూడెం | 2.00 | శూన్యం | 2012 జనవరి- 2012 మార్చి | 6 - 8 నెలలు |
| 4 | రాజీవ్ దుమ్ముగూడెం | 2.00 | శూన్యం | 2012 ఫిబ్రవరి - 2013 ఫిబ్రవరి | 0 - 7 నెలలు |
| 5 | దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ | స్థిరీకరణ: 14.13 | ---- | 2011 నవంబరు - 2014 ఏప్రిల్ | 0 - 10 నెలలు |
| 6 | ఎస్ఎల్‌బీసీ సొరంగం | 3.70 | 2.13 లక్షల ఎకరాలు | 2008 మార్చి - 2012 ఫిబ్రవరి | 7 - 54 నెలలు |
| 7 | ఎల్లంపల్లి | కొత్తది :2.20 స్థిరీకరణ: 0.30 | శూన్యం | 2006 అక్టోబరు - 2011 నవంబరు | 10 - 71 నెలలు |
| 8 | ప్రాణహిత - చేవెళ్ళ | కొత్తది:16.40 | శూన్యం | 2010 నవంబరు - 2013 ఏప్రిల్ | 0 - 22 నెలలు |
| 9 | కొమరం భీమ్ ప్రాజెక్టు | 0.45 | 14000 ఎకరాలు | 2007 మార్చి | 66 నెలలు |
| 10 | శ్రీరామ్ సాగర్ రెండో స్టేజి | 4.04 | 1.65 లక్షల ఎకరాలు | 2007 మార్చి - 2010 మే | 28 - 66 నెలలు |
| 11 | కంతనపల్లి | స్థిరీకరణ: 7.5 | పనులను ఇంకా అప్పగించలేదు | | |

*మూలం : నీటి పారుదల - ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డులు*

ఈ ప్రాజెక్టులకు సంబంధించిన కీలక అంశాలను ఈ కింద చర్చించడమైంది.

## 5.3.12 జె. చొక్కారావు గోదావరి ఎత్తిపోతల పథకం (దేవాదుల)

### *5.3.12.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| ***లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు*** | *వరంగల్, నల్గొండ, కరీంనగర్‌లలో 6.47 లక్షల ఎకరాలు (తర్వాత 6.21 లక్షల ఎకరాలకు సవరించారు)* |
| ***నీటి వనరులు*** | *గోదావరి నది నుండి 38.182 టీఎమ్‌సీ, సొంత క్యాచ్‌మెంట్ ప్రాంతం నుండి 8.2 టీఎమ్‌సీ* |
| ***ప్రాజెక్టులోని అంశాలు*** | *పంపింగ్ కేంద్రాల నిర్మాణం, పైపులైన్లను వేయడం, 12 సాగునీటి చెరువులను అనుసంధానించడం, కాలువలు, డిస్ట్రిబ్యూటరీల తవ్వకం* |
| ***పాలనాపరమైన మంజూరీ*** | *₹9178.78 కోట్లు (ఫేజు I : 2003 జూన్, ఫేజు II : 2005 ఏప్రిల్, ఫేజు III : 2007 అక్టోబరు)* |
| ***ఖర్చు*** | *₹6351.77 కోట్లు* |
| ***లిఫ్టులు*** | *లిఫ్టుల సంఖ్య : 3, ఎత్తు : 1246 మీటర్లు* |
| ***విద్యుత్తు అవసరాలు*** | *484 మెగా వాట్లు* |
| ***భూ సేకరణ*** | *చేయాల్సింది : 20089 ఎకరాలు; చేసింది: 13840 ఎకరాలు* |
| ***పునరావాస గృహాలు*** | *నిర్మించాల్సినవి : 83, పూర్తైనవి : శూన్యం* |

### 5.3.12.2 కీలకాంశాలు

*i.* ***పరిధి మార్పు :*** 2002 ఫిబ్రవరిలో ప్రాజెక్టు డీపీఆర్‌ను ఒక కన్సల్టెంటుకు ₹4.15 కోట్లకు అప్పగించి తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని నిర్దేశించారు. కన్సల్టెంటు డీపీఆర్‌ను 2003 అక్టోబరులో సమర్పించగా 2007 మార్చిలో కేంద్ర జల సంఘం ఆమోదించింది. ఐతే, 2003 జూన్‌లో మొదటిదశకు, 2005 ఏప్రిల్‌లో రెండవదశకు పరిపాలనా పరమైన అనుమతి మంజూరు కాగా, మొదటిదశ పనులను 2004 జనవరిలో, రెండవదశ పనులను 2005 ఏప్రిల్‌లో, అంటే డీపీఆర్ ఆమోదానికి ముందే అప్పగించేసారు.

ప్రభుత్వ ఆదేశాల మేరకే ఈపీసీ విధానంలో పనులను అప్పగించామని నీటిపారుదల శాఖ తెలిపింది. కేంద్ర జలసంఘం నుండి అనుమతి రాకుండా, కనీసం కన్సల్టెంటు డీపీఆర్‌ను కూడా సమర్పించకుండానే పనులను అప్పగించాలని తీసుకున్న నిర్ణయంతో భారీమూల్యాన్ని చెల్లించుకోవలసివచ్చింది ఎందుకంటే పనుల పరిధిలో, ఆయకట్టు హద్దులలో భారీ మార్పులు వచ్చాయి. వివరాలను ఈ కింద చర్చించడమైంది.

- రామప్ప చెరువు పూర్తి స్థాయి రిజర్వాయరు మట్టాన్ని (ఎఫ్ఆర్ఎల్) సమగ్ర నివేదిక (డీపీఆర్) లో +209.38 మీటర్లుగా పేర్కొనగా, ములుగు డివిజను ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఇచ్చిన నీటిమట్టాల సమాచారం మేరకు నీటి పారుదల శాఖ ఎఫ్ఆర్ఎల్‌ను +202.97 మీటర్లుగా పరిగణించింది (2008 ఏప్రిల్). నీటి మట్టాలలోని ఈ తేడా గందరగోళానికి దారితీసింది. ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని ప్రత్యక్షంగా తనిఖీ చేసి, డీపీఆర్‌లో పేర్కొన్నదే సరైన విలువగా నిర్ణయించుకుని, వాస్తవ మట్టాలను ఖరారు చేయడానికి నీటిపారుదల శాఖకు ఏడు నెలలకు పైగా పట్టింది. ఇది చివరకు పనుల్లో జాప్యాలకు కారణమయ్యింది.

జరిగిన పొరపాటును నిర్ధారిస్తూ, సర్జ్‌పూల్ తాలూకు కనీస నీటిమట్టాన్ని నిర్ణయించడంలోనే జాప్యం జరిగిందనీ, మొత్తం పనుల్లో జాప్యం లేదనీ నీటిపారుదల శాఖ పేర్కొంది.

*ii.* ***ఉమ్మడి ఆయకట్టు:*** డీపీఆర్ ప్రకారం దేవాదుల పథకం ద్వారా 6.47 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందించాలని తొలుత ప్రతిపాదించారు. తెలంగాణలోని నాలుగు జిల్లాల్లో[18] ఇప్పటికే ఉన్న చెరువుల కింద సాగవుతున్న 0.77 లక్షల ఎకరాలు కూడా అందులో కలిసిపోయి ఉంది. ఐతే, లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు పనులు జరుగుతున్న సమయంలో ఈ కింద చూపిన విధంగా మారింది.

**పట్టిక - 5.13**

(ఎకరాలలో)

| | వరంగల్ | కరీంనగర్ | నల్గొండ | మెదక్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| డీపీఆర్‌లో పేర్కొన్న ఆయకట్టు | 4,44,081 | 14,833 | 1,49,459 | 38,197 | 6,46,570 |
| చేసిన పనుల ప్రకారం వాస్తవ ఆయకట్టు | 5,61,229 | 14,100 | 45,671 | శూన్యం | 6,21,000 |

*మూలం: నీటి పారుదల - ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డులు*

ఒకటి కంటే ఎక్కువ ప్రాజెక్టుల కింద చూపిన ఉమ్మడి ఆయకట్టు ఉన్న విషయాన్ని నీటిపారుదల శాఖ అంగీకరించింది. సాంకేతిక అంశాల ఆధారంగానూ, ప్రజా విజ్ఞప్తుల కారణంగా కొన్ని సర్దుబాట్లను చేయాల్సి వచ్చిందనీ, మొత్తం మీద దేవాదుల కింద లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టులో నికరంగా ఎలాంటి మార్పు లేదనీ నీటిపారుదల శాఖ తెలిపింది. ఐతే, మొత్తం మీద ఆయకట్టులో 25,570 ఎకరాల నికర తగ్గుదలకు కారణాలను పై సమాధానం వివరించలేదు.

[18] వరంగల్, కరీంనగర్, నల్గొండ, మెదక్. ఆతర్వాత, పనుల జరుగుతున్న సమయంలో మెదక్ జిల్లా ఆయకట్టును తీసివేశారు

సంబంధిత ప్రాంతంలోని మిట్టపల్లాల స్థాయి, కాలువల నిడివి వంటి పలు అంశాల ఆధారంగా స్థిరమైన విలువకు కట్టుబడి ఉండే కాంట్రాక్టు విధానంలో పనులను అప్పగించిన కారణంగా, ఆయకట్టు మట్టాలను (కాంటూర్లను) మధ్యంతరంగా మారిస్తే ప్రభుత్వ ఆర్థిక ప్రయోజనాలకు నష్టం వాటిల్లుతుంది.

*iii.* ***ఆచరణ సాధ్యంకాని ఒప్పందపు గడువులు :*** ఈ ప్రాజెక్టు కింద, చాలామటుకు ఈపీసీ ఒప్పందాల్లో పనులు పూర్తి కావడానికి గడువును 18 నుండి 36 నెలల[19] వరకూ ఉండేలా నిర్ణయించారు. ఈ గడువులోగానే పూర్తిస్థాయి సర్వే, ఇన్వెస్టిగేషన్, గుత్తేదారు సంస్థ ద్వారా అలైన్‌మెంట్ ప్రతిపాదనల సమర్పణ, నీటిపారుదల శాఖ ఆమోదం, అటవీ ప్రాంతాలను ఉమ్మడిగా గుర్తించడం, ప్రతిపాదనల ప్రక్రియలు, ఆమోదాలు, అనుమతులను పొందడం, పనులను చేయడం వంటి కార్యకలాపలన్నీ పూర్తి కావాలి. ఒక పక్క ఇవే అంశాలను జాప్యాలకు కారణాలుగా నీటిపారుదల శాఖ పేర్కొంటున్న దృష్ట్యా ఈ ఒప్పందపు గడువులు వాస్తవికంగా లేవని తెలుస్తోంది.

*iv.* ***కాలువల రూపకల్పన :*** దేవాదులలోని కొన్ని కాల్వల డిజైన్లు సరిగా రూపొందించలేదు. వివరాలు ఇలా ఉన్నాయి.

- డీపీఆర్‌లో, దక్షిణ ప్రధాన కాలువ విడుదల సామర్థ్యాన్ని ఒక క్యూసెక్కు నీటికి 220 ఎకరాలుగా[20] డిజైను చేసారు. ఐతే, ప్రాజెక్టు పనులు మొదలైన తర్వాత ప్రభుత్వం ఈ సామర్థ్యాన్ని, క్యూసెక్కుకు 150 ఎకరాలుగా మారుస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆ విధంగా, ప్రధాన కాలువకూ, దాని డిస్ట్రిబ్యూటరీలకూ డిజైన్లలో పొంతన లేదు.

డిజైనులో మార్పు జరిగిన విషయాన్ని అంగీకరిస్తూనే, దక్షిణ ప్రధాన కాలువ డిశ్చార్జి సామర్థ్యం తగినంతగానే ఉందని నీటిపారుదల శాఖ తెలిపింది. కానీ, డిజైనులో మార్పు మేరకు దక్షిణ ప్రధాన కాలువ మొత్తం ఆయకట్టును 57,575 ఎకరాల మేర తగ్గించిన దృష్ట్యా ఈ సమాధానం అంగీకారయోగ్యం కాదు.

- రెండో ఫేజులో అశ్వారావుపల్లి చెరువు కుడి ప్రధాన కాలువను 0.93 లక్షల ఎకరాలకు సాగునీరు ఇచ్చే విధంగా నిర్మిస్తూ ఉండగా, డిస్ట్రిబ్యూటరీల వ్యవస్థను మాత్రం 0.43 లక్షల ఎకరాలకు నీరందించేందుకు చేపడుతున్నారు. మిగిలిన 0.5 లక్షల ఎకరాల ఆయకట్టును ఈ ప్రాజెక్టు నుండి ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టుకు బదలాయించారు.

- ఇదే విధంగా, ఆర్ఎస్ ఘన్‌పూర్ కుడి గట్టు ప్రధాన కాలువను 1.51 లక్షల ఎకరాల సాగు కోసం డిజైనుచేసి చేపట్టగా, దీని కింది డిస్ట్రిబ్యూటరీలను 1.33 లక్షల ఎకరాల సాగుకు మాత్రమే చేపడుతున్నారు. మిగిలిన 0.18 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టు కిందికి బదిలీచేసారు.

నీటి అవసరాలు గరిష్టంగా ఉన్నప్పుడు సరఫరా చేయడం కోసం ప్రధాన కాల్వలకు అధిక సామర్థ్యంతో చేసిన డిజైను ఉపయోగ పడుతుందని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది. సాగునీటి అవసరాల గరిష్ట డిమాండు మేరకే (అంటే, పంటల సీజనులో ఒక పక్షం రోజులకు కావలసిన నీటి గరిష్ట డిమాండు మేరకు) ప్రాజెక్టులను రూపొందిస్తారు కాబట్టి, ఈ సమాధానం సమర్థనీయం కాదు.

*v.* ***పనుల స్థితిగతులు:*** దేవాదుల ప్రాజెక్టులో మూడు ఫేజులున్నాయి. మూడు ప్యాకేజీలతో కూడిన మొదటి ఫేజు 2004 జనవరిలో మొదలయ్యింది. ఐదు ప్యాకేజీలతో రెండో ఫేజు 2005 ఏప్రిల్‌లోనూ, ఎనిమిది ప్యాకేజీలతో

---

[19] మూడోదశకు సంబంధించిన ప్యాకేజీలు - V,VI,VII, VIII లు తప్ప. వీటి ఒప్పందపు గడువులు వరుసగా 57, 42, 48, 48 నెలలు

[20] అంటే, 220 ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని కల్పించాలంటే డిశ్చార్జి సామర్థ్యం ఒక క్యూసెక్కు ఉండేలా కాలువలకు రూపకల్పన చేయాలి

మూడో ఫేజు 2008 డిసెంబరులోనూ మొదలయ్యాయి. ఈ ప్రాజెక్టులోని 16 ప్యాకేజీలలో 15 ప్యాకేజీలను ఆడిట్‌లో సమీక్షించడమైంది.

- మొదటి దశలోని మూడు ప్యాకేజీలకుగానూ, ప్యాకేజీలు 45, 46 ల కింద కాలువ, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలు ఇంకా పూర్తి కాలేదు. ఫీల్డు చానళ్ళ వ్యవస్థ పనులను 2010 జూలైలో ఈపీసీ కాని ఒప్పందాలుగా గుత్తేదార్లకు అప్పగించారు. ఈ పనులు కూడా ఇంకా పూర్తికాలేదు.
- అవసరమైన మేరకు భూసేకరణ జరగని కారణంగా మిగిలిన ప్యాకేజీల పనులు చాలా నెమ్మదిగా జరుగుతున్నాయి.
- ప్యాకేజీ 46లోని డీ8 కి సంబంధించి భూసేకరణలోని జాప్యంవలన, పనులు నెమ్మదిగా కొనసాగుతుండడం వలన దీని కింద ఉద్దేశించిన 47,119 ఎకరాలకు సాగునీరందలేదు.
- సంబంధిత స్థలాన్ని అప్పగించినప్పటికీ, డీ9 కింది 17 మైనర్లు, సబ్ మైనర్ల పనులు ఇంకా మొదలు కాలేదు.
- దక్షిణ ప్రధాన కాలువ కింద 2011 ఖరీఫ్‌లో సాగయిన మొత్తం ఆయకట్టు 12,054 ఎకరాలు మాత్రమే.
- మొదటి దశలోని ప్యాకేజీ 46 కింది 19,643 ఎకరాల ఆయకట్టుకు ఫీల్డు చానళ్ళ నిర్మాణం పూర్తవ్వలేదు. పొలాల్లో పంటల సాగు కొనసాగుతుండడం దీనికి కారణంగా పేర్కొన్నారు.

## 5.3.13 జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం (నెట్టెంపాడు)

### *5.3.13.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు | *మహబూబ్‌నగర్ జిల్లాలోని 148 గ్రామాల్లో రెండు లక్షల ఎకరాలు* |
| నీటి వనరు | *కృష్ణా నదిపై ఉన్న జూరాల రిజర్వాయరు ఫోర్ షోర్ నుండి 21.425 టీఎమ్‌సీ* |
| ప్రాజెక్టులోని అంశాలు | *రెండు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లతో రెండు లిఫ్టులు. వీటికి తోడుగా ఎనిమిది ఆన్‌లైన్ బ్యాలన్సింగ్ రిజర్వాయర్లు* |
| లిఫ్టు | *ఎత్తు : 139 మీటర్లు* |
| విద్యుత్తు | *119 మెగావాట్లు* |
| పాలనాపరమైన మంజూరీ | *₹1428 కోట్లు (2005 జూన్)* |
| ఖర్చు | *₹1429.74 కోట్లు* |
| భూ సేకరణ | *చేయాల్సింది : 25412 ఎకరాలు, చేసింది: 20503 ఎకరాలు* |
| పునరావాస గృహాలు | *నిర్మించాల్సినవి : 2575, పూర్తైనవి : శూన్యం* |

### *5.3.13.2 కీలకాంశాలు*

*i.* ***డీపీఆర్‌లోని అంశాలకు అతిక్రమణలు :*** ఈ ప్రాజెక్టు డీపీఆర్ మొదట 2004 జూలైలో తయారైంది. నీటిపారుదల శాఖ 2005 నవంబరులో డీపీఆర్‌ను సవరించి రెండు ముఖ్యమైన మార్పులతో ప్రాజెక్టు పనులను మొదలు పెట్టింది. అవి - (i) పంపులు, మోటార్లకు కావలసిన విద్యుత్తును 62 మెగావాట్ల నుండి 119 మెగావాట్లకు పెంచడం, (ii) రిజర్వాయర్ల నిల్వ సామర్థ్యాన్ని 3.35 టీఎమ్‌సీ నుండి 5.19 టీఎమ్‌సీలకు పెంచడం. ఐతే, ఇలా సవరణలు ఉన్నా లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు పెరుగలేదు అంటే మొదట రూపొందించిన ప్రణాళికారచన సరిగాలేదని తెలుస్తోంది. మొదట రూపొందించిన డీపీఆర్‌లో గూడెందొడ్డి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిల్వ సామర్థ్యాన్ని 1.04 టీఎమ్‌సీగా, రేలంపాడు బ్యాలెన్సింగ్ రిజర్వాయరు నిల్వ సామర్థ్యాన్ని 2.31 టీఎమ్‌సీగా లెక్కించారు. ఐతే, వీటి సామర్థ్యాన్ని 1.19 టీఎమ్‌సీ, 4.0 టీఎమ్‌సీకి పెంచినా ఆయకట్టు మాత్రం తొలుత అనుకున్నదే. పై రెండు బ్యాలన్సింగ్ రిజర్వాయర్లే కాకుండా, అదనపు నిల్వ కోసం 6.73 టీఎమ్‌సీల నిల్వ సామర్థ్యంతో ఎనిమిది ఆన్‌లైన్ రిజర్వాయర్ల ఏర్పాటు కూడా ఈ ప్రాజెక్టు ప్రణాళికలో ఉంది. ఐతే, పనులను అప్పగించి (2005 ఆగస్టు - 2006

మార్చి) ఆరేళ్ళకుపైగా గడచినప్పటికీ, ఈ రిజర్వాయర్లను ప్రధాన కాలువలతో కలపాల్సిన ఫీడర్ చానళ్ళను నీటిపారుదల శాఖ ఖరారు చేయలేదు. ఈ ఆన్‌లైన్ రిజర్వాయర్లుండే ప్రదేశాలను కూడా నీటిపారుదల శాఖ కచ్చితంగా నిర్ధారించుకోలేదు.

ఏపీజెన్‌కోను సంప్రదించిన తరువాతనే పంపుల సంఖ్య, వాటి సామర్థ్యాలను మార్పు చేశామనీ, ఈపీసీ గుత్తేదారు సంస్థలు పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ చేసిన తర్వాత ఆన్‌లైన్ రిజర్వాయర్ల సామర్థ్యం పెంచడం జరిగిందని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది. ఆన్‌లైన్ రిజర్వాయర్లతో ఫీడర్ చానళ్ళను కలిపే విషయమై, ఈ పనులను చేపట్టేందుకు టెండర్లను ఆహ్వానించడం జరిగిందని తెలిపారు.

ii. ***ఆయకట్టును గుర్తించడం :*** 148 గ్రామాల్లో రెండు లక్షల ఎకరాలకు సాగునీరందించడం నెట్టెంపాడు ప్రాజెక్టు లక్ష్యం. డీపీఆర్‌లో 148 గ్రామాలనూ గుర్తించినప్పటికీ, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను అభివృద్ధి చేయాల్సిన పనులకు సంబంధించిన ఆరు ఒప్పందాలలో కేవలం 29 గ్రామాల పేర్లను మాత్రమే పేర్కొన్నారు. గుత్తేదారు సంస్థలు పూర్తిస్థాయి ఇన్వెస్టిగేషన్‌లను చేసిన తర్వాతనే వివరాలు ఖరారవుతాయని నీటిపారుదల శాఖ తెలిపింది. ప్రధాన కాలువపోయే మార్గంలో ఉన్న గ్రామాల పేర్లను మాత్రమే ఒప్పందాలలో ప్రస్తావించడం జరిగిందనీ, ఆమార్గంలో చుట్టుపక్కల ఉండే గ్రామాలకు కూడా డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ విస్తరిస్తుందనీ, లక్ష్యంగా పెట్టుకున్న రెండు లక్షల ఎకరాల ఆయకట్టు ఏర్పాటు సాధ్యమేననీ నీటిపారుదల శాఖ తెలిపింది.

iii. ***పనుల స్థితిగతులు :*** నెట్టెంపాడు ప్రాజెక్టులోని మొత్తం 14 ప్యాకేజీలనూ ఆడిట్ సమీక్షించగా, ప్రాజెక్టు పనులు చేయడంలో 38 నుండి 61 నెలల జాప్యం జరిగిందని వెల్లడయింది.

- ప్యాకేజీ లన్నింటిలోనూ పనుల పురోగతి చాలా నెమ్మదిగా ఉంది. ప్యాకేజీ సంఖ్య 102లో మాత్రం పనులు పూర్తయ్యాయి.
- ప్యాకేజీ 98లో, పనులను అప్పగించిన తర్వాత హెడ్ రెగ్యులేటర్, క్రాస్ రెగ్యులేటర్‌లను నిర్మించాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ ప్యాకేజీ పనులను చేస్తున్న గుత్తేదారు సంస్థకే అదనపు పనిగా అప్పగించామని నీటిపారుదల శాఖ తెలిపింది.
- ప్యాకేజీ 99లో, కుడి ప్రధాన కాలువ చివరి రీచ్ తాలూకు హైడ్రాలిక్ వివరాలకు ఇంకా ఆమోదం లభించలేదు.
- ఆమోదించాల్సి ఉన్న మొత్తం 3,658 డిజైన్లకుగానూ, 726 డిజైన్లకు మాత్రమే ఆమోదం లభించింది. 2,847 డిజైన్లను గుత్తేదారు సంస్థలు ఇంకా సమర్పించనేలేదు.

iv. ***కార్యకలాపాల ప్రాథమ్యాల నిర్ధారణ :*** ఎత్తిపోతల పథకాల్లో, లిఫ్టు పనులు పూర్తయితేనే బ్యాలన్సింగ్ రిజర్వాయర్లు ఉపయోగపడతాయి. అదేవిధంగా, రిజర్వాయర్లు నీటిని వదలగలిగితేనే కాలువలు వినియోగంలోకి వస్తాయి. ఐతే, నెట్టెంపాడు ప్రాజెక్టు విషయంలో కాలువలు, బ్యాలన్సింగ్ రిజర్వాయర్లను 2007 అక్టోబరు నాటికి పూర్తియ్యేలా, లిఫ్టు పనులు 2009 జూలై నాటికి పూర్తయ్యేలా పనులను అప్పగించారు. దీని వల్ల కాలువ పనుల మీద ప్రభుత్వ నిధులు ఇరుక్కుపోయాయి.

**మొదటి పంపు 24 నెలల్లోపు వినియోగంలోకి వస్తుందనీ, ఆ సమయానికి కాలువ పనులు పూర్తయ్యేలా వాటికి కూడా 24 నెలల గడువు ఇచ్చామని** నీటి పారుదలశాఖ తెలిపింది. ఒక్క పంపు మాత్రమే వినియోగంలోకి వస్తే కనీసం ప్రాజెక్టు మొదటి స్టేజీ అవసరాలుకూడా తీరవు. మొదటి స్టేజీలో రెండు కంటే ఎక్కువ పంపులు పనిచేసినప్పుడే మొదటి స్టేజీ కింది ఆయకట్టు నీటి అవసరాలు తీరి, రెండో స్టేజీకి నీరు చేరుతుంది. కాబట్టి ఈ సమాధానం అంగీకారం కాదు.

## 5.3.14 ఇందిరాసాగర్ దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం

### 5.3.14.1 ప్రాజెక్టు స్వరూపం

| | |
|---|---|
| లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు | ఖమ్మం, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో 2 లక్షల ఎకరాలు |
| నీటి వనరు | పోలవరం ప్రాజెక్టు ఫోర్‌షోర్ వద్ద గోదావరి నుండి 16.5 టీఎమ్‌సీ |
| పాలనాపరమైన మంజూరీ | ₹1824 కోట్లు (2005 డిసెంబరు) |
| ఖర్చు | ₹933.14 కోట్లు |
| లిఫ్టుల సమాచారం | సంఖ్య : 3 |
| విద్యుత్తు అవసరాలు | 229 మెగావాట్లు |
| భూ సేకరణ | చేయాల్సింది : 3815 ఎకరాలు; చేసింది : 1033 ఎకరాలు |

### 5.3.14.2 కీలకాంశాలు

i. **పని పరిధిలో మార్పులు :** వర్షాకాలంలో (జూలై నుండి సెప్టెంబరు వరకూ వరద వచ్చే సమయంలో) పోలవరం ప్రాజెక్టు ఫోర్‌షోర్ వద్ద గోదావరి నది నుండి 16.50 టీఎమ్‌సీ నీటిని ఎత్తిపోయడానికి ఇందిరాసాగర్ దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించారు.

- ప్రాజెక్టు పనులు చేస్తున్న సమయంలో, పనుల పరిధి, పంపింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిన స్థలాల్లో పలు మార్పుల కారణంగా పనుల్లో జాప్యం జరిగింది. పనులను అప్పగించడానికి ముందు అభివృద్ధిపర్చాల్సిన ఆయకట్టును గుర్తించకపోవడం వలన 50, 51 ప్యాకేజీ ల్లో ఒప్పందం గడువు ముగుస్తున్నా పనులు మొదలు కాలేదు.

ప్రాజెక్టు పనులను చేస్తున్నప్పుడు సాంకేతిక అంశాల కారణంగా పనుల పరిధిలో మార్పులు వచ్చాయని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది. భూసేకరణ, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థకు నీళ్ళందించే ప్రధాన కాలువ ప్రారంభ రీచ్‌లను ఖరారు చేయడంలోని జాప్యం వల్ల కూడా పనుల్లో ఆలస్యం జరిగిందని ఈ సమాధానంలో తెలిపారు.

- ప్యాకేజీలు 50, 51 ల కింద ఆయకట్టులేని కారణంగా 1.43 లక్షల ఎకరాలకు మించి ఆయకట్టును ఏర్పాటు చేయడం సాధ్యం కాదని, పనులు జరుగుతున్న సమయంలో గుత్తేదారు సంస్థలు తెలిపాయి. ఆవిధంగా 0.57 లక్షల ఎకరాల ఆయకట్టు తగ్గింది.

మండలాల వారీగానూ, గ్రామాల వారీగానూ ఆయకట్టును కన్సల్టెంట్లు గుర్తించారనీ, ఆవివరాలనే ఈపీసీ గుత్తేదారు సంస్థలకు ఇచ్చామనీ నీటిపారుదల శాఖ తెలిపింది. నీటిపారుదల శాఖ వద్దనున్న సమాచారం ప్రకారం ఆయకట్టు ఉన్నాదనీ, 50, 51 ప్యాకేజీ పనుల కాంట్రాక్టు సంస్థలను, పూర్తి స్థాయిలో మళ్ళీ సర్వే చేపట్టి మొత్తం 1.81 లక్షల ఎకరాల ఆయకట్టుకు సవరించిన ప్రతిపాదనలను సమర్పించాల్సిందిగా కోరామని కూడా ఈ సమాధానంలో తెలిపారు. డీపీఆర్‌లో ఆయకట్టు వివరాలను నిర్ధారించి, ఆ సమాచారాన్ని ఈపీసీ గుత్తేదారు సంస్థలకు కూడా అందజేసినప్పుడు, అవి ఆయకట్టును ఎందుకు కనుగొనలేకపోయామనే విషయాన్ని నీటిపారుదల శాఖ సమాధానం వివరించలేకపోయింది.

ii. **పనుల స్థితిగతులు :** పైపులైన్లు వేసే పనిలో ప్రధాన భాగం పూర్తయ్యింది. కానీ, పంపింగ్ కేంద్రాలు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ పూర్తి కాలేదు.

- ఒప్పందపు గడువు ముగిసిపోయినప్పటికీ, మొత్తం మూడు పంపింగ్ కేంద్రాల పనుల్లోనూ పురోగతి పేలవంగా ఉంది. ఒకటవ, రెండవ పంపింగ్ కేంద్రాల పనులు ప్రస్తుతం (2012 జూలై) జరుగుతున్నాయనీ, పర్యావరణ - అటవీ మంత్రిత్వ శాఖ అనుమతి వచ్చిన వెంటనే మూడో పంపింగ్ కేంద్రం పనులు మొదలవుతాయనీ ప్రభుత్వం తెలిపింది.
- ప్యాకేజీలు 50, 51 లలో, 56 నెలల ఒప్పందపు గడువులో పంపిణీవ్యవస్థ ఏర్పాటుకు సర్వే, ఇన్వెస్టిగేషన్‌లను మాత్రమే గుత్తేదార్లు పూర్తి చేసారు. కానీ, వాస్తవంగా చేయాల్సిన పనులేవీ చేయలేదు.
- పైపుల తయారీ, పైపులైన్లను వేసే పనుల పురోగతి బాగానే ఉన్నా 21, 22, 31వ ప్యాకేజీలలో కూడా అప్రోచ్ చానల్‌కు మట్టితవ్వకం, ట్యాంకులు, ఔట్‌ఫాల్ రెగ్యులేటర్ల నిర్మాణం వంటి పనులు ప్రారంభం కాలేదు లేదా ప్రారంభ స్థితిలోనే ఉన్నాయి. ఇప్పుడు భూ సేకరణ పూర్తయిందనీ, అటవీ అనుమతులు వచ్చాయనీ నీటిపారుదల శాఖ తెలిపింది.
- ప్యాకేజీ 49 లో, ఎడమ ప్రధాన కాలువను మొత్తం 90 కి.మీ.ల మేర తవ్వాల్సి ఉండగా, 2012 జూలై నాటికి కేవలం 7.88 కి.మీ మాత్రమే పూర్తయ్యింది.

## 5.3.15 రాజీవ్ దుమ్ముగూడెం ఎత్తిపోతల పథకం

### *5.3.15.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| *లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు* | *ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో రెండు లక్షల ఎకరాలు* |
| *నీటి వనరు* | *ఖమ్మం జిల్లా, అశ్వాపురం మండలం, పాములపల్లి వద్ద వర్షాకాలంలో గోదావరి నది నుండి 16.5 టీఎమ్‌సీ ఎత్తిపోయాలని ప్రతిపాదించారు* |
| *ప్రాజెక్టులోని అంశాలు* | *ఆరు బ్యాలెన్సింగ్ ట్యాంకులు, ఏడు స్థాయిల్లో లిఫ్టింగ్* |
| *పాలనా పరమైన మంజూరీ* | *₹1681 కోట్లు (2005 డిసెంబరు)* |
| *ఖర్చు* | *₹699.82 కోట్లు* |
| *భూ సేకరణ* | *చేయాల్సింది : 4,042 ఎకరాలు, చేసింది : 737 ఎకరాలు* |
| *విద్యుత్తు అవసరాలు* | *120 మెగావాట్లు* |

### *5.3.15.2 కీలకాంశాలు*

*i.* ***పనుల స్థితిగతులు :*** ఏడు ప్యాకేజీలుగా చేపట్టిన ఈ ప్రాజెక్టును మూడేళ్ళలో పూర్తిచేయాలనే ప్రతిపాదన వాస్తవ రూపం దాల్చలేదు.

- ప్యాకేజీ 67 పనుల కాంట్రాక్టును పొందిన సంస్థ ఇప్పటివరకూ (2012 సెప్టెంబరు), కనీసం సర్వే, ఇన్వెస్టిగేషన్ పనులను కూడా పూర్తి చేయలేదు. తొంభై వేల ఎకరాల ఆయకట్టును ఏర్పరచాల్సిన పనికి సర్వే - ఇన్వెస్టిగేషన్‌లను ప్రారంభించని కారణంగా, పనిని రద్దుచేయాలని ప్రభుత్వ కార్యదర్శి 2009 ఆగస్టులో జారీచేసిన ఆదేశాలు కూడా అమలు కాలేదు.
- ఈ ప్రాజెక్టును పూర్తి చేయడానికి సుమారు 1503 ఎకరాల అటవీ భూమిని సేకరించాల్సి ఉండడం ఒక ప్రధానమైన ఆటంకం కాగా, భూ సేకరణ ఇంకా ప్రారంభ దశలోనే ఉంది.

## 5.3.16 జ్యోతీరావు పూలే దుమ్ముగూడెం నాగార్జునసాగర్ సుజల స్రవంతి (దుమ్ముగూడెం నాగార్జునసాగర్ టెయిల్ పాండ్)

### *5.3.16.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| *లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు* | *సొంత ఆయకట్టులేదు; పూర్తిగా నదుల అనుసంధానానికి సంబంధించిన ప్రాజెక్టు;* <br> *నాగార్జునసాగర్ కింది 14.13 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించడానికి ఉద్దేశించింది* |
| *నీటి వనరులు* | *165 టీఎమ్‌సీ గోదావరీ జలాలను పాలేరునది ద్వారా కృష్ణా నదిలోకి కలపడం* |
| *ప్రాజెక్టులోని అంశాలు* | *244 కి.మీ.ల ప్రధాన కాలువ. ఇందులో 38.325 కి.మీలు జంట సొరంగాలు* |
| *పాలనాపరమైన మంజూరీ* | *తొలి అంచనా : ₹8,930 కోట్లు(2007 మే);* <br> *సవరించిన అంచనా : ₹19,521 కోట్లు (2009 ఫిబ్రవరి)* |
| *ఖర్చు* | *₹547.21 కోట్లు (2012 సెప్టెంబరు). గత ఏడాదిన్నర కాలంగా ఖర్చు లేదు.* |
| *లిఫ్టులు* | *సంఖ్య : 6* |
| *విద్యుత్తు అవసరాలు* | *1136 మెగావాట్లు* |
| *భూ సేకరణ* | *చేయాల్సింది : 10,225 ఎకరాలు, చేసింది : శూన్యం* |

### *5.3.16.2 కీలకాంశాలు*

*i.* ***ప్రాజెక్టు సాధ్యాసాధ్యాలు :*** ఈ ప్రాజెక్టుకు కొత్త ఆయకట్టు అంటూ ఏమీ లేదు. ఇది కేవలం నదుల అనుసంధానానికి సంబంధించింది. గోదావరి నదీ జలాలను మళ్ళించడం ద్వారా నాగార్జునసాగర్‌కు 165 టీఎమ్‌సీల అదనపు జలాలను చేర్చి ఆ ప్రాజెక్టు కింద ఇప్పటికే ఉన్న 14.13 లక్షల ఎకరాలకు ఖరీఫ్ పంటకాలంలో నీరందించి, ఆ ఆయకట్టును స్థిరీకరించడం ఈ ప్రాజెక్టు లక్ష్యం.

సాధ్యాసాధ్యాల అధ్యయన నివేదికనూ, డీపీఆర్‌నూ రూపొందించే పనిని ప్రభుత్వం 2006 జూలైలో వాప్కోస్ సంస్థకు అప్పగించి ఆరు నెల్లలోపు నివేదిక సమర్పించాలని నిర్దేశించింది. ఆ సంస్థ సుమారు నాలుగేళ్ళ జాప్యంతో 2010 అక్టోబరులో డీపీఆర్‌ను సమర్పించింది.

- గోదావరి నది నుండి మళ్ళించే జలాలను నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ పూర్తిగా నిల్వచేసుకోలేదు కాబట్టి, టెయిల్ పాండ్‌లోకి కాకుండా నాగార్జునసాగర్ రిజర్వాయరులోకే నేరుగా నీటిని మళ్ళించడం/ఎత్తిపోయడం చేయాలని డీపీఆర్ పరిశీలన కోసం ప్రభుత్వం నియమించిన ఒక కమిటీ అభిప్రాయ పడింది (2008 డిసెంబరు). ఐతే, ఈ సిఫార్సును తాజాగా తయారు చేసిన డీపీఆర్‌లో పరిగణనలోకి తీసుకోలేదు. తొలి ప్రతిపాదనల మేరకే పనులు కొనసాగుతున్నాయి.

- వర్షాకాలంలో వచ్చే గోదావరి జలాలను నాగార్జునసాగర్‌లోకి మళ్ళించేందుకు ఈ ప్రాజెక్టును చేపట్టడం జరుగుతోందనీ, కానీ, అదే సమయంలో నాగార్జునసాగర్‌లోకి కూడా నీరు భారీగా వచ్చి చేరుతుందంటూ ప్రాథమికమైన అంశాలను లేవనెత్తుతూ 2009 జూలైలో కేంద్ర జల సంఘం ఈ ప్రాజెక్టు మనుగడనే ప్రశ్నించింది. అలా కేంద్ర జలసంఘం ప్రాజెక్టు ప్రతిపాదనలను 2012 ఫిబ్రవరిలో తిప్పి పంపింది. కేంద్ర జలసంఘం వ్యాఖ్యలకు రాష్ట్ర ప్రభుత్వం వివరణను ఇంకా సమర్పించలేదు (సెప్టెంబరు 2012).

*ii.* ***ఆర్థికంగా ప్రాజెక్టు మనుగడ :*** 2007 మే లో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు సమర్పించినప్పుడు అప్పటికే ₹60,000 కోట్ల మేర ఖర్చుకాగల అనేక ప్రాజెక్టులు పురోగతిలో ఉన్న అంశం, ఇంకా అమలుకు హామీ ఇచ్చిన ప్రాజెక్టులు, పథకాల దృష్ట్యా ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం మీద ఆర్థిక శాఖ ఆందోళనను వ్యక్తం చేసింది.

ఐనా, ప్రభుత్వం ₹8,930 కోట్లతో ఈ ప్రాజెక్టుకు 2007 మే లో పాలనాపరమైన మంజూరీనిచ్చింది. పాలనాపరమైన మంజూరీ మొత్తాన్ని 2009 ఫిబ్రవరిలో ₹19,521.42 కోట్లకు పెంచింది. 2012 సెప్టెంబరు నాటికి చేసిన ఖర్చు ₹547.21 కోట్లు మాత్రమే.

iii. ***తగినంత పోటీ లేకపోవడం:*** డీపీఆర్‌ను రూపొందించడానికి ముందే ఈ ప్రాజెక్టు పనుల కాంట్రాక్టులను అప్పగించారు. బిడ్లను దాఖలు చేయడానికి గానీ, కాంట్రాక్టులను దక్కించుకోవడానికి గానీ పెద్దగా పోటీ లేదు. మొత్తం పది ప్యాకేజీలలో, రెండు ప్యాకేజీలను (1, 4 ప్యాకేజీలు) సింగిల్ బిడ్డర్లకే అప్పగించారు. ఏడు ప్యాకేజీలలో ఒక్కోదానికి కేవలం రెండేసి బిడ్ల చొప్పున మాత్రమే వచ్చాయి. మిగిలిన ఒక్క ప్యాకేజీకి (ప్యాకేజీ 2) ఐదు బిడ్లు వచ్చాయి. ఈ ప్యాకేజీలకు కాంట్రాక్టర్ల నుండి పోటీ తక్కువగానే ఉందని నీటిపారుదల శాఖ అంగీకరించింది. దేశంలో మొట్టమొదటిసారిగా 15 ఏళ్ల పాటు ప్రాజెక్టు ఆపరేషను, నిర్వహణలను చేయలనే నిబంధనను టెండర్లలో చేర్చడమే పోటీలేమికి కారణమని నీటిపారుదల శాఖ తెలిపింది.

- మూడవ ప్యాకేజీకి అంతర్గత అంచనాల (ఐబీఎమ్) విలువ ₹140 కోట్లు కాగా, వచ్చిన మూడు బిడ్లలో అతి తక్కువ మొత్తానికి వేసిన బిడ్ విలువ ₹124.65 కోట్లు. బిడ్లు 2008 జనవరి 28 వరకు చెల్లుబాటులో ఉండేవి. ఐతే, డిపార్టుమెంటు 2008 మార్చిలో బిడ్‌ను అంగీకరించగా, తక్కువ మొత్తాన్ని కోట్ చేసిన బిడ్డరు తన బిడ్ చెల్లుబాటు గడువును పొడిగించని కారణంగా టెండర్‌ను రద్దు చేసారు. 2008 జూలైలో మళ్ళీ బిడ్లను పిలిచినప్పుడు స్పందన కరువయ్యింది. మొదటిసారి పిలిచిన బిడ్లను చెల్లుబాటు గడువులోపు ఖరారు చేయని కారణంగా ₹140 కోట్ల అంచనాను, కొత్తగా చేర్చిన అంశాలతో కలిపి ₹252.72 కోట్లకు సవరించడం వలన ప్రభుత్వంపై అదనపు భారం పడింది. ఈ పనిని, చివరకు 2009 మేలో ₹265.30 కోట్లకు అప్పగించారు. కొత్తగా చేర్చిన అంశాల విలువను మినహాయించగా, ఎస్ఎస్ఆర్‌ల సవరణ వలనపెరిగిన వ్యయ భారం ₹43.02 కోట్లు.
- 2012 సెప్టెంబరు నాటికి ప్రాజెక్టు అమలు ఇంకా ప్రారంభం కాలేదు. మొత్తం 10 ప్యాకేజీ లకుగానూ, 7 ప్యాకేజీ ల్లో ఇన్వెస్టిగేషన్ పూర్తయింది. ఈ ప్యాకేజీ ల డిజైన్ల ఆమోదాలు నీటిపారుదల శాఖ వద్ద వివిధ స్థాయుల్లో ఉన్నాయి.

## 5.3.17 అలిమినేటి మాధవ రెడ్డి ప్రాజెక్టు (శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగం పథకం)

### *5.3.17.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు | *నల్గొండ జిల్లాలో 3.7 లక్షల ఎకరాలు* |
| నీటివనరు | *కృష్ణా నది నుండి 30 టీఎమ్‌సీ* |
| ప్రాజెక్టులోని అంశాలు | *శ్రీశైలం రిజర్వాయరు నుండి 4000 క్యూసెక్కుల నీటిని గురుత్వాకర్షణ శక్తి ద్వారా దిగువన ఉన్న దిండి బ్యాలెన్సింగ్ రిజర్వాయరుకు తీసుకువెళ్ళేందుకు 43.70 కిలోమీటర్లు సొరంగం;<br>దిండి బ్యాలన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం;<br>ఎస్ఎల్‌బీసీ ప్రధాన కాలువకు 7.25 కిలోమీటర్ల మేర రెండో సొరంగం,<br>ఇప్పటికేఉన్న ఏఎమ్ఆర్‌పి కాలువకు నీటిని తీసుకెళ్ళడానికి 25 కిలోమీటర్ల బహిరంగ కాలువ* |
| పాలనా పరమైన మంజూరీ | *₹2,813 కోట్లు (2005 ఆగస్టు)* |
| ఖర్చు | *₹1,479.99 కోట్లు* |
| భు సేకరణ | *చేయాల్సింది :5,566 ఎకరాలు, చేసింది : 1,566ఎకరాలు* |
| ప్రభావితమయ్యే గ్రామాలు | *9* |
| పునరావాస గృహాలు | *నిర్మించాల్సినవి : 2,154 ; పూర్తైనవి : 995* |

### *5.3.17.2 కీలకాంశాలు*

*i.* ***ప్రాజెక్టు సమగ్ర నివేదిక :*** నల్గొండ జిల్లాలోనాగార్జునసాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ నుండి నీరందని ప్రాంతాలకు సాగునీరు అందించడం కోసం నాగార్జునసాగర్ రిజర్వాయరు ఫోర్‌షోర్ నుండి ఒక హైలెవల్ కెనాల్, లిఫ్ట్ కెనాల్ల సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది (1979). దీనికి అనుగుణంగా, సాధ్యమయ్యే రెండు ప్రత్యామ్నాయాలతో నివేదికను సమర్పించడం జరిగింది (1980). అవి - (i) నాగార్జునసాగర్ రిజర్వాయరు నుండి ఎత్తిపోతల లిఫ్ట్ కెనాల్; (ii) శ్రీశైలం రిజర్వాయరు నుండి గురుత్వాకర్షణతో కూడిన గ్రావిటీ కెనాల్. ఈ రెండో ప్రత్యామ్నాయంపై పూర్తిస్థాయి ఇన్వెస్టిగేషన్‌ను చేయాల్సిందిగా ప్రభుత్వం ఆదేశాలిచ్చింది (1981). శ్రీశైలం రిజర్వాయరు నుండి ఒక సొరంగం తవ్వకంపై ఇన్వెస్టిగేషన్‌ను వేగవంతం చేయాలని 1983లో నిర్ణయించారు. 39 కి.మీల పొడవున సొరంగం తవ్వే పథకంలో అటవీ అనుమతులు కూడా పొందాల్సిఉండడంతో పాటు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాల్సి ఉండడం వల్ల సత్వర ప్రయోజనాల కోసం, దానికంటే తక్కువ పెట్టుబడి అవసరమైన ప్రత్యామ్నాయంగా నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి లిఫ్ట్ కెనాల్ పథకాన్ని చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. 1994-95లో ఈ పథకంపై అంచనా వ్యయం ₹801 కోట్లు. ఒకవైపు నాగార్జునసాగర్ ప్రాజెక్టు నుండి లిఫ్ట్ కెనాల్ పథకం పనులు కొనసాగుతుండగానే, రెండో ప్రత్యామ్నాయమైన సొరంగం పథకాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2005 లో ₹2,813 కోట్ల అంచనా వ్యయంతో జలయజ్ఞం కింద చేపట్టింది. అంతకుముందే, 1985లోనే సొరంగం పథకానికి సంబంధించిన డీపీఆర్‌ను కేంద్ర జలసంఘం అనుమతి కోసం సమర్పించారు. 30 టీఎమ్‌సీ నీటి లభ్యతను కచ్చితంగానూ, స్పష్టంగానూ నిర్ధారించితే తప్ప ప్రాజెక్టు పరిశీలనను చేపట్టలేమంటూ కేంద్ర జలసంఘం డీపీఆర్‌ను తిప్పి పంపింది. మరో ప్రత్యామ్నాయమైన, నాగార్జున సాగర్ ప్రాజెక్టు నుండి లిఫ్ట్ కెనాల్ పథకం డీపీఆర్‌ను కూడా కేంద్ర జలసంఘం ఇదే కారణంపై తిరస్కరించింది. ప్రాజెక్టు అంచనావ్యయం గణనీయంగా పెరిగినప్పటికీ పెరిగిన ధరలకు అనుగుణంగా ప్రభుత్వం డీపీఆర్‌ను సవరించలేదు. ఆవిధంగా, 30 టీఎమ్‌సీల స్పష్టమైన, కచ్చితమైన నీటి లభ్యతను ఇతమిద్ధంగా నిర్ధారించకపోవడం వలన శ్రీశైలం ఎడమ గట్టు కాలువ ప్రాజెక్టుకు రెండు ప్రత్యామ్నాయాలైన శ్రీశైలం రిజర్వాయరు నుండి గ్రావిటీ టనెల్ పథకాన్నిగానీ, నాగార్జునసాగర్ రిజర్వాయరు నుండి ఎత్తిపోతల పథకాన్ని కానీ కేంద్ర జల సంఘం ఆమోదించలేదు.

*ii.* ***పనుల స్థితిగతులు :*** శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం పథకంలో మొత్తం నాలుగు ప్యాకేజీలున్నాయి. వీటిలో, ఒకటవ సొరంగం, రెండవ సొరంగం, దిండి బ్యాలన్సింగ్ రిజర్వాయరు నిర్మాణాలకు సంబంధించిన రెండు ప్యాకేజీలను ఆడిట్‌లో సమీక్షించడమైంది. ఈ కింది అంశాలను ఆడిట్‌లో గమనించడమైంది :

- సొరంగం తవ్వే యంత్రాలకు (టన్నెల్ బోరింగ్ మెషిన్‌లకు) అడ్వాన్సును చెల్లించిన (2005 నవంబరు) తర్వాత వాటిని 'ఇండెంట్' చేయడానికి (2006 మే) ఏడు నెలల జాప్యం జరిగింది. 2007 మార్చి నుండి 2007 నవంబరు మధ్య ఈ యంత్రాలు వచ్చాయి. ఆవిధంగా, ఐదేళ్ళలో ఈ పనులను పూర్తి చేయలనేది లక్ష్యం కాగా రెండేళ్ళ సమయం సొరంగం తవ్వే యంత్రాల దిగుమతికే పట్టింది. పూర్తి స్థాయి ఇన్వెస్టిగేషన్ చేసి భౌగోళిక సమాచారాన్ని సేకరించిన తర్వాతనే ఈ యంత్రాల కొనుగోలుకు ఆదేశాలివ్వడం జరిగిందని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది.

- ఈ సొరంగం తవ్వే యంత్రం విడిభాగాలను కలిపి బిగించే పని 2007 డిసెంబరులో సొరంగం-1 నుండి నీరు బయటకు వెళ్లే మార్గం వద్ద ప్రారంభమయింది. సొరంగం తవ్వే పని 2008 మేలో మొదలైంది.

- మొదటి సొరంగం లోపలికి నీరు ప్రవేశించే ముఖ ద్వారం వద్ద రెండో టీబీఎమ్ విడిభాగాలను కలిపి బిగించే పనిలో జాప్యం జరిగింది. ఈ పని 2009 జూన్‌లో, అంటే, ఈ యంత్రం వచ్చిన (2007 నవంబరు) 18 నెలల తర్వాత మొదలైంది. అటవీ శాఖ అనుమతుల కారణంగానూ, భౌగోళిక పరిస్థితుల వలన మొదటి సొరంగం ప్రవేశ ముఖద్వారం స్థలాన్ని మార్పు చేసిన కారణంగానూ యంత్రం విడిభాగాలను కలిపి బిగించే పనిలో జాప్యం జరిగిందని నీటిపారుదల శాఖ తెలిపింది.

- ఈ యంత్రాల కొనుగోలు, విడిభాగాలను కలిపి బిగించే పని 16 నెలల్లోపు పూర్తికావల్సి ఉండగా గుత్తేదారు సంస్థ మూడేళ్ళకు పైగా సమయం తీసుకుంది.

- మూడు నెలల్లోనే రెండో టీబీఎమ్ వరదల్లో మునిగిపోయింది (2009 అక్టోబరు). ఈ విషయాన్ని కింది ఫోటోలో గమనించవచ్చు. పద్దెనిమిది నెలల తర్వాత యంత్రాన్ని పునర్వినియోగంలోకి తెచ్చారు. 2011 జూన్ నుండి సొరంగం తవ్వే యంత్రం మళ్ళీ పనిచేయడం ప్రారంభించింది. ఆ విధంగా, ఒప్పందంలో పేర్కొన్న గడువులోగా ప్రవేశ ముఖ ద్వారం వైపు సొరంగం తవ్వే పనిని ప్రారంభించలేకపోయారు.






మొదటి సొరంగాన్ని మొత్తం 43.93 కిలోమీటర్ల పొడవున తవ్వాల్సి ఉండగా 2012 సెప్టెంబరు నాటికి 14.10 కిలోమీటర్ల మేర మాత్రమే (లైనింగ్‌తో సహా) పూర్తయింది. రెండు యంత్రాలూ సగటున నెలకు ఒక కిలోమీటరు కంటే ఎక్కువ దూరం తవ్వాలనేది లక్ష్యం కాగా విద్యుత్తు గ్రిడ్ వైఫల్యం, విడి భాగాలు దొరక్కపోవడం, సొరంగం తవ్వే యంత్రం కట్టర్లను తరచుగా మారుస్తుండడం వలన వాస్తవంగా తవ్వింది 210.45 మీటర్లు మాత్రమే.

వన్యప్రాణి సంరక్షణ ప్రాంతంలో చేయాల్సిన సర్వే పనులపై ఆంక్షల వలన భౌగోళిక పరిస్థితులను లోతుగా అంచనా వేయలేక పోవడం జరిగిందనీ, పైగా యంత్రంలో ఏదైనా సమస్య తలెత్తితే దానిని అక్కడికక్కడే మరమ్మతు చేయాల్సి ఉంటుందనీ నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది. రెండో యంత్రం పనితీరు బాగానే ఉందనీ, ఇది సగటున నెలకు సుమారు 400 మీటర్ల పొడవున తవ్వుతోందనీ, 500 మీటర్ల మేరకు తవ్వే అవకాశం కూడా ఉందనీ నీటిపారుదల శాఖ తెలిపింది.

- దిండి బ్యాలన్సింగ్ రిజర్వాయరు నిర్మాణపు సివిల్ పనులు ఒప్పందపు గడువులోని 30 నెలలు పూర్తయిన తర్వాత కూడా మొదలుకాలేదు. 2012 జూలై నాటికి 25 కిలోమీటర్ల బహిరంగ కాలువ పనుల కాంట్రాక్టును ఇంకా ఎవరికీ అప్పగించలేదు. భూసేకరణలోని సమస్యలే జాప్యానికి కారణమని నీటిపారుదల శాఖ తెలిపింది. బహిరంగ కాలువ అంచనాలను రూపొందిస్తున్నామని కూడా నీటిపారుదల శాఖ తెలిపింది.

## 5.3.18 శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు (ఎల్లంపల్లి)

### *5.3.18.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు | *తొలి ప్రతిపాదన : కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో 4.5 లక్షల ఎకరాలు*<br>*సవరించిన ప్రతిపాదన : 2.20 లక్షల కొత్త ఆయకట్టు, కడెం ప్రాజెక్టు కింద 0.30 లక్షల ఎకరాల స్థిరీకరణ* |
| *నీటి వనరు* | *గోదావరి నది నుంచి 40 టీఎమ్‌సీల మళ్లింపు* |
| *ఇతర ప్రయోజనాలు* | *జాతీయ థర్మల్ విద్యుత్తు సంస్థకు (ఎన్‌టీపీసీకి) 6.5 టీఎమ్‌సీల నీటి సరఫరా*<br>*కడెం నారాయణరెడ్డి ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు అదనంగా 3 టిఎంసి ల నీటిని ఎత్తిపోయడం* |
| *ప్రాజెక్టులోని అంశాలు* | *కరీంనగర్ జిల్లా, రామగుండం మండలం, ఎల్లంపల్లి గ్రామం వద్ద గోదావరి నదిపై 20.16 టీఎమ్‌సీ ల స్థూల నిల్వ సామర్థ్యంతో ఒక బ్యారేజీ నిర్మించి పలుస్థాయిల్లో నీటిని ఎత్తిపోయడం; బ్యారేజీ కోసం 62 రేడియల్ గేట్ల నిర్మాణం* |
| పాలనాపరమైన మంజూరీ | *₹3,177.74 కోట్లు (2004 జూలై నుండి 2008 జూలై మధ్య ప్రభుత్వం జారీ చేసిన వివిధ ఉత్తర్వుల ద్వారా)* |
| ఖర్చు | *₹3,347.27 కోట్లు* |
| భూ సేకరణ | *చేయాల్సింది : 27,387 ఎకరాలు, చేసింది : 18,778 ఎకరాలు* |
| విద్యుత్తు అవసరాలు | *116.80 మెగావాట్లు* |
| పునరావాస గృహాలు | *నిర్మించాల్సినవి : 13,296 ; పూర్తైనవి : 1,448* |

### *5.3.18.2 కీలకాంశాలు*

*i.* ***ఆయకట్టును గుర్తించడం : (ఎ)*** రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ తవ్వకం కోసం ₹376.25 కోట్లతో 2008 జూన్‌లో ఒక ప్రత్యేక పాలనా అనుమతిని మంజూరు చేసారు. ఐతే, 1.66 లక్షల ఎకరాలకు తగిన డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థకు మాత్రమే ఈ కింద చూపిన ప్యాకేజిలుగా సాంకేతికపరమైన మంజూరీని ఇచ్చారు :

పట్టిక - 5.14

| | | |
|---|---|---|
| ప్యాకేజీ I కాలువ వ్యవస్థ | 49,500 ఎకరాలు | గంగాధర చెరువు కింద |
| ప్యాకేజీ II కాలువ వ్యవస్థ | 57,400 ఎకరాలు | రుద్రాంగి, నాగారం చెరువుల కింద |
| ప్యాకేజీ III కాలువ వ్యవస్థ | 58,800 ఎకరాలు | కొడిమ్యాల్, పోతారం, సూరంపేట, కొత్త చెరువు - 450, లచ్చుపేట చెరువుల కింద |
| మొత్తం | 1,65,700 ఎకరాలు | |

*మూలం: నీటి పారుదల - ఆయకట్టు అభివృద్ధి శాఖ రికార్డులు*

ఆవిధంగా, మొదట్లోనే 34,300 ఎకరాల ఆయకట్టు కొరవడింది. డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ప్యాకేజీ II పనులను ఇంతవరకూ చేపట్టలేదు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి మాత్రమే గ్రామాలవారీ ఆయకట్టు వివరాలను నీటిపారుదల శాఖ అందించింది. ఆదిలాబాదు జిల్లా విషయంలో మండలాలవారీ వివరాలను మాత్రమే సమర్పించి గ్రామాలవారీ ఆయకట్టు వివరాలను ఆడిట్‌కు అందజేయలేదు.

క్షేత్ర స్థాయి అధ్యయనం తర్వాత మిగిలిన ఆయకట్టును చేపడతామని ప్రభుత్వం సమాధానమిచ్చింది. ₹1.5 కోట్ల ఖర్చుతో డీపీఆర్‌ను రూపొందించి ఐదేళ్ళకు పైగా గడిచిపోయింది కాబట్టి, ఈ సమాధానం అంగీకారం కాదు.

(బి) రెండో స్టేజి ఒకటో ఫేజులో వివిధ చెరువుల కింద రెండు లక్షల ఎకరాల ఆయకట్టును అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. ఇలాంటి ప్రతిపాదిత చెరువుల్లో మూలవాగు కూడాఒకటి. ఈ చెరువు కింద కాలువల వ్యవస్థ పనిని 2005 ఏప్రిల్‌లో అప్పగించారు. **ఐతే, ఈ చెరువు కింది 13,500 ఎకరాల ఆయకట్టును ఆ తర్వాత ప్రాణహిత - చేవెళ్ళ ఎత్తిపోతల పథకంలోని ఒక ప్యాకేజీ కిందకు చేర్చారు.** దీనికి సంబంధించిన ఒప్పందం కూడా 2008 నవంబరులో ఖరారయింది. ఒకే ఆయకట్టును రెండు ప్యాకేజీల కింద చేర్చినందువలన, మూలవాగు తర్వాత భాగంలో గ్రావిటీ కెనాల్ తవ్వాల్సిన అవసరం ఉండదు. ఎల్లంపల్లి ఒప్పందం నుండి ఈ భాగాన్ని తొలగించడానికి నీటిపారుదల శాఖ ప్రతిపాదన చేస్తోంది.

ఎల్లంపల్లి, ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టుల కింద మండలాల వారీగానూ, గ్రామాల వారీగానూ ప్రతిపాదిత ఆయకట్టు వివరాలను పోల్చిచూసినపుడు, నాలుగు మండలాల్లోని ముప్పై గ్రామాలను రెండు ప్రాజెక్టుల కిందా ఉమ్మడిగా చూపించారని వెల్లడయింది.

ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టును ప్రతిపాదించక మునుపే, పూర్తిస్థాయిలో ఇన్వెస్టిగేషన్‌లను నిర్వహించిన తర్వాత ఎల్లంపలి ప్రాజెక్టు కింది ఆయకట్టును నిర్ధారించామని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది. ఐతే, పూర్తిస్థాయి ఇన్వెస్టిగేషన్‌ను నిర్వహించిన తర్వాతనే ఆయకట్టును నిర్ధారించి ఉంటే, ఈ ప్రాజెక్టు ఆయకట్టును మరో ప్రాజెక్టు కిందకు చేర్చే పరిస్థితి వచ్చేది కాదు.

## 5.3.19 డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ళ సుజల స్రవంతి (ప్రాణహిత - చేవెళ్ళ)

### *5.3.19.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| *లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు* | *తెలంగాణలోని ఏడు జిల్లాల్లో[21] 16.4 లక్షల ఎకరాలు* |
| *నీటి వనరులు* | *ప్రాణహిత నుండి 160 టీఎమ్‌సీ లు, ఎల్లంపల్లి వద్ద గోదావరి నది నుండి 20 టీఎమ్‌సీలు* |
| *ప్రయోజనాలు* | *సాగునీటికి 124 టీఎమ్‌సీలు, మార్గంలోని గ్రామాల తాగునీటికి 10 టీఎమ్‌సీలు,<br>హైదరాబాద్ - సికింద్రాబాద్ జంటనగరాల్లో తాగునీటి కోసం 30 టీఎమ్‌సీలు,<br>పారిశ్రామికావసరాల కోసం మరో 16 టీఎమ్‌సీలు* |
| *ప్రాజెక్టులోని అంశాలు* | *7 లింకులు, 7 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు; వీటితోపాటుగా ఇతర ప్రాజెక్టుల తాలూకు<br>5 బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను కూడా వినియోగించుకోవడం జరుగుతుంది.<br>849 కిలోమీటర్లు గ్రావిటీ కెనాల్, 209 కిలోమీటర్ల సొరంగం పనులు* |
| *పాలనాపరమైన మంజూరీ* | *మొదట ఇచ్చింది : ₹17,875 కోట్లు (2007 మే)<br>సవరించినది : ₹38,500 కోట్లు (2008 డిసెంబరు)* |
| *ఖర్చు* | *₹2,205 కోట్లు* |
| *లిఫ్టులు* | *సంఖ్య : 19, ఎత్తు : 493* |
| *విద్యుత్తు అవసరాలు* | *3466 మెగావాట్లు* |
| *భూ సేకరణ* | *చేయాల్సింది : 85,000 ఎకరాలు; చేసింది : 2,685 ఎకరాలు* |

### *5.3.19.2 కీలకాంశాలు*

*i.* ***ప్రాజెక్టు పరిధిలో మార్పులు :*** ప్రాణహిత నది నుండి 160 టీఎమ్‌సీల నీటిని వినియోగించుకోవడం ద్వారా ఆరు జిల్లాల్లో, 12.20 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని మొదట తలపెట్టారు. తదనుగుణంగా, 2007 మేలో ₹17,875 కోట్లకు పాలనాపరమైన మంజూరీనిచ్చారు. తర్వాత, ఈ కింది మార్పులు/చేర్పులతో ప్రాజెక్టు పరిధిని పెంచారు :

[21] ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి

- ఆదిలాబాద్ జిల్లాలోని ముథోల్, నిర్మల్ నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఎకరాల ఆయకట్టుకు సాగునీటి సౌకర్యం కల్పించడం, దేవాదుల ప్రాజెక్టు (మూడో ఫేజు) కింద నల్గొండ జిల్లాలో ఉన్న 67,500 ఎకరాల ఆయకట్టును ఈ ప్రాజెక్టుకు బదిలీచేయడం.
- రంగారెడ్డి జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్ మండలాల్లో సుమారు 1.5 లక్షల ఎకరాలకు ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీటి సౌకర్యం కల్పించడం.
- ఎల్లంపల్లి ప్రాజెక్టు రెండో స్టేజి రెండో ఫేజు కింద ఉద్దేశించిన 1.24 లక్షల ఎకరాల ఆయకట్టుకు కూడా ఈ ప్రాజెక్టు ద్వారా సాగునీరు అందించాలని ప్రతిపాదించడం.
- ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి 20 టీఎమ్‌సీల గోదావరి జలాలను ఈ ప్రాజెక్టుకు వినియోగించుకోవాలని కూడా నిర్ణయించడం.
- ప్రాణహిత నది నుండి ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని మళ్ళించే రోజుల సంఖ్యను 90 గానూ, నీటి ఆవశ్యకతను 160 టీఎమ్‌సీలుగానూ పరిగణించి, ఈ నీటి మళ్ళింపు వ్యవస్థ ప్రవాహసామర్థ్యాన్ని 462 క్యూమెక్‌ల నుండి 583 క్యూమెక్‌లకు పెంచారు.

ప్రాజెక్టు పరిధిలో పైన పేర్కొన్న భారీ మార్పుల పర్యవసానంగా పాలనాపరమైన మంజూరీని 2008 డిసెంబరులో ₹38,500 కోట్లకు సవరించారు. ప్రాజెక్టు సమగ్ర నివేదిక (డీపీఆర్)ను 2010 ఏప్రిల్‌లో సమర్పించగా, అంతకు ముందే 2008 మే నుండి 2009 మే మధ్యకాలంలోనే పనులను అప్పగించేసారు. ఒప్పందాలన్నింటిలోనూ పనులు పూర్తి చేయాల్సిన గడువును నాలుగేళ్లుగా నిర్దేశించగా, ఒప్పందాలు కుదుర్చుకున్న తర్వాత రూపొందించిన డీపీఆర్ మాత్రం ప్రాజెక్టును పూర్తిచేయడానికి గడువును ఎనిమిదేళ్ళుగా నిర్దేశించింది.

*ii.* ***అంతర్ రాష్ట్ర అంశాలు :*** ప్రాణహిత నదిపై అనువైన చోట్ల బ్యారేజీలను నిర్మించి తమ తమ ప్రాంతాలకు సాగునీటి సౌకర్యాన్ని కల్పించేందుకు వీలుగా మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు గోదావరి నది, దాని ఉపనదుల నీటి వినియోగంపై అంతర్ రాష్ట్ర ఒప్పందాలను కుదుర్చుకున్నాయి (1975 అక్టోబరు 6వ తేది, 1978 ఆగస్టు 7వ తేది). రెండు రాష్ట్రాల మధ్య ప్రత్యేక ఒప్పందం/ఒప్పందాలు కుదిరిన తర్వాతే ఇలాంటి బ్యారేజీల ఉమ్మడి ప్రాజెక్టు/ప్రాజెక్టులను చేపట్టాలి. ఒక్కో రాష్ట్రానికి అనుమతి ఉన్న నీటిని వినియోగించుకునే ప్రయత్నంలో, అంతకు ముందే నిర్దిష్టంగా అంగీకారం ఉన్న ప్రాజెక్టులు కాకుండా వేరే ప్రాజెక్టులను చేపట్టేప్పుడు ఇతర రాష్ట్రాల ప్రాంతాలు ముంపునకు గురి అయ్యేలా ఉంటే ఆయా రాష్ట్రాల ముందుస్తు సమ్మతితో తప్ప నిర్మాణం చేయరాదని కూడా అంగీకరించాయి.

ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టు సమగ్ర నివేదిక ప్రకారం, ఈ ప్రాజెక్టు వల్ల మొత్తం 6,140 ఎకరాల భూమి ముంపునకు గురవుతుంది. ఇందులో, 5247 ఎకరాల భూమి (85.45 శాతం) మహారాష్ట్ర పరిధిలో ఉంది. కానీ, అంతర్ రాష్ట్ర అంశాలు పరిష్కారం చేసుకోకుండానే, మహారాష్ట్ర ప్రభుత్వంతో దీనికి సంబంధించిన అధికారిక ఒప్పందమేదీ కుదుర్చుకోకుండానే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పనుల కాంట్రాక్టులను అప్పగించేసింది (2008 మే - 2009 మే).

ఒక అంతర్ రాష్ట్ర బోర్డును ఏర్పాటు చేసి ముంపు ప్రాంతాలకు సంబంధించి విధి విధానాల ముసాయిదాను రూపొందించుకోడానికి ఒక ఒప్పందాన్ని కుదుర్చుకుందామని 2010 అక్టోబరులో మహారాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ ప్రాజెక్టు తాలూకు డీపీఆర్ రూపకల్పన, ఇన్వెస్టిగేషన్, సంబంధిత ఇతర అంశాలను పర్యవేక్షించేందుకు ఒక అంతర్ రాష్ట్ర బోర్డును ఏర్పాటు చేయడానికి, 2012 మే లో రెండు రాష్ట్రాలూ ఒప్పందంపై సంతకాలు చేసాయి.

iii. ***ఆర్థికంగా ప్రాజెక్టు మనుగడ :*** 2007 మే లో ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను ఆర్థికశాఖకు సమర్పించినప్పుడు అప్పటికే ₹60,000 కోట్ల మేర ఖర్చుకాగల అనేక ప్రాజెక్టులు పురోగతిలో ఉన్న అంశం, ఇంకా అమలుకు హామీ ఇచ్చిన ప్రాజెక్టులు, పథకాల దృష్ట్యా ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం మీద ఆర్థిక శాఖ ఆందోళనను వ్యక్తం చేసింది. ప్రాజెక్టు పనుల టెండర్ల కోసం ఐబీఎమ్ విలువలను అప్‌లోడ్ చేసే లోగా ఈ అంశాలన్నీ పరిష్కరిస్తామని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం (2007 మే) ₹17,875 కోట్లకు పాలనాపరమైన మంజూరీని ఇచ్చింది. ఏడాదిన్నర తర్వాత పాలనాపరమైన మంజూరీ మొత్తాన్ని 115 శాతం పైగా పెంచి ₹38,500 కోట్లకు చేర్చారు (2008 డిసెంబరు). ఆయకట్టు 34 శాతం మేర మాత్రమే పెరిగింది.

iv. ***పనుల స్థితిగతులు :*** ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్యాకేజీలన్నింటికీ 'ఓపెన్ క్యాటగిరీ'లోనే టెండర్ల ప్రక్రియను నిర్వహించారు.

- మొత్తం 28 ప్యాకేజీలలో, ఒకటవ, రెండవ ప్యాకేజీలు 2010 ముగిసేనాటికి పూర్తవ్వాలి. మిగిలిన ప్యాకేజీలు పూర్తికావడానికి 2013 ఏప్రిల్ వరకు గడువు ఉంది. ప్రస్తుతం, ప్యాకేజీలన్నింటిలోనూ పనులు ప్రారంభ దశలో ఉన్నాయి.

దాదాపు అన్ని ప్యాకేజీ లలోనూ ప్రధాన కాలువ, సొరంగాల పనులకు ఇన్వెస్టిగేషన్ పూర్తయిందనీ, డిజైన్ల పనులు జరుగుతున్నాయనీ నీటిపారుదల శాఖ తెలిపింది.

- రాబోయే ఎనిమిదేళ్ళలోపు మొత్తం ప్రాజెక్టు పూర్తయ్యేలా ప్యాకేజీ లన్నింటిలోనూ మైలురాళ్ళను సవరించ డానికి ప్రభుత్వం 2011 జూన్‌లో ప్రాణహిత - చేవెళ్ళ ప్రాజెక్టు చీఫ్ ఇంజనీరుకు అనుమతినిచ్చింది. 2014-15 నుండి ప్రాజెక్టు ప్రయోజనాలు నిర్ణీత గడువులలో వరుసగా అందే విధంగా అనుబంధ ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా వివిధ ప్యాకేజీల గడువులను సవరించే చర్యలు తీసుకోవాలని కూడా ఆదేశించడం జరిగింది.
- ప్రాజెక్టు కోసం మొత్తం 85,000 ఎకరాల భూమి కావలసి ఉండగా, మచ్చుకు తనిఖీ చేసిన ఏడు ప్యాకేజీలలో (17, 18, 19, 23, 24, 25, 26) భూసేకరణ జరగనే లేదు. భూసేకరణ, పునరావాస-పునర్నిర్మాణ కార్యకలాపాలు జరగని కారణంగా రెండు రిజర్వాయర్ల పనులూ ఆగిపోయాయి. భూసేకరణ జోరుగా కొనసాగుతోందనీ, 22889 ఎకరాలకు అభ్యర్థన చేయడం, 1578 ఎకరాలను సేకరించడం పూర్తయిందని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది.

v. ***చెల్లింపు సూచీల్లో (పేమెంటు షెడ్యూళ్లు) మార్పులు :*** ఈ ప్రాజెక్టుకు సంబంధించిన ప్యాకేజీలన్నింటిలోనూ మొదట నిర్దేశించిన చెల్లింపు సూచీ (పేమెంటు షెడ్యూళ్ల) ల్లో సర్వే సంబంధిత అంశాలకు చేయాల్సిన చెల్లింపులను 0.43 శాతం నుండి 0.50 శాతంగా పేర్కొన్నారు. తర్వాత వీటిని 2 శాతం నుండి 3.50 శాతం వరకు పెంచారు. మొదట నిర్దేశించిన చెల్లింపు సూచీల ప్రకారం, ప్యాకేజీలన్నింటికీ కలిపి కేవలం **₹172.12** కోట్లను సర్వే పనులకు చెల్లించాల్సి ఉండగా, సవరించిన చెల్లింపుల సూచీల్లో దీన్ని అసాధారణ రీతిలో **₹1,211.23** కోట్లకు పెంచారు.

ఇన్వెస్టిగేషన్ పూర్తికాకుండా పనులను మొదలుపెట్టకూడదంటూ ప్రభుత్వం నిర్ణయించడంవల్ల ప్రాజెక్టులోని ప్యాకేజీలు అన్నింటికీ ఒకేసారి ఇన్వెస్టిగేషన్, డిజైన్లను చేపట్టడం కష్టంగా ఉంటుందనీ, పనుల అమలుకు సంబంధించిన మొత్తాలను జతచేయకపోతే మొదట నిర్దేశించిన చెల్లింపు సూచీల్లో కేటాయించిన మొత్తం సరిపోదనీ నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది.

### 5.3.20 శ్రీ కొమరం భీమ్ ప్రాజెక్టు

#### *5.3.20.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| *లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు* | *ఎడమ కాలువ కింద 39,500 ఎకరాలు, కుడి కాలువ కింద 6,000 ఎకరాలు, మొత్తం 45,500 ఎకరాలు.*<br>*దీన్నే పెద్దవాగు ప్రాజెక్టు అని కూడా పిలుస్తారు. ఇది ఒక మధ్య తరహా సాగునీటి ప్రాజెక్టు.* |
| *నీటి వనరు* | *పెద్దవాగు నది నుండి 8 టీఎమ్‌సీ* |
| *ప్రాజెక్టులోని అంశాలు* | *(i) మట్టికట్ట నిర్మాణం, (ii) స్పిల్‌వే నిర్మాణం, (iii) రెండు హెడ్ రెగ్యులేటర్లు, (iv) రెండు ప్రధాన కాలువలు - ఎడమవైపు : 65 కిలోమీటర్లు, కుడివైపు : 9 కిలోమీటర్లు* |
| *పాలనాపరమైన మంజూరీ* | *సవరించినది ₹450.14 కోట్లు (2009 ఫిబ్రవరి)* |
| *ఖర్చు* | *₹399.48 కోట్లు* |
| *భూ సేకరణ* | *చేయాల్సింది :7,288 ఎకరాలు, చేసింది : 6,057 ఎకరాలు* |
| *పునరావాస గృహాలు* | *నిర్మించాల్సినవి :2,091 ; పూర్తయినవి :1,995* |

#### *5.3.20.2 కీలకాంశాలు*

*i.* ***అటవీ అనుమతి :*** ఈ ప్రాజెక్టు కోసం 246.80 హెక్టార్ల అటవీ భూములను వినియోగించాల్సి ఉన్నందున పర్యావరణ - అటవీ మంత్రిత్వ శాఖ అనుమతి పొందాలి. అటవీ అనుమతుల కోసం ప్రతిపాదనలను విడతల వారీగా పంపగా, చివరకు 181.66 హెక్టార్లకు మాత్రమే పర్యావరణ - అటవీ మంత్రిత్వ శాఖ అనుమతి లభించింది. కేంద్ర జలసంఘం 2000 మే లో ఈ ప్రాజెక్టుకు ఆమోదం తెలుపగా, పనులను 2005 మార్చిలో అప్పగించారు.

హెడ్‌వర్క్స్‌కు సంబంధించి అటవీ అనుమతులను పొందే ప్రక్రియను 1999లోనే, అంటే, పనులను మొదలుపెట్టక మునుపే ప్రారంభించామనీ, 2006 లో అనుమతి వచ్చిందనీ నీటిపారుదల శాఖ తెలిపింది. ప్రధాన కాలువలో 34 వ కిలోమీటరు తర్వాత అవసరమైన అటవీ అనుమతుల కోసం ప్రాజెక్టు పనులను వాయిదావేసి ఉంటే, 14,000 ఎకరాల మేర ఆయకట్టుకు చెందిన రైతులకు సత్వర సాగునీటి ప్రయోజనాన్ని నిరాకరించినట్లయ్యేదని కూడా నీటిపారుదల శాఖ పేర్కొంది.

ఐతే, నీటిపారుదల శాఖ ప్రధాన కాలువ విషయంలో ఇదే పంథాను అనుసరించలేదు. అటవీ అనుమతుల ప్రక్రియను ప్రారంభించక మునుపే, 2005 మార్చిలోనే హెడ్‌వర్క్స్‌తో పాటుగా ప్రధాన కాలువ పనుల కాంట్రాక్టును కూడా అప్పగించేసారు. పైగా, ఒప్పందం గడువు కేవలం రెండేళ్ళు మాత్రమే కాగా ఒప్పందం కుదుర్చుకున్నాక సుమారు ఆరేళ్ళ తర్వాత, ఒప్పందంలో మొదట నిర్దేశించిన గడువు ముగిసిన నాలుగేళ్ళ తర్వాత అంటే, 2011 ఫిబ్రవరిలో మాత్రమే పర్యావరణ - అటవీ మంత్రిత్వ శాఖకు అటవీ అనుమతుల ప్రతిపాదనలను పంపారు. నిజానికి, మొదటి స్టేజీ అనుమతి 2012 సెప్టెంబరు నాటికి కూడా రాలేదు. ప్రధాన కాలువ పనిలో 34 వ కిలోమీటరు వరకూ అటవీ భూములు లేనందువలన ఆ రీచ్ వరకు నిర్మాణం పూర్తయింది. కానీ, అటవీ అనుమతులు వచ్చిన తర్వాత మాత్రమే 34 వ కిలోమీటరు దాటిన రీచ్‌లో పని పూర్తవుతుంది.

*ii.* ***పాలనాపరమైన, సాంకేతికపరమైన మంజూరీలు :*** ప్రాజెక్టు పనులకు టెండర్లను ఆహ్వానిస్తూ ఇచ్చిన ప్రకటనను 2005 జనవరి 10 న జారీ చేసారు. ఐతే, ఆ తర్వాత, 2005 జనవరి 22 న దీనికి పరిపాలనాపరమైన మంజూరీ వచ్చింది. ప్రాజెక్టు పనుల అంచనాలకు 2006 మార్చిలో, అంటే, పనులను అప్పగించి ఏడాది పైగా గడచిన తర్వాత సాంకేతిక మంజూరీ వచ్చింది.

ప్రభుత్వ విధానాన్ని అనుసరించి, జలయజ్ఞంలోని ప్రాజెక్టులన్నింటికీ టెండర్లను పిలవడం జరిగిందనీ, టెండర్లను పిలిచిన నెలలోనే పాలనపరమైన మంజూరీ వచ్చిందనీ నీటిపారుదల శాఖ తెలిపింది. టెండరు నోటీసును జారీ చేసిన తర్వాతనే పాలనాపరమైన మంజూరీనిచ్చారు కాబట్టి, ఈ సమాధానం అంగీకారం కాదు.

## 5.3.21 శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండవ స్టేజి

### *5.3.21.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| **లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు** | *వరంగల్, ఖమ్మం, నల్గొండ జిల్లాల్లో వర్షాభావానికి గురయ్యే ప్రాంతాల్లోని 4.04 లక్షల ఎకరాలు. 284 వ కి.మీ.వరకు ఉన్న స్టేజి I కాకతీయ కాలువను 346 వ కి.మీ. వరకూ పొడిగించడమే స్టేజీ II* |
| **నీటి వనరులు** | *4.703 టీఎమ్‌సీల భూగర్భ జలాలతో పాటుగా 24.41 టీఎమ్‌సీల గోదావరి నదీ జలాలు* |
| **ప్రాజెక్టులోని అంశాలు** | *డిస్ట్రిబ్యూటరీలతో సహా మూడు బ్రాంచి కాలువల తవ్వకం; మైలవరం, బయ్యన్నవాగు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లు, ఆకేరు వద్ద ఒక అక్విడక్టు* |
| **పాలనాపరమైన మంజూరీ** | *తొలి అంచనా : ₹830.75 కోట్లు*<br>*సవరించినది : ₹1043.14 కోట్లు* |
| **ఖర్చు** | *₹824.6 కోట్లు* |
| **భూ సేకరణ** | *చేయాల్సింది : 30,000 ఎకరాలు, చేసింది : 19,869 ఎకరాలు* |

### *5.3.21.2 కీలకాంశాలు*

*i.* ***ఉమ్మడి ఆయకట్టు :*** కాకతీయ కాలువను 346 వ కిలోమీటరు వరకూ పొడిగించే పనులు, కొన్ని డిస్ట్రిబ్యూటరీల తవ్వకం, మేజర్లు, మైనర్ల పనులు జలయజ్ఞానికి ముందే మొదలయ్యాయి.జలయజ్ఞంలో కాకతీయ కాలువకు సిమెంట్ కాంక్రీట్ లైనింగ్ ఏర్పాటు, మిగిలిన డిస్ట్రిబ్యూటరీల తవ్వకం, పంట కాలువల (ఫీల్డ్ ఛానల్స్) పనులను ఏడు ప్యాకేజీలుగా చేపట్టారు.

18,790 ఎకరాలమేర ఆయకట్టు నాగార్జునసాగర్ ఎడమకాలువ కింద అంతకు ముందే ఉన్నట్లు ప్యాకేజీ - 58 పనులు జరుగుతున్న సమయంలో సంబంధిత గుత్తేదారు గమనించారు. కాబట్టి, ఈ ప్యాకేజీ కింద ఉద్దేశించిన ఆయకట్టు 50,867 ఎకరాలు కాగా, వాస్తవంగా అభివృద్ధి చేస్తోంది 32,077 ఎకరాలు మాత్రమే.

ఈపీసీ సంస్థ పూర్తిస్థాయిలో ఇన్వెస్టిగేషన్‌ను చేసిన తరవాత మాత్రమే రెండు ప్రాజెక్టుల కిందా ఒకే ఆయకట్టును ఉన్న వాస్తవం వెలుగులోకి వచ్చిందనీ, ఆయకట్టులో తగ్గుదలకు అనుగుణంగా ₹16.85 కోట్ల మొత్తాన్ని ఒప్పందం విలువ నుండి తగ్గించామనీ నీటి పారుదల శాఖ సమాధానమిచ్చింది. ఈ సందర్భంలో ఒప్పందం విలువ తగ్గించడం ప్రధానం కాదు. లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టును స్పష్టంగా గుర్తించకుండా నీటి పారుదల శాఖ పనులను ఏ విధంగా అప్పగిస్తోందన్నదే మౌలికమైన ప్రశ్న. ప్రస్తుత ఉదంతంలో డీబీఎమ్ - 71 డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థకు చిట్టచివరన (40 వ కిలోమీటరు నుండి 72 వ కిలోమీటరు వరకు) ఆయకట్టు ఉంది. కాకతీయ ప్రధాన కాలువకు చిట్ట చివరన (345.93 వ కిలోమీటరు వద్ద) ఉన్నది కూడా ఈ ఆయకట్టే. ఈ డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ కింద ఉద్దేశించిన మొత్తం ఆయకట్టు 1.63 లక్షల ఎకరాలు. ఈ డీబీఎమ్ - 71 తవ్వకం పనిని వేరు వేరు సంస్థలకు అప్పగించగా, 56 వ కిలోమీటరు వరకు పనులు దాదాపుగా పూర్తయ్యాయి. డీబీఎమ్ - 71 డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థకు సంబంధించిన పనులను (అంటే మేజర్లు, మైనర్లు, సబ్-మైనర్లు, పంట కాలువలు) విడి విడిగా చేపట్టి, ఈపీసీ విధానంలో మూడు సంస్థలకు అప్పగించారు. ఐతే, ఇప్పుడు డీబీఎమ్ - 71 వ్యవస్థ చిట్టచివరలోని 18,790 ఎకరాల ఆయకట్టును తొలగించడం అంటే, ఎక్కువ ఆయకట్టుకు ఉపయోగపడేలా ఈ డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థను డిజైను చేసి నిర్మించినప్పటికీ, వాస్తవంగా సాగు అయ్యే ఆయకట్టు తగ్గిపోయిందని అర్థం.

*ii.* ***పనుల స్థితిగతులు :*** ఈ ప్రాజెక్టు పనులను 2005 మార్చిలో అప్పగించారు.

- డిస్ట్రిబ్యూటరీల పనులన్నీ జరుగుతున్నాయి.
- 68వ డిస్ట్రిబ్యూటరీ, చిట్టచివరి డిస్ట్రిబ్యూటరీల ఇన్వెస్టిగేషన్ జరుగుతోంది.
- భూ సేకరణ జరగనందువలన, 61 వ, 65 వ డిస్ట్రిబ్యూటరీలు పూర్తికాలేదు.
- భూ సేకరణ జరగకపోవడం వలన, 56 వ కిలోమీటరు తరువాత 71 వ డిస్ట్రిబ్యూటరీ టెండర్లను రద్దు చేసారు.

కాలువ తవ్వకాన్ని రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న కారణంగా ప్యాకేజీ - 54 కోసం భూసేకరణ పూర్తికాలేదని నీటి పారుదల శాఖ తెలిపింది.

- కేటాయించిన నిధుల్లో కోతల కారణంగా శ్రీరాంసాగర్ స్టేజి II ప్రాజెక్టు తీవ్ర ఇబ్బందులకు గురయ్యింది. గత మూడు సంవత్సరాల్లో కేటాయించిన ₹270 కోట్లు, ₹560 కోట్లు, ₹250 కోట్ల నిధుల్లో వరుసగా 76, 87, 87 శాతాల మేర ప్రభుత్వం కోత విధించింది.

## 5.3.22 పి.వి.నరసింహారావు కంతనపల్లి సుజల స్రవంతి ప్రాజెక్టు (కంతనపల్లి)

### *5.3.22.1 ప్రాజెక్టు స్వరూపం*

| | |
|---|---|
| ***లక్ష్యంగా పెట్టుకున్న ఆయకట్టు*** | *శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింది 3.1 లక్షల ఎకరాల ఆయకట్టు, శ్రీరాం సాగర్ స్టేజి II కింది 4.4 లక్షల ఎకరాల ఆయకట్టు - మొత్తం 7.5 లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ* |
| ***నీటి వనరు*** | *ఆయకట్టు స్థిరీకరణ కోసం 50 టీఎమ్‌సీ గోదావరినది జలాలను ఎత్తిపోతల ద్వారా కాకతీయ కాలువకు తరలించడం* |
| ***ప్రాజెక్టులోని అంశాలు*** | *(i) కంతనపల్లి వద్ద గోదావరి పై బ్యారేజీ నిర్మాణం, (ii) స్పిల్‌వే, (iii) జలవిద్యుత్తు బ్లాకు, (iv) సొరంగాలు, లిఫ్టులు, కాలువలు* |
| ***పరిపాలనాపరమైన మంజూరీ*** | *₹10409 కోట్లు ( 2009 ఫిబ్రవరి)* |
| ***ఖర్చు*** | *శూన్యం* |
| ***లిఫ్టులు*** | *సంఖ్య : 3*<br>*ఎత్తు : 249 మీటర్లు* |
| ***విద్యుత్తు అవసరాలు*** | *878 మెగావాట్లు* |
| ***విద్యుదుత్పాదన*** | *ఉద్దేశించినది : 450 మెగావాట్లు (ఇప్పుడు 280 మెగావాట్లకి సవరించారు)* |

### *5.3.22.2 కీలకాంశాలు*

*i.* ***ప్రాథమ్యాల సరళి :*** *శ్రీరాం సాగర్ ప్రాజెక్టు (మొదటి, రెండవ స్టేజీలు)* కింద ఉన్న ఆయకట్టును స్థిరీకరించడం కోసం కంతనపల్లి ప్రాజెక్టును ప్రతిపాదించారు. కానీ, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో స్టేజీ పూర్తయి పంటలకు నీళ్లివ్వక ముందే కంతనపల్లిని చేపట్టడం జరిగింది. నిజానికి, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో స్టేజీ పనులు ఇంకా కొనసాగుతున్నాయి. ఐతే, ఒక పక్క శ్రీరాం సాగర్ ప్రాజెక్టు మొదటి స్టేజీ ఎదుర్కొంటున్న నీటి కొరతకు కంతనపల్లి ప్రాజెక్టు నుండి నీటిని తరలించాల్సిన అవసరం ఏర్పడుతుంటే, మరోపక్క శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో స్టేజీ పనులను అమలు చేయడం వెనుక హేతువు స్పష్టంగా లేదు.

శ్రీరాంసాగర్ ప్రాజెక్టు కింద  60 టీఎమ్‌సీల నీటికొరత ఉందనీ, 224 వ కి.మీ. తరవాత ఉన్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు మొదటి, రెండవ స్టేజీ ల ఆయకట్టుకు ఈ కింది కారణాల వల్ల నీటి కొరత సమస్య తరచుగా ఎదురవుతోందని నీటిపారుదల శాఖ సమాధానమిచ్చింది :

- శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో స్టేజీ పనులు కొనసాగుతున్నప్పటికీ, కాలువ పనులు పూర్తయినంత మేర పంటలకు నీటిని విడుదల చేస్తున్నామనీ, ఐతే ఆరుతడి పంటలకు అనువుగా ఈ ప్రాజెక్టును రూపొందించినప్పటికీ, నీరు సమృద్ధిగా లభిస్తుండడంతో రైతులు వరి పంటనే వేయడానికి అలవాటు పడ్డారనీ, పంటలను వేసే సరళిలో ఈ మార్పు వల్ల శ్రీరాంసాగర్ ప్రాజెక్టు రెండో స్టేజీలో నీటి కొరత ఏర్పడిందని తెలిపారు. రైతుల్లో అవగాహనను పెంచడానికి, ఆరుతడి పంటలవైపు మరలేలా వారి ఆలోచనా విధానాన్ని మార్చడానికి కొంత సమయం పడుతుందనీ నీటిపారుదల శాఖ తెలిపింది.
- పూడిక పేరుకుపోవడం వలన కూడా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు జలాశయం సామర్థ్యం గణనీయంగా తగ్గిపోయింది.

*ii.* ***ప్రాజెక్టు అనుమతులు :*** అవసరమైన అనుమతులను పొందకుండానే 2009 మే లో ఈ ప్రాజెక్టుకు టెండర్లను ఆహ్వానించారు. ఐతే బిడ్డర్లనుండి స్పందనలేదు.

పాలనాపరమైన మంజూరీ (2009 ఫిబ్రవరి) ఇచ్చి మూడేళ్లు గడిచినా ప్రాజెక్టు ఇంకా మొదలు కాలేదు.